వేదసూక్తాదులు

(అనువాద సహితం)

సంకలనం - అనువాదం

డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మ

ఎం.ఏ. (సం), ఎం.ఏ. (తె), పిహెచ్.డి.

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2018

VEDASUKTHADULU

By
Dr. Chirravuri Sivaramakrishna Sarma

T.T.D. Religious Publications Series No. 1273
© All Rights Reserved

First Print : 2018

Copies : 3,000

Published by
SRI ANIL KUMAR SINGHAL, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.

ముందుమాట

వేదం ఒక జ్ఞానం, ఒక విజ్ఞానం. వేదం అలౌకికానికి మాత్రమే చెందింది కాదు. లౌకికాన్ని నిర్దేశిస్తూ అలౌకికానికి మార్గం చూపించేది. ఈ మార్గంలో వేదాధ్యయనం, పరిశోధన నిత్యనూతనంగా జరుగుతూనే ఉండాలి. సమాజానికి, సమాజాభ్యున్నతికి వేదం ఎంత ఉపయోగకారియో వేదవిజ్ఞానం మనకు తెలియజేస్తూ ఉంది.

వేదంలో ఉన్న లౌకిక విషయాలు కొన్ని సూక్తాలుగా అందుతున్నాయి. సూక్తికి సూక్తానికి తేడా ఉంది. సూక్తి అంటే మంచిమాట మాత్రమే. వేదోక్తమైన స్తోత్రంగాని, మంత్రంగాని సూక్తం అనబడుతుంది. ఇలాంటి వేదవచనాలను మాత్రమే సూక్తాలు అంటారు.

వేదాల్లోని పదునైదు అంశాలనుంచి పదునైదు సూక్తాలను ఈ గ్రంథ రచయిత చిఱ్ఱావూరి శివరామకృష్ణ గారు సంతరించి వాటికి తెలుగు అనువాదాన్ని జోడించారు. మూల వేదమంత్రాలకు చక్కని తెలుగు అందించడం వల్ల వేదవాఙ్మయంలోని లౌకికాంశాలు తెలుగుపాఠకులు అవగాహన చేసుకొనేందుకు, వేదప్రామాణ్యంపట్ల ఆసక్తి, గౌరవం పెరిగేందుకు దోహదం అవుతున్నది.

అశ్వినీదేవతలు దేవవైద్యులు మాత్రమే కాదు. ఆశ్వినసూక్తం చదివితే వారెంత పరోపకార పరాయణులో తెలుస్తుంది. చ్యవన మహర్షికి పునర్‌యౌవనం ప్రసాదించింది వారే!

ప్రాణులందరికి తల్లి పృథివి. భూతభవిష్యద్వర్తమాన పదార్థాలను రక్షించేది భూమి. ప్రాణులకు సంక్రమించే రోగాలనుండి కాపాడే ఓషధులను ధరిస్తుంది. ఇలా మరెన్నో విషయాలు పృథ్వీసూక్తం చదివినవారికి తెలుస్తుంది.

పరస్పర వివాదాలు సమసి విద్వేషాలు తొలగిపోయేందుకు చేసేది సాంమనస్య కర్మ. అధర్వణ వేదంలోని సాంమనస్య సూక్తం ఈ విషయం తెలియజేస్తుంది.

ఉదకం దేవతాస్వరూపమయింది. ముఖంమీద నీళ్లుచల్లితే మూర్ఛరోగికి స్పృహ వస్తుంది. నీరు ప్రాణాధారం కదా! చదువదగ్గది తెలుసుకో దగ్గది సలిలసూక్తం.

సూర్యుని తేజస్సు కారణంగా వాతపిత్త శ్లేష్మాలు కలుగుతాయి. వీటి ప్రకోపంవల్ల రోగాలు సంక్రమిస్తాయి. అధర్వవేదంలో ఆయుర్వేద విషయాలున్నాయి. భైషజ్యసూక్తాలు వీటిని వివరిస్తాయి.

ఈ విధంగా వేదాల్లోని సూక్తాలతోపాటు పనసలు, అనువాకాలతో కూడిన ఈ "వేదసూక్తాదులు" గ్రంథంలో జనోపయోగి మహత్తర విషయాలెన్నో దాగి ఉన్నాయి.

సమాజంలో సవ్యంగా సంస్కారవంతంగా నడచుకోవాలనుకొనే ప్రతివారు చదువదగ్గ గ్రంథం ఈ వేదసూక్తాదులు. వైదిక భాషలో వ్రాయబడ్డ ఇటువంటి సూక్తాలను సంకలనం చేసి చక్కని తెలుగులో అనువాదం చేసి తి.తి.దేవస్థానానికి సమర్పించిన డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ గారికి ధన్యవాదాలు.

ఈ గ్రంథం పాఠకుల ఆదరణ తప్పక పొందుతుంది. చదవండి, చదివించండి.

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

నివేదనము

వేదంలో లౌకిక విషయాలున్న సూక్తాలను కొన్నింటిని అనువదించమని ఆచార్య రవ్వాశ్రీహరి ఎడిటర్-ఇన్-చీఫ్, తి.తి.దేవస్థానముల వారు ప్రేరేపించారు.

వారి ప్రేరేపణకు అక్షరాకృతి ఈ కృతి. అశ్వినీ దేవతలు పరోపకార పరాయణులు. వారు దేవవైద్యులు. వారి ఉపకారాల్లో వైద్యం కూడా ఉంటుంది. ఆశ్విన సూక్తాలు చాలా ఉన్నా వాటిలో మచ్చు కిది గ్రహించాను.

పృథివీసూక్తం పృథివియందు గౌరవాన్ని పెంచేది. ఇది ఆకర్షణీయమైన వర్ణనతో ఉంది.

సాంమనస్యసూక్తం ఐకమత్యం కలిగించేది. వాస్తోష్పతిసూక్తం గృహ నిర్మాణానికి చెందినది.

నాసదీయ సూక్తం ప్రళయకాల స్థితిని, తరువాత సృష్టి ప్రారంభస్థితిని తెలుపుతుంది. ఇప్పుడు 'బిగ్ బ్యాంక్ థియరీ' పరిశోధనలు సాగుతున్నాయి. సృష్టి ప్రారంభాన్ని గురించి వేదమాత అభిప్రాయం దీనిలో వెల్లడవుతుంది.

భైషజ్యసూక్తాలు చికిత్సకు చెందినవి. వీటిలో కొన్ని ఓషధుల వినియోగాలున్నాయి.

సంచరణ ప్రాధాన్య మంత్రాలు బద్ధకం వదిలి ముందుకు సాగాలని ఉద్బోధిస్తాయి.

భూమికర్షణం బీజావాపం ప్రాచీన కాలంలో కృషి (వ్యవసాయం) సనాతన సంస్కృతిలో ఎలా ఉందో వెల్లడిస్తుంది.

'శింశుమారం' వేదంలో ఖగోళ వర్ణన ముండడం, అది సైన్సుకు కూడా నిలబడడం తెలుపుతుంది.

నమకంలో హరప్పారుద్రుడు హరప్పాసంస్కృతికి, వేదమునకు సంబంధం తెలుపుతుంది. సంఖ్యా వాచకాలు – సున్న వ్యాసం భారతీయ గణిత శాస్త్రానికి వేదం మూలమని తెలుపుతూ సున్న చరిత్రను వెల్లడిస్తుంది. సున్న చరిత్ర భారతీయ గణిత శాస్త్రంలో చేరదగింది.

అన్నసూక్తం అన్నదాన ప్రాధాన్యం తెలుపుతుంది. కుంతాపసూక్తం నీతి బోధకం. ఈ సూక్తానికి సాయణాచార్య భాష్యం లేదు.

ఋగ్వేదంలో, అధర్వణవేదంలో కొన్ని మంత్రసమూహాలను సూక్తాలంటారు. కృష్ణయజుర్వేదంలోను, బ్రాహ్మణంలోను, ఆరణ్యకంలోను సూక్తాలనే వాడుక తక్కువ. వాటిలో పనసలు, అనువాకాలు ఉన్నాయి. కాబట్టి వేదసూక్తాదులు అని పేరు పెట్టడం జరిగింది. కుంతాపసూక్తానికి తప్ప మిగిలిన వాటిని సాయణాచార్యభాష్యం ఆధారంగా వివరణం చేయడం జరిగింది. కుంతాపసూక్తానికి క్షేమకరణదాస్ త్రివేదిగారి వ్యాఖ్యను అనుసరించాను. వారివురికి కృతజ్ఞతలు.

నన్నీ గ్రంథం వ్రాయుమని ప్రేరేపించిన ఆచార్య రవ్వా శ్రీహరి ఎడిటర్–ఇన్–చీఫ్, తిరుమల తిరుపతి దేవస్థానముల వారికి ధన్యవాదములు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యచరణాలకు ప్రణామాలు.

ఇట్లు
వివరణకర్త
చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ

విషయానుక్రమణిక

		పుటలు
1 నివేదనము		v - vi
2 ఆశ్వినసూక్తం	ఋగ్వేదం	1–13
3. పృథివీసూక్తం	అథర్వణవేదం	14–33
4. సౌమనస్యసూక్తం	అథర్వణవేదం	34–36
5. వృష్టిసూక్తం	అథర్వణవేదం	37–43
6. సలిలసూక్తాలు	అథర్వణవేదం	44–56
7. వాస్తోష్పతిసూక్తం	అథర్వణవేదం	57–60
8. నాసదీయసూక్తం	ఋగ్వేదం	61–64
9. భైషజ్యసూక్తాలు	అథర్వణవేదం	65–78
10. సంచరణప్రాధాన్యం	ఐతరేయబ్రాహ్మణం	79–83
11. భూషికర్షణం–బీజావాపం–తైత్తిరీయశాఖ–శ్రీకృష్ణయజుర్వేదం		84–93
12. శింశు మారం – విశ్వచిత్రం తైత్తిరీయారణ్యకం శ్రీకృష్ణయజుర్వేదం		94–96
13. నమకంలో హరప్పారుద్రుడు శ్రీకృష్ణయజుర్వేదం		97–99
14. సంఖ్యావాచకాలు–సున్న, శ్రీకృష్ణయజుర్వేదం – ఋగ్వేదం		100–103
15. అన్నసూక్తం	తైత్తిరీయబ్రాహ్మణం	104–108
16. కుంతాపసూక్తాలు	అథర్వణవేదం	109–141

2. ఆశ్వినసూక్తం (ఋగ్వేదం 1మం-116 సూ.)

ఈ సూక్తానికి ఋషి కక్షీవంతుడు. ఇతడు దీర్ఘతమసునికి కుమారుడు. ఇతని తల్లి ఉశిక్కు. ఈ సూక్తానికి దేవతలు అశ్వినులు. త్రిష్టుప్ ఛందస్సు.

మం. నా సత్యాభ్యాం బర్హిరివ ప్రవృఞ్జే
స్తోమాం ఇయర్మ్యభ్రియేవ వాతః
యావర్భగాయ విమదాయ జాయాం
సేనాజువా న్యూహతూ రథేన ॥

యజమానుడు యాగంకోసం సమృద్ధంగా దర్భలను సంపాదించినట్లు నేను అశ్వినీ దేవతలకు స్తుతులను సంపాదిస్తున్నాను. మేఘాలలోని నీటిని వాయువులు వర్షంకోసం ప్రేరేపించినట్లు నేను స్తుతులను అశ్వినీ దేవతలకోసం ప్రేరేపిస్తున్నాను. విమదుడనే రాజర్షి యువకుడు. అతనికి స్వయంవరంలో భార్య లభించింది. అతడామెను తీసుకుని ఇంటికి వస్తున్నాడు. ఆ కన్యచే వరించబడని రాజులు అతనిని మార్గమధ్యంలో అడ్డుకున్నారు. అతడు వారిని జయించలేకపోయాడు. అశ్వినీ దేవతలు రథంతో వచ్చి శత్రుసేనను తరిమి ఆ నవదంపతులను వారింటికి చేర్చారు. అలా పరోపకారులయిన అశ్వినీదేవతలను స్తుతిస్తున్నానని భావం.

మం. వీళు పత్మభి రాశుహేమభిర్వా
దేవానాం వాజూతిభిః శాశదానా
తద్రాసభా నాసత్యా సహస్ర భాజా
యమస్య ప్రధనే జిగాయ ॥

ఓ అశ్వినీ దేవతలారా! ఇంద్రాదులచే ప్రేరేపింపబడిన మీరు బలంగా ఎగిరేవి, శీఘ్రంగా వెళ్ళేవి, దేవతల ప్రేరణ గలవి అయిన వాహనాలతో వెడతారు. మీ వాహనాలకు పూన్చబడిన రాసభం యమప్రీతి కలిగించే రణంలో వేయిమంది శత్రువులను జయించింది.

మం. తుగ్రోహ భుజ్యు మశ్వినోదమేఘే
రయింన కశ్చి న్మమృవా అవాహాః
తమూహథు ర్నౌభి రాత్మ న్వతీభి
రన్తరిక్ష ప్రుద్భి రపోదకాభిః ॥

తుగ్రు అశ్వినీ దేవతలకు ప్రియుడయిన రాజర్షి. అతడు ఇతర ద్వీపాలలో ఉండే శత్రువులచే ఉపద్రవంపొంది వారిని జయించడంకోసం తన కుమారుడైన భుజ్యువును సేనాసహితంగా నావపై పంపాడు. ఆ నావ చాలా దూరం వెళ్ళి సముద్రం మధ్య వాయువశంచే పగిలిపోయింది. అపుడు శీఘ్రంగా అశ్వినీ దేవతలను స్తుతించాడు. వారు సేనాసహితంగా అతనిని తమ నావలందు ఎక్కించుకొని మూడు రోజులలో అతని తండ్రియైన తుగ్రుని చెంతకు చేర్చారు. ఈ విషయం మూడు ఋక్కులలో తెల్పబడుతోంది.

తుగ్రుడు పూర్వం శత్రువులచే పీడింపబడి వారిని జయించడంకోసం భుజ్యుడనే తన ప్రియపుత్రుని వెళ్ళమని సముద్రంపై నావలో పంపించాడు. మరణించే ధనలోభి అయిన మనుష్యుడు ధనాన్ని విడిచినట్లు అతనిని పంపాడు. ఓ అశ్వినీ దేవతలారా! సముద్రం మధ్యలో మునిగిపోయే ఆ భుజ్యువును అతని తండ్రి దగ్గరకు మీరు చేర్చారు. మీ నావలు జనులను బాగా మోయగలిగినవి. అవి బాగా స్వచ్ఛంగా ఉండి నీటిపైనే ప్రయాణం చేస్తాయి. వాటిలో నీరు కొంచెం కూడా ప్రవేశించదు. ఆ నావలతో భుజ్యుని ఇంటికి చేర్చారు.

మం. తిస్రః క్షప స్తిరహాతి వ్రజద్భి
ర్నాసత్యా భుజ్యుమూహథుః పతఙ్గైః
సముద్రస్య ధన్వన్నార్ద్రస్య పారే
త్రిభీ రథై శ్శతపద్భి ష్షడశ్వైః ॥

ఓ నాసత్యులారా! సేనతో కూడా నీటిలో మునిగే భుజ్యువును, సైన్యాన్ని మూడురాత్రులు, మూడు పగళ్ళు ప్రయాణించే మూడు రథాలతో తీసుకు వెళ్ళారు. సముద్రమధ్యంలోను, నీరులేని ప్రదేశంలోను, సముద్రతీరం బురదపైన ప్రయాణంచేసి, నూరు చక్రాలతో, ఆరశ్వాలతో కూడినవా రథాలు.

మం. అనారంభణే తవ వీరయేథా
మనాస్థానే అగ్రభణే సముద్రే
యదశ్వినా ఊహథుర్భుజ్యు మస్తం
శతారిత్రాం నావ మాతస్థివాంసమ్

ఓ అశ్వినీ దేవతలారా! ఆలంబనంలేని సముద్రంపైన మీరు విక్రమంతో కూడిన పనిచేశారు. అక్కడ భూమిలేనందున నిలబడడానికి వీలుకాని జలప్రదేశం. చేతితో పట్టుకోవడానికి చెట్టుకొమ్మలు మొదలయినవి లేవు. నూరు తెడ్లు కలది, శీఘ్రంగా వెళ్ళేది అయిన నావపైన భుజ్యువును కూర్చోబెట్టుకుని అతని తండ్రి గృహానికి చేర్చారు. అతని నింటికి చేర్చడం ఇతరుల కశక్యం. ఆ పని మీరు చేశారు.

మం. యమశ్వినా దదథుః శ్వేతమశ్వ
మఘాశ్వాయ శశ్వ దిత్స్వస్తి
తద్వాం దాత్రం మహి కీర్తేన్యం భూ
త్పైద్వో వాజీ సదమిద్ధవ్యో అర్యః ॥

పేదువనే రాజర్షి అశ్వినులను స్తుతించాడు. వారు సంతోషించి తెల్ల గుర్రాన్ని అతనికి ఇచ్చారు. ఆ గుర్రం అతనికి జయం కలిగించింది. ఆ విషయమీ మంత్రంలో ఉంది.

ఓ అశ్వినీ దేవతలారా! మీరు పేదు రాజర్షికి తెల్లని రంగుగల గుర్రాన్ని ఇచ్చారు. ఆ గుర్రం అతనికి నిత్యం జయం ఇచ్చింది. ఆ గుర్రాన్ని చంపలేరు.

మీ దానం గొప్పది, అందరిచే ప్రశంసింపదగింది. ఆ పేదువు అశ్వం శీఘ్రంగా వెళ్ళేది, యుద్ధాల్లో శత్రువులను తరిమేది. ఆ గుర్రం ఎల్లప్పుడు మాచే ఆహ్వానింపదగినది.

మం. యువం నరా స్తువతే పజ్రియాయ
కక్షీవతే అరదతం పురంధిమ్
కారోతరా చ్ఛపాదశ్వస్య వృష్ణః
శతం కుంభాం అసించతం సురాయాః ॥

పూర్వం కక్షీవంతుడనే ఋషి తమోగుణంచే కప్పబడిన జ్ఞానంకలవాడై జ్ఞానంకోసం అశ్వినీ దేవతలను స్తుతించాడు. అతనికి అశ్వినీ దేవతలు గొప్ప బుద్ధిని ప్రసాదించారు. ఆ విషయమీ మంత్రంలో ఉంది. నాయకులైన అశ్వినీ దేవతలారా! అంగిరసుని వంశంలో పుట్టిన కక్షీవంతుడు మిమ్ము స్తుతించాడు. అతనికి గొప్ప బుద్ధిని ప్రసాదించారు. అతనికి మీవల్ల అన్ని విషయాలు గోచరమయ్యే బుద్ధి కలిగింది.

మం. హిమేనాగ్నిం ఘ్నం సమవార యేథాం
పితుమతీ మూర్జ మస్మా అధత్తమ్
ఋబీసే అత్రి మశ్వినావ నీత
మున్నిన్యథుః సర్వగణం స్వస్తి ॥

అత్రి ఋషిని అసురులు నూరు ద్వారాలు కల పీడా యంత్ర గృహంలో ఉంచి ఊక నిప్పుతో బాధించారు. అపుడా ఋషి అశ్వినీ దేవతలను స్తుతించాడు. వారగ్నిని నీటితో ఆర్పి అతనికి ఇంద్రియ వైకల్యం కలగకుండా బయటకు తీసుకువచ్చారు. ఈ విషయం మంత్రంలో ఉంది. ఓ అశ్వినీ దేవతలారా! అత్రిని బాధించడంకోసం అసురులు ఏర్పరచిన తుషాగ్నిని మంచువలె చల్లనైన నీటిచే మీరు ఆర్పివేశారు.

మం. పరావతం నాసత్యా నుదేథా
ముచ్చా బుధ్నం చక్రథుర్జిహ్మబారం
క్షర న్నాపో నపాయనాయ రాయే
సహస్రాయ తృష్యతే గోతమస్య ॥

ఒకప్పుడు మరుభూమిలో ఉన్న స్తోత అయిన గోతమఋషి సమీపానికి దేశాంతరంలో ఉన్న కూపాన్ని స్నానపానాది సౌకర్యానికి వీలుగా గోతమ ఋషి దగ్గరకు చేర్చారు అశ్వినీ దేవతలు. ఆ విషయమీ మంత్రంలో ఉంది.

ఓ నాసత్యులారా! కూపాన్ని గోతమఋషి దగ్గరకు స్నానపానాదులకు వీలుగా పంపారు. దప్పికతో ఉన్న గోతముడు నీరు త్రాగడానికి ఆ నూతి నీరు బయటకు ప్రవహించింది.

మం. జుజురుషో నాసత్యోతవవ్రిం
ప్రాముఞ్చతం ద్రాపిమివ చ్యవానాత్
ప్రాతిరతం జహితస్యాయు ర్దస్రా
దిత్పతి మకృణుతం కనీనామ్ ॥

శరీరానికి ముడుతలు వచ్చి, జుట్టు నెరసి, జీర్ణమయిన శరీరంకల చ్యవనుని పుత్రాదులు వదిలిపెట్టారు. ఆ చ్యవనఋషి అశ్వినీదేవతలను స్తుతించాడు. వారా ఋషికి యౌవనం కలిగించారు. ఆ విషయమీ మంత్రంలో ఉంది.

ఓ నాసత్యులారా! ముసలివాడైన చ్యవనఋషి శరీరాన్ని ఆవరించిన ముసలితనం తొలగించి మరల యౌవనం కలిగించారు. కవచధారి కవచాన్ని విడిచినట్లు చ్యవన ఋషి ముసలితనం విడిచాడు.

ఓ అశ్వినులారా! దర్శనీయులారా! పుత్రాదులచే విడువబడిన చ్యవన ఋషికి ఆయువును ఇచ్చారు.

మం. తద్వాం నరా శంస్యం రాధ్యం
చాభిష్టి మన్నా సత్యా వరూథమ్
యద్విద్వాంసా నిధిమవాప
గూళ్హముద్దర్శతా దూపథుర్వన్దనాయ ॥

వందనుడొక ఋషి. అతనిని అసురులు నూతిలో పడవేశారు. అతడు పైకి రాలేకపోతున్నాడు. అతడు అశ్వినులను స్తుతించాడు. వారతనిని నూతి నుండి ఉద్ధరించారు. ఈ విషయమీ మంత్రంలో ఉంది.

ఓ నేతలారా! అశ్వినులారా! అభిముఖంగా గ్రహించదగింది, కోరదగింది అయిన మీ ఘనకార్యాన్ని మేము ప్రశంసించాలి, ఆరాధించాలి. నిధిని దాచినట్లు అడవిలో నిర్జన ప్రదేశంలో నూతిలో గూఢంగా వందన ఋషిని దాచారు. అతనిని దప్పిక కలిగిన బాటసారులు మాత్రమే చూడగలరు. అతనిని మీరు పైకి తీశారు. మీ ఈ పని ప్రశంసింపదగినది.

మం. తద్వాం నరా సనయే దంస ఉగ్ర
మావిష్కృణోమి తన్యతు ర్న వృష్టిమ్
దధ్యఙ్ హ యన్మధ్వాథర్వణోవా
మశ్వస్య శీర్ష్ణా ప్రయదీమువాచ ॥

ఇంద్రుడు దధీచునకు ప్రవర్గ్యవిద్యను మధువిద్యను ఉపదేశించాడు. వీటిని ఇతరులకు చెపితే నీతల నరుకుతానని చెప్పాడు. తరువాత అశ్వినులు ఒక గుర్రం తల నరికారు. తరువాత దధీచుని తలనరికి ఒకచోట ఉంచి, అతనికి గుర్రం తల అతికారు. దధీచుడు ప్రవర్గ్యవిద్యకు చెందిన ఋక్కులను, యజుస్సులను, సామలను, మధువిద్యను ప్రతిపాదించే బ్రాహ్మణాన్ని అశ్వినులకు ఉపదేశించాడు. అది తెలిసిన ఇంద్రుడతని శిరస్సు నరికాడు. అశ్వినీ దేవతలతనికి (అతని) మానవశిరస్సు అతికించారు. శాట్యాయన వాజసనేయ వేదశాఖలలో ఈ విషయం విస్తరంగా ఉంది. ఆ విషయమీ మంత్రంలో ప్రస్తావించబడింది.

ఓ అశ్వినీదేవతలారా! ఇతరులు చేయలేని ఘనకార్యాన్ని మీరు చేశారు. మీరు పూర్వం చేసిన ఆ కర్మను ధనలాభం కోసం వెల్లడి చేస్తున్నాను. మేఘంలో శబ్దం, మేఘంలో వర్షజలం ఉందని వెల్లడించినట్లు ఆ విషయం తెలుపుతున్నాను.

అథర్వణుని పుత్రుడు దధీచిఋషి. అతడు మీకు మధువిద్యను చెప్పాడు. ఇలా మనిషికి గుర్రం శిరస్సును అతుకుట, తరువాత మానవ శిరస్సును అతుకుట మీరు చేసిన ఘనకార్యాలు. వాటిని వెల్లడి చేస్తున్నాను.

మం. అజో హవీన్నాసత్యా కరావాం
మహే యామన్ పురుభుజా పురంధిః
శ్రుతం తచ్ఛా సురివ వధ్రిమత్యా
హిరణ్య హస్త మశ్వినా వదత్తమ్ ॥

వధ్రిమతి ఒక రాజర్షి కుమార్తె. ఆమె భర్త నపుంసకుడు. ఆమె పుత్రులు కలగాలని అశ్వినులను ప్రార్థించింది. వారు వచ్చి కొడుకును ప్రసాదించారు. అతని పేరు హిరణ్యహస్తుడు. ఆ విషయ మీ మంత్రంలో ఉంది.

చాలామందిని పాలించినవారు, గొప్ప భుజములు కలవారు అయిన అశ్వినులారా! మేధావిని అయిన వధ్రిమతి మంచిస్తుతి చేయదగినపుడు అభిమత ఫలాన్నిచ్చే మిమ్ము స్తుతించింది. ఆమె భర్త నపుంసకుడు. ఆ వధ్రిమతి స్తోత్రపూర్వకమయిన ఆహ్వానమును ఆచార్యుని వాక్యం శిష్యు డేకాగ్రంగా విన్నట్లు మీరు విని హిరణ్యహస్తుడనే కుమారుని ఇచ్చారు.

మం. ఆస్నో వృకస్య వర్తికామభీకే
యువం నరా నాసత్యా ముముక్తమ్
ఉతో కవిం పురుభుజా యువంహ
కృపమాణ మకృణుతం విచక్షే ॥

వర్తిక (చటకమువంటి) ఒంటరి ఆడుపక్షి. అడవిలో ఉన్నదానిని కుక్క పట్టుకుంది. దానిని అశ్వినీ దేవతలు విడిపించారు. ఆ విషయం ఈ మంత్రంలో ఉంది. ఓ అశ్వినీదేవతలారా! కుక్కకు పిచ్చుకవంటి పిట్టకు జరిగిన పోరాటంలో కుక్క నోటినుండి వర్తికను విడిపించారు.

ఇక్కడ యాస్కముని ప్రతిదినం ఆవర్తించే ఉష వర్తిక. జగత్తును ప్రకాశించే, ఆవరించే సూర్యుడు వృకము. ఆ ఉషస్సును సూర్యముఖాన్నుండి అశ్వినులు విడిపించారని ప్రకృతిచిత్రపరంగా వ్యాఖ్యానించారు. అశ్వినులారా! మీరు పెద్ద చేతులు కలవారు అంధుడయిన కవియనే ఋషికి దృష్టినిచ్చి చూడగలవానిగా చేశారు.

మం. చరిత్రం హివే రివాచ్ఛేది పర్ణ
మాజా ఖేలస్య పరితక్మ్యాయామ్
సద్యో జంఘా మాయసీం విల్పలాయై
ధనేహితే సర్తవే ప్రత్యధత్తమ్ ॥

ఖేలుడనే రాజుకు అగస్త్యుడు పురోహితుడు. ఆ రాజుకు సంబంధించిన స్త్రీ విల్పల. సంగ్రామంలో శత్రువులామె పాదాలు నరికారు. పురోహితుడైన అగస్త్యుడు అశ్వినులను స్తుతించాడు. వారు వచ్చి ఇనుప పాదాలతికారు. ఆ విషయమీ మంత్రంలో ఉంది. సంగ్రామంలో విల్పల చరణాలను పక్షి రెక్కలను నరికినట్లు శత్రువులు నరికారు. ఆమె భర్త ఖేలుడు. అతని పురోహితు డగస్త్యుడు స్తుతించగా మీరు రాత్రి వచ్చారు. జయం పొందడం కోసం ఆమె వెంటనే యుద్ధానికి వెళ్ళవలసి ఉంది. కాబట్టి ఆమెకు ఇనుప పాదాలు మీరు అతికారు.

మం. శతం మేషాన్ వృక్యే చక్షదాన
మృజ్రాశ్వం తం పితాంధం చకార
తస్మా అక్షీ నాసత్యా విచక్ష
ఆధత్తం దస్రా భిషజా వనర్వన్ ॥

వృషాగిరుని పుత్రుడు ఋజ్రాశ్వ రాజర్షి. అతని సమీపంలో అశ్వినులకు వాహనమైన రాసభం ఆడుతోడేలయి ఉంది. ఋజ్రాశ్వుడు ఆ తోడేలుకు ఆహారంకోసం నూరు మేషాలను ముక్కలుగా చేసి ఇచ్చాడు. ఆ మేషాలు పౌరజనులవి. పౌరులకు అహితం చేసిన కుమారుని నేత్రహీనుడవుకమ్మని తండ్రి వృషాగిరుడు శపించాడు. అపుడు ఋజ్రాశ్వుడు అశ్వినీ దేవతలను ప్రార్థించాడు. తమ వాహనం నిమిత్తంగా అతడు గుడ్డివాడయ్యాడని అశ్వినులు ఎరిగినవారై అతనికి కన్నులిచ్చారు. ఆ విషయమీ మంత్రంలో ఉంది.

ఋజ్రాశ్వుడు వందమేషాలను ముక్కలు చేసి తాను పోషింపదగిన ఆడు తోడేలుకు ఆహారంగా ఇచ్చాడు. అతనిని తండ్రి శాపంచే గుడ్డివానిని చేశాడు. అశ్వినులారా! మీరు దేవవైద్యులు. మీరు ఋజ్రాశ్వునికి కన్నులు కనబడేలా చేశారు.

మం. ఆవాం రథం దుహితాం సూర్యస్య
కార్ష్మేవాతిష్ఠ దర్వతా జయన్తీ
విశ్వేదేవా అన్వమన్యన్త హృద్భిః
సముశ్రియా నా సత్యా సచేథే ॥

సవిత తన కుమార్తె సూర్యను సోమరాజున కివ్వాలని అనుకున్నాడు. దేవతలు దీనిని వారించారు. వారు పరస్పరం ఇలా అనుకున్నారు. 'ఆదిత్యుని హద్దుగా చేసుకుని పరుగు పందెం ఏర్పాటు చేద్దాం. మనలో ఎవరు గెలుస్తారో వారీ సూర్యను స్వంతం చేసుకుంటారు అని నిర్ణయించుకున్నారు. దేవతలలో అశ్వినీదేవతలు విజయం సాధించారు. ఆ విషయమీ మంత్రంలో ఉంది.

ఓ అశ్వినులారా! మీ రథం పరుగు పందెమునకు హద్దు స్తంభం వంటిది. (ఆ హద్దు స్తంభం పందెంలో పాల్గొనే అందరికంటే ముందు గమ్యస్థానం దగ్గర ఉన్నట్లు అశ్నిను లందరికంటె ముందు గమ్యం చేరారని

భావం.) మీ అశ్వం కారణంగా మీరు జయించడంవల్ల సవిత కుమార్తె మీరథం అధిష్ఠించింది. ఇతర దేవతలు దీని నంగీకరించారు. అపుడు అశ్వినులు వేయి ఋక్కులు లభించిన కాంతితో కూడి ఉన్నారు.

మం. యద యాతం దివోదాసాయ వర్తి
ర్భరద్వాజాయాశ్వినా హయన్తా
రేవ దువాహ సచనో రథోవాం
వృషభశ్చ శింశుమారశ్చ యుక్తా ॥

ఓ అశ్వినీ దేవతలారా! స్తుతులతో ఆహ్వానం చేయబడే మీరు హవిస్సును సంపాదించే దివోదాసనే రాజర్షికి అభీష్టఫలం ఇవ్వడం కోసం వెళ్ళినపుడు సంపదతో కూడ మిమ్ము రథం వహించింది. ఆ సంపద దివోదాసుకు చేర్చింది. ఆ రథాన్ని వృషభం, శింశుమారం వహించాయి. ఇవి విరుద్ధజంతువులయినా అశ్వినుల సామర్థ్యాన్ని ప్రకటనం చేయడంకోసం వాటిని పూన్చారు.

మం. రయిం సుక్షత్రం స్వపత్య మాయుః
సువీర్యం నాసత్యా వహన్తా
ఆ జహ్నావీం సమన సోప
వాజైస్తిరహ్నోభాగం దధతీ మయాతమ్ ॥

ఓ అశ్వినీదేవతలారా! శోభనమయిన బలం, ధనం, మంచి పుత్రాదులతో కూడినది, మంచి వీర్యముతో కూడినది అయిన అన్నమును ధరించుచున్న మీరు సమాన మనస్సుకలవారై జహ్నుమహర్షి సంతానమునకు అభిముఖంగా రండి. ఆ జహ్నూ సంతానము ప్రతి సవనంలో హోమం ఉన్న సోమయాగం చేస్తున్నారు.

మం. పరివిష్టం జాహుషం విశ్వతః సీం
సుగేభి ర్నక్త మూహథూ రజోభిః

విభిందునా నా సత్యా రథేన వి
పర్వతాం అజరయూ అయాతమ్ ॥

జాహుషుడని ఒక రాజు. ఓ అశ్వినులారా! శత్రువులు చుట్టుముట్టిన ఆ రాజును అన్నిటినీ భేదించే మీ రథంతో రాత్రివేళ బాగా ప్రయాణించుటకు బాగున్న రంజకమార్గాలలో శత్రుసమూహంనుండి బయటకు తీసుకు వచ్చారు.

మం. ఏకస్యా వస్తో రావతం రణాయ
వశమశ్వినా సనయే సహస్రా
నిరహతం దుచ్ఛునా ఇంద్రవంతా
పృథుశ్రవసో వృషణా వరావతీః ॥

ఓ అశ్వినీదేవతలారా! వశుడనే ఋషిని రోజుకు సహస్రధనం లభించేలా రక్షించారు. కోరికలను వర్షించే వారలారా! మీరు ఇంద్రునితో కూడి దుఃఖాన్ని కలిగించేవారు, విస్తీర్ణకీర్తి కలవారు అయిన శత్రువులను నిశ్శేషంగా నాశం చేశారు. (కన్యాకుమారుడైన పృథుశ్రవసుడనే రాజు శత్రువులను నాశం చేశాడు.)

మం. శరస్య చిదార్చ త్కస్యావతాదా
నీచాదుచ్చా చక్రథుః పాత వేవాః
శయవే చిన్నాసత్యా శచీభి
ర్జ సురయే స్తర్యం పిప్యథుర్గామ్ ॥

ఓ అశ్వినీదేవతలారా! ఋచత్కుని కుమారుడైన శరుడనే స్తోతకు బాగా దప్పిక వేస్తే లోతుగా ఉన్న నూతినుండి నీరు పైకి వచ్చేలా చేశారు. అలసిపోయిన జసురుడనే ఋషి నిమిత్తం నివృత్త ప్రసవ అయిన గోవును అగ్నిహోత్రం కోసం పాలుగలదానిగా చేశారు.

మం. అవస్యతే స్తువతే కృష్ణియాయ
ఋజాయతే నా సత్యా శచీభిః
పశుం న నష్టమివ దర్శనాయ
విష్ణ్వాప్నం దధథు ర్విశ్వకాయ ॥

ఓ అశ్వినులారా! రక్షణాన్ని కోరి స్తుతించే కృష్ణియునకు, ఆర్జవం కోరే విశ్వకాయఋషికి విష్ణ్వాప్నుడనే (నశించిన) కుమారుని ఇచ్చారు. కనబడని పశువును యజమానుని దృష్టిపథంలో పడేటట్లు చేసినట్లు మీరు చేశారు.

మం. దశరాత్రీరశివేనా నవద్యా
నవ నద్ధంశ్నథిత మప్స్వ న్తః
విప్రుతం రేభ ముదని ప్రవక్త
మున్నిన్యథుః సోమమివ స్రువేణ ॥

పూర్వం రేభర్షిని ఒక రోజు సాయంకాలం అసురులు పాశాలచే కట్టి నూతిలో పడవేశారు. అత డశ్వినులను స్తుతిస్తూ నూతిలో తొమ్మిది దినములు, పది రాత్రులు ఉన్నాడు. పదవరోజు ఉదయం వారు అతనిని నూతినుండి తీశారు. ఆ విషయమీ మంత్రంలో ఉంది.

అసురులచే నూతి నీటిలో పడవేయబడినవాడు దుఃఖం కలిగించే పాశాలచే కట్టబడినవాడు, శత్రువులచే హింసించబడినవాడు, పదిరాత్రులు తొమ్మిది పగళ్ళు నూతిలో ఉన్నవాడు, శరీరం బాగా నానినవాడు, కాచబడిన ఘర్మంవలె వ్యథతో సంతాపించేవాడు అయిన రేభుని ఆ కూపాన్నుండి పైకి తీసుకువచ్చారు.

అగ్నిహోత్రహోమంకోసం దంచి తీయబడిన సోమరసం అగ్నిహోత్ర స్థాలిలో ఉండగా అధ్వర్యుడు స్రువంతో పైకి తీసినట్లు అతనిని మీరు పైకి లాగారు.

మం. ప్రవాం దంసాం స్యశ్వినా వవోచ
మస్య పతిః స్యాం సుగవః సువీరః
ఉతపశ్య న్నశ్నువ న్దీర్ఘమాయు
రస్తమివేజ్జరిమాణం జగమ్యామ్ ॥

ఓ అశ్వినీ దేవతలారా! మీరు పూర్వం చేసిన ఘనకార్యాలను చెప్పాను. నేను మంచి గోవులతో, మంచి వీరులతో ఈ రాష్ట్రానికి అధిపతిని అగుదును గాక. కన్నులతో చూస్తూ, అన్ని ఇంద్రియాలు తమ తమ విషయములను గ్రహించుటయందు సమర్థములయి ఉండగా నూరు సంవత్సరాలు జీవితం పొందుదును గాక. నిష్కంటకమయిన గృహంలో యజమానుడు ప్రవేశించినట్లు పీడలులేకుండా ముసలితనాన్ని పొందుదునుగాక.

* * *

3. పృథ్వీ సూక్తం

(ఇది అథర్వణవేదంలో పన్నెండో అధ్యాయం 1వ సూక్తం)

ఈ సూక్తాన్ని పృథ్వీ సూక్తమంటారు. దీనిలో ప్రాణులందరు పృథివికి సంతానమని, ఆమె ప్రాణులకు తల్లి అని చెప్పారు. దీనిని మాతృభూమి సూక్తమని కూడా అంటారు. ఈ మంత్రాలలో భూమి విశేషాలు, భూమిని గురించి మన కర్తవ్యాలు ఉన్నాయి. వాటిని నెరవేర్చాలనుకొనేవారికి ఉండవలసిన గుణాలు, ప్రవృత్తులు, మర్యాదలు గూడా ఉన్నాయి. ఈ క్రమంలో కష్టాలు, వాటి నివారణ సూత్రాలు ఉన్నాయి.

జాతీయావగాహన, వసుధైక కుటుంబభావన వికసించడానికి ఈ సూక్తం మిక్కిలి ఉపయోగిస్తుంది.

మం. సత్యంబృహదృత ముగ్రం దీక్షాతపో బ్రహ్మయజ్ఞః పృథివీంధారయన్తి
సానో భూతస్య భవ్యస్య పత్న్యురుం లోకం పృథివీనః కృణోతు

గొప్ప సత్యనిష్ఠ, యథార్థ జ్ఞానం, క్షాత్ర తేజం, ధర్మానుష్ఠానం, దీక్ష, దక్షత, తపశ్చర్య, త్యాగం, గొప్పజ్ఞానం, యజ్ఞం – ఇవి భూమిని, మాతృభూమిని పోషిస్తాయి; రక్షిస్తాయి.

భూత భవిష్యద్వర్తమాన పదార్థాలను రక్షించేది అయిన మాతృభూమి మాకు విస్తృత స్థానాన్ని కలిగించుగాక. స్వార్థపరులు, తామే గొప్పవాళ్ళం కావాలి అనుకునే వారు మాతృభూమికి పుష్టి, వికాసం కలిగించలేరు అనే సూచన ఇక్కడ ఉంది.

మం. అసంబాధం మధ్యతో మానవానాం యస్యా ఉద్వతః ప్రవతః సమంబహు, నానా వీర్యా ఓషధీర్యాభిభర్తి పృథివీ నః ప్రథతాం రాధ్యతాం నః

మా మాతృభూమిలో మననశీల మనుష్యుల మధ్యలో ఉచ్ఛనీచాలున్నా, సమత్వం ఐక్యభావం కూడా ఉన్నాయి. మాతృభూమి రోగాలను దూరం చేసే అనేక ఉత్తమ గుణాలు కల ఓషధులను ధరిస్తోంది. ఆ మాతృభూమి మాకు కామనాపూర్తి కీర్తి వృద్ధి సాధించుగాక.

మం. యస్యాం సముద్ర ఉతసిన్ధురాపో యస్యామన్నం కృష్టయః సమ్బభూవుః, యస్యామిదం జిన్వతి ప్రాణదేజత్ సానోభూమిః పూర్వపే యేదధాతు

మా మాతృభూమిలో మహాసాగరం, కాలువలు, చెరువులు, నూతులు ఉన్నాయి. దీనిలో ధాన్యాలు ఫలాలు శాకాదులు చాలా ఉన్నాయి. దీని యందు ప్రాణులందరూ భావిస్తూ ప్రీతిని పొందుతున్నారు. ఈ మాతృభూమి యందు వ్యవసాయం చేసేవారు, శిల్పకర్మ విశారదులు, ఉద్యమించేవారు బాగా సంఘటితంగా ఉన్నారు. ఆ ఈ మాతృభూమి మాకు సమస్త భోగాలు, ఐశ్వర్యం ఇచ్చుగాక.

ప్రాకృతిక సంపదతోపాటు విభిన్న ప్రతిభా సంపన్నులు పరస్పరం కలసి మెలసి ఉంటే భూమి సంపదలిస్తుంది.

మం. యస్యాశ్చత్రస్రః ప్రదిశః పృథివ్యా యస్యామన్నం కృష్టయ స్సమ్బభూవుః, యాబిభర్తి బహుధా ప్రాణ దేజత్ సానోభూమి ర్గోష్వప్యన్నే దధాతు

ఈ మా మాతృభూమిలో ఉద్యమశీలురు, శిల్పకళానిపుణులు, వ్యవసాయం చేసేవారు ఉన్నారు. ఈ భూమి నాలుగు దిక్కులలో, నాలుగు మూలల్లో అన్నం, ఇల్లు మొదలయినవి లభిస్తున్నాయి. భూమి ప్రాణధారణ చేసేవారిని, వృక్షాదులను పాలన పోషణ సంరక్షణలు చేస్తోంది. ఆ మాతృభూమి మా అందరకు గోవులు మేకలు మొదలగునవిస్తూ అన్నాదుల నిచ్చునది అగుగాక.

మం. యస్యాం పూర్వే పూర్వజనా విచక్రిరే యస్యాం దేవాం అసురానభ్యవర్తయన్, గవా మశ్వానాం వయసశ్చ విష్ఠా భగం వర్చః పృథివీ నో దధాతు

మా ఈ మాతృభూమిలో పూర్వులయిన ఋషులు అనేకమయిన గొప్ప కర్మలు చేశారు. వారు దేవతలను సమర్థించేవారు. హింసా నిరతులయిన అసురభావం కలవారిని జయించారు.

మా ఈ భూమి గోవులు, గుర్రాలు, పక్షులు మొదలయిన ప్రాణులకు విశేష సుఖమిచ్చేది. మా మాతృభూమి జ్ఞానం, విజ్ఞానం, ఐశ్వర్యం, తేజస్సు, శౌర్యం వృద్ధి పొందించుగాక.

మం. విశ్వంభరా వసుధానీ ప్రతిష్ఠా హిరణ్యవక్షా జగతో నివేశనీ, వైశ్వానరం బిభ్రతీ భూమిరగ్ని మిన్ద్రఋషభా ద్రవిణే నో దధాతు

ఈ మా మాతృభూమి విశ్వంలో ప్రాణులందరినీ పోషించేది. బంగారం, వెండి, రత్నాలు మొదలయిన వాటికి స్థానం. అన్ని వస్తువులకు ఆధారమయినది. బంగారం, వెండి గనులు ఆమె వక్షఃస్థలంలో ఉన్నాయి. జంగమ ప్రాణులకు, పదార్థాలకు ఈ భూమి నివాసస్థానం.

వైశ్వానరాగ్ని (ప్రాణాగ్ని) ని పోషించేదయిన ఈ భూమి శ్రేష్ఠురాలు. బలశాలి అయిన ఇంద్రదేవుడు మాకందరికీ అనేక విధాలయిన ధనమిచ్చు వాడగుగాక.

మం. యాం రక్షన్త్య స్వప్నా విశ్వదానీం దేవా భూమిం పృథివీ మప్రమాదమ్ సానో మధు ప్రియం దుహా మథో ఉక్షతు వర్చసా

నిద్ర, ఆలస్యం మొదలయినవి లేని దేవగణాలు పొరపాటు లేనివారై ఏ విశాల భూమిని రక్షిస్తున్నారో, ఆ మాతృభూమి అన్నీ ఉత్తమం, ప్రియం శుభం కలిగించే పదార్థాలతో మమ్మల్ని సంపన్నులను చేయుగాక. మాకు జ్ఞానం వర్చస్సు ఐశ్వర్యం ఇచ్చుగాక.

మం. యార్ణవేధి సలిల మగ్ర ఆసీత్ యాం మాయాభి రన్వచరన్ మనీషిణః యస్యాహృదయం పరమే వ్యోమన్త్స త్యేనావృత మమృతం పృథివ్యాః సానో భూమి స్త్విషింబలం రాష్ట్రే దధాతూత్తమే

భూమి మొదట సముద్రజలంలో ఉంది. మనన శీలురైన మనీషులు తమ నైపుణ్యంతో ఈ భూమిలో అనుగుణంగా సంచరిస్తున్నారు. ఆ భూమి హృదయం పరమాకాశంలో అమృత ప్రవాహంచే ఆవరించబడి ఉంది. ఆ భూమి మా శ్రేష్ఠమైన దేశంలో తేజస్విత, బలవత్త్వము వృద్ధి పొందించుగాక.

మం. యస్యామాపః పరిచరా స్సమానీ రహోరాత్రే అప్రమాదం క్షరన్తి, సానో భూమి ర్భూరిధారా పయోదుహామథో ఉక్షతు వర్చసా

ఈ భూమిపై నాలుగువైపులా సంచరించే పరివ్రాజకులు చల్లని నీటివలె సమదృష్టి సంపన్నమయిన ఉపదేశాలు ఇస్తున్నారు. రాత్రిపగలు మెలకువ కలవారై సంచరిస్తున్నారు. ఈ భూమి మాకు అన్ని విధాలా అన్నం, జలం, పాలు మొదలయినవి ఇస్తోంది. ఈ మాతృభూమి మాకు తేజస్వితను బలమును ప్రసాదించుగాక.

మం. యామశ్వినా వమిమాతాం విష్ణుర్యస్యాం విచక్రమే, ఇన్ద్రో యాం చక్ర ఆత్మనేఽ నమిత్రాం శచీపతిః

అశ్వినీదేవతలు ఈ భూమిని కొలిచారు. విష్ణుదేవుడీ ధరణిపై విభిన్నమైన పరాక్రమ కార్యాలు చేశాడు. ఇంద్రదేవుడు దుష్టశత్రువులు లేకుండా ఈ భూమిని శాసించాడు.

ఈ భూమి మాతృమూర్తి పిల్లలకు పాలిచ్చినట్లు మాకందరికీ ఆహార పదార్థము లిచ్చుగాక.

మం. గిరయస్తే పర్వతా హిమవన్తోఽ రణ్యంతే పృథివి స్యోన మస్తు, బభ్రుం కృష్ణాం రోహిణీం విశ్వరూపాం ధ్రువాం భూమిం పృథివీ మిన్ద్రగుప్తామ్, అజీతో హతో అక్షతో ధ్యష్ఠాం పృథివీ మహమ్

ఓ ధరణీమాతా! మీ హిమాచ్ఛాదితమయిన పర్వతాలు, వనాలు మాకు సుఖకరాలు అగుగాక. శత్రురహితుల మగుదుముగాక. ఇంద్రునిచే రక్షింపబడినది, పలురంగులు కలది అయిన భూమిపై నాశం లేకుండా ఎపుడూ పరాజయం లేకుండా, ఎవరిచేత కొట్టబడక ప్రతిష్ఠితులం అగుదుముగాక.

మం. యత్తేమధ్యం పృథివి యచ్చనభ్యం యాస్తఊర్జస్తన్వః సంబభూవుః
తాసు నో ధేహ్యభినః పవస్వ మాతా భూమిః పుత్రో అహం పృథివ్యాః
పర్జన్యః పితా స ఉనః పిపర్తు

ఓ పృథివీమాతా! నీ మధ్యభాగంలో నీ నాభిస్థానంలో మేము ప్రతిష్ఠితులం కావాలి. నీ శరీరంలో బయలుదేరే పోషణ పదార్థాలు మాకు ప్రసాదించు. మాకు పవిత్రతను కలిగించు. ఈ భూమి మా తల్లి. మనమంతా ఆమె పుత్రులం. ఉత్పాదకుడయిన పర్జన్యుడు తండ్రి. వీరు మమ్ము పూర్ణులను, సంతుష్టులను చేయుదురు గాక.

మం. యస్యాం వేదిం పరిగృహ్ణన్తి భూమ్యాం యస్యాం యజ్ఞం తన్వతే
విశ్వకర్మాణః, యస్యాం మీయన్తే స్వరవః పృథివ్యా మూర్ధ్వాః శుక్రా
ఆహుత్యాః పురస్తాత్, సానోభూమిర్వర్ధయద్ వర్ధమానా

సృజనశీలురైన మనుష్యులు ఈ భూమిపై వేదికలు నిర్మించుకొని యజ్ఞాన్ని విస్తరిస్తున్నారు. ఇక్కడ స్వచ్ఛమయిన ఆహుతుల కంటె పూర్వం యజ్ఞసంబంధ యూపాలు స్థాపిస్తున్నారు. యజ్ఞ సంబంధమయిన ఉద్ఘోషలు చేస్తున్నారు. ఆ వృద్ధిపొందే భూమి అందరకు నివాసం కలిగించుగాక.

మం. యోనో ద్వేషత్ పృథివి యః పృతన్యాత్ యోభిదాసా న్మనసాయో
వధేన, తం నో భూమే రన్ధయ పూర్వకృత్వరి.

ఓ మాతృభూమీ! మాపై ద్వేష భావనతో ఉండేవారు, సేనతో మమ్మల్ని పరాభవించాలని కోరేవారు, మనస్సుతో మాకు అనిష్టం కోరేవారు, మమ్మల్ని

పరతంత్ర బంధనంలో బిగించి కట్టడంకోసం చెడుపనులు చేసేవారు, మమ్మల్ని చంపడానికి, పీడించడానికి కోరేవారు మా శత్రువులు – వీరిని నీవు సమూలంగా నాశం చెయ్యి.

మం. త్వజ్జాతా స్త్వయి చరన్తి మర్త్యా స్త్వంబిభర్షి ద్విపద స్త్వం చతుష్పదః
తవేమే పృథివి పఞ్చ మానవా యేభ్యో జ్యోతి రమృతం మర్త్యేభ్య
ఉద్యన్త్సూర్యో రశ్మిభి రాతనోతి

ఓ పృథివీమాతా! నీనుండి పుట్టినవారు నీపై సంచరించేవారు అయి రెండు పాదాలుగల మానవాదులు, నాలుగు పాదాలు గల పశువులు వీరందరికీ నీవు రక్షణం, పోషణం చేస్తున్నావు.

ఉదయించే సూర్యుడు తన అమృత కిరణాలచేత నాలుగువైపులా ఎవరికై విస్తరిస్తున్నాడో ఆ అయిదురకాల మానవులమూ నీవారమే.

(విద్వాంసులు, వీరులు, వ్యాపారులు, శిల్పకారులు, సేవాధర్మపరులు అని అయిదురకాల మానవులు అన్ని సమాజాల్లో ఉంటారు.)

మం. తానః ప్రజాః సందుహ్రతాం సమగ్రా
వాచో మధు పృథివి ధేహి మహ్యమ్

ఓ మాతృరూపభూమీ! సూర్యకిరణాలు మాకు సంతానాన్ని, వాక్కును ప్రసాదించుగాక. నీవు మాకు మధుర పదార్థాలను, వాక్కును అనుగ్రహించు.

మం. విశ్వస్వం మాతర మోషధీనాం ధ్రువాం భూమిం పృథివీం ధర్మణా
ధృతామ్, శివాం స్యోనా మనుచరేమ విశ్వహా

శ్రేష్ఠమయిన వనస్పతులు, అన్ని రకాల ఓషధులు భూమిపై లభిస్తాయి. ఆ పృథివి విస్తృతంగా స్థిరంగా ఉండుగాక. విద్య, శూరత్వం, సత్యం, స్నేహం మొదలయిన సద్గుణాలచే రక్షించి పోషింపబడేది, శుభాన్ని కలిగించేది సుఖసాధనాలనిచ్చేది అయిన మాతృభూమిని మేమెప్పుడూ సేవిస్తాము.

మం. మహత్ సధస్థం మహతీ బభూవిథ మహాన్ వేగ ఏ జథుర్వేపథుష్టే
మహాంస్త్వేన్ద్రో రక్షత్యప్రమాదమ్, సానో భూమే ప్రరోచయ
హిరణ్యస్యేవ సంధృశి మానో ద్విక్షత కశ్చన

ఓ పృథివీమాతా! నీవు మేమందరం ఉండడానికి స్థానమిస్తున్నావు. కాబట్టి నీవు వృద్ధి పొందుతున్నావు. నీవు ఏ గమనంతో ఆకాశంలో కంపిస్తూ పయనిస్తున్నావో ఆ వేగం మిక్కిలి తీవ్రం. ఇంద్రుడు మెలకువతో నిన్ను రక్షిస్తున్నాడు. నీవు బంగారం వంటి తేజస్సు కలదానవు. మమ్మల్ని తేజస్వంతులుగా చెయ్యి. మాలో పరస్పరం ఎవరూ ద్వేష భావంతో ఉండకూడదు. మేమందరికీ ప్రియులం కావాలి.

మం. అగ్నిర్భూమ్యామోషధీ ష్వగ్ని మాపోబిభ్రత్యగ్ని రశ్మసు అగ్నిరన్తః
పురుషేషు గోష్వశ్వే ష్వగ్నయః

పృథివికి మధ్యభాగంలో అగ్నితత్త్వముంది. ఓషధులలో, నీటిలో, విద్యుత్తులో, రాళ్ళలో, మనుష్యులలో, గోవులలో, గుర్రాలు మొదలయిన పశువులలో అగ్నితత్త్వము ఉంది.

వివరణం : నీటిలోను, మేఘంలోను, ప్రాణులలోను, జఠరాగ్ని రూపంలోను అగ్ని ఉంది. ఇక విద్యుత్తు అగ్నిరూపమే కదా! భూమికి అధిష్ఠానదైవం అగ్ని. కాబట్టి ఈ అగ్ని ప్రశంస భూమిస్తుతి అవుతుంది.

మం. అగ్నిర్దివ ఆతపత్యగ్నే ర్దేవ స్యోర్వ న్తరిక్షమ్
అగ్నిం మర్తా స ఇన్ధతే హవ్యవాహం ఘృత ప్రియమ్

దివ్యలోకంలో, సూర్యరూపంలో అగ్నియే అంతటా ప్రకాశిస్తున్నాడు. విశాలమయిన అంతరిక్షం కూడా ప్రకాశరూపుడయిన అగ్నిచే ఆలోకిత మవుతోంది.

యజ్ఞంలో సమర్పించిన ఆహుతులను తీసుకు వెళ్ళేవాడు నేతి స్నేహ గుణం కలవాడు అయిన అగ్నిని మనుష్యులు ప్రదీప్తం చేస్తున్నారు.

మం. అగ్నివాసాః పృథివ్యఽ సితజ్ఞూస్త్విషీమన్తం సంశితం మాకృణోతు

నల్లని భూమియందున్న అగ్నిదేవుడు మమ్మల్ని తన ప్రకాశంతో తేజస్వంతులనుగా చేస్తున్నాడు.

మం. భూమ్యాం దేవేభ్యో దదతి యజ్ఞం హవ్యమరంకృతమ్
భూమ్యాం మనుష్యా జీవన్తి స్వధయాన్నేన మర్త్యాః
సానోభూమిః ప్రాణ మాయుర్దధాతు జరదష్టిం మా పృథివీ కృణోతు.

భూమి యందు యజ్ఞం సుశోభితమవుతోంది. యజ్ఞంలో మనుష్యులు దేవతల కాహుతులు సమర్పిస్తున్నారు.

దీనివల్ల మనుష్యులు భూమిపై శ్రేష్ఠమయిన అన్నం నీరు పొంది ప్రాణాలను ధరిస్తున్నారు. ఆ భూమి మాకు ఆయువును, ప్రాణాలను ప్రసాదించుగాక. ఆ భూమి పూర్తి ఆయువు పొందడానికి యోగ్యులుగా మమ్ము చేయుగాక.

మం. యస్తే గంధః పృథివి సంబభూవ యం బిభ్ర త్యోషధయో యమాపః
యంగన్ధర్వా అప్సరసశ్చ భేజిరే తేన మాసురభిం కృణు మానోద్విక్షత
కశ్చన

ఓ మాతృభూమీ! నీ లోపల ఉన్న శ్రేష్ఠ సుగంధం ఓషధులు, వనస్పతుల రూపంలో బయలుదేరుతోంది. దానిని అప్సరసలు, గంధర్వులు ధరిస్తున్నారు. నీవా సుగంధంతో మమ్ము గంధం కలవారిగా చెయ్యి. మాలో ఎవరూ పరస్పరం ద్వేషించుకోకూడదు. మనుష్యులందరూ పరస్పరం మైత్రీ భావంతో ఉండాలి.

మం. యస్తే గన్ధః పుష్కర మావివేశ యం సంజభ్రుః సూర్యాయా వివాహే
అమర్త్యాః పృథివీ గన్ధ మగ్రే తేన మాసురభిం కృణు మానో ద్విక్షత
కశ్చన.

ఓ భూమీ! నీ సుగంధం పద్మంలో ప్రవేశించింది. సూర్యపాణి గ్రహణ సమయంలో వాయువు సుగంధంతో వీచాడు. గంధం నీగుణం కనుక అవి నీ సుగంధాలే. వాటితో మమ్మల్ని సుగంధయుక్తులుగా చెయ్యి. ఈ ప్రపంచంలో ఎవరూ పరస్పర ద్వేషం పొందకూడదు.

మం. యస్తే గన్ధః పురుషేషు స్త్రీషు పుంసుభగోరుచిః, యో అశ్వేషు వీరేషు యో మృగేషూత హస్తిషు. కన్యాయాం వర్చోయద్ భూమే తేనా స్మాం అపి సంసృజ మానో ద్విక్షత కశ్చన

వీరపురుషులలో, సాధారణ స్త్రీ పురుషులలో ఏనుగు, గుర్రం మొదలయిన నాలుగు కాళ్ళ జీవులలో ఏ సారం (గంధం) ఉన్నదో, అవివాహిత కన్యలలో ఏ వర్చస్సు కలదో అది మాకు కలుగుగాక. మాలో ఎవరూ ద్వేషించుకొనకుందురుగాక.

వివరణం : భూమి ప్రత్యేక గుణం గంధం. అది భూమిలో సారం. భూమి నుండి పుట్టిన ప్రాణుల సారం భూసారముగా భావించి ఆ సారం తమకు కలగాలని ఇక్కడ కోరుతున్నారు.

మం. శిలా భూమిరశ్మా పాంసుః సాభూమి స్సంధృతా ధృతా
తస్యైహిరణ్య వక్షసే పృథివ్యా అకరం నమః

భూమిపైన ధూళి, చిన్నరాళ్ళు, పెద్దశిలలు ఉన్నాయి. భూమి లోపల బంగారు, వెండివంటి ఖనిజాలున్నాయి. ఆ పుడమి తల్లికి మేము నమస్కారం చేస్తున్నాము.

మం. యస్యాం వృక్షావానస్పత్యా ధ్రువాస్తిష్ఠన్తి విశ్వహా
పృథివీం విశ్వధాయసంధృతా మచ్ఛావదామసి

భూమిలో వృక్షాలు, వనస్పతులు, లతలు మొదలైనవెల్లపుడూ స్థిరంగా ఉంటాయి. (భూమి వృక్షలతౌషధి రూపంలో అందరికీ సేవలందిస్తోంది.)

ధర్మాన్ని ధరించేది, అందరినీ రక్షించేది అయిన భూమాతను మేము స్తుతిస్తున్నాము.

మం. ఉదీరాణా ఉతాసీనా స్తిష్ఠన్తః ప్రక్రామన్తః
పద్భ్యాం దక్షిణ సవ్యాభ్యాం మా వ్యథిష్మహి భూమ్యామ్

ఓ మాతృభూమీ! మేము భూమియందు కుడివైపు, ఎడమవైపు, తిరుగుతూ కూర్చుని, నిలబడి ఎపుడూ దుఃఖపడకుందుము గాక.

మం. విమృగ్వరీం పృథివీమావదామి క్షమాంభూమిం బ్రహ్మణావావృధానామ్
ఊర్జం పుష్టం బిభ్రతీమన్న భాగం ఘృతంత్వాభి నిషీదేమ భూమే.

క్షమా స్వరూపిణి, పరమ పావని, మంత్రాల ద్వారా వృద్ధి పొందినది, అయిన భూమిని మేము స్తుతిస్తున్నాము. పుష్టినిచ్చేది, అన్నరసం, బలం కలిగించేది అయిన పృథివీమాతా! మేము నీకు నేతి ఆహుతి సమర్పిస్తున్నాము.

మం. శుద్ధాన ఆపస్తన్వేఽక్షరన్తు యోనస్సేదు రప్రియే తం నిదధ్మః
పవిత్రేణ పృథివి మోత్పునాతు

ఓ మాతృభూమీ! నీవు మా శుద్ధతకోసం స్వచ్ఛ జలాన్ని ప్రవహింపజెయ్యి. మా శరీరాన్నుండి స్రవించు మలిన జలము మాకనిష్టం చేయదలచినవారి వద్దకు ప్రవహించాలి. ఓ భూమీ! పవిత్రతను కలిగించు ప్రవృత్తిచేత, ప్రవాహము చేత మేము పవిత్రులమౌతాము.

మం. యాస్తే ప్రాచీః ప్రదిశోయా ఉదీచీర్యాస్తే భూమే అధరాద్యాశ్చ పశ్చాత్
స్యోనాస్తా మహ్యం చరతే భవన్తు మానిపప్తం భువనే శిశ్రియాణః

ఓ భూమీ! తూర్పు మొదలయిన నాల్గు దిక్కులయందు, ఆగ్నేయం మొదలయిన నాలుగు మూలలందు, క్రింద, పైన సంచరించే జనులందరూ మాకు శుభం కలిగించాలి. మాకేవిధంగాను అధఃపతనం కలుగకుండు

గాక! దుష్టశత్రువులు మమ్ము ఎరుగకుందురు గాక! ఆ శత్రువులు మమ్ము సంహరించకుండా వాళ్ళనుండి మేము విముక్తులం కావాలి.

మం. మానఃపశ్చాన్మాపురస్తాన్నుదిష్ఠా మోత్తరాదధరాదుత
స్వస్తి భూమే నోభవవరీయోవిదన్ పరిపన్థినో మాయావయా వధమ్

ఓ భూమీ! మాకు తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం దిక్కులలో నీవు ప్రహరీగా తయారుచేసి సంరక్షించు. నీవు మాకు శుభాన్ని కలిగించు.

మం. యావత్తేభి విపశ్యామి భూమే సూర్యేణ మేదినా
తావన్మే చక్షుర్మామే ష్టోత్తరా ముత్తరాం సమామ్

ఓ భూమీ! స్నేహం కలిగిన (తన ప్రకాశంచే ఆనందింపజేసే) సూర్యదేవుని సమక్షంలో నీ విస్తారం దర్శించినంతకాలం మాకు ఆయుష్యవృద్ధి ఉండుగాక. అంతకాలం మాకు నేత్ర జ్యోతి తగ్గకుండా ఉండుగాక.

మం. యచ్ఛయానః పర్యావర్తే దక్షిణం సవ్య మభిభూమే పార్శ్వమ్
ఉత్తానా స్త్వా ప్రతీచీం యత్ పృష్ట్యాభి రధిశేమహే

అందరికీ ఆశ్రయభూతురాలివైన మాతృభూమీ! మేము ఎంతవరకు సుషుప్త్యవస్థలో కుడివైపు, ఎడమవైపు ఒత్తిగిలి పడుకుంటామో, పడమటవైపు కాళ్ళు చాపుకుని వెల్లకిలా పరుంటామో అంతవరకు నీవు మమ్ము సంహరించవద్దు.

మం. యత్తేభూమే విఖనామి క్షిప్రం తదపి రోహతు
మాతే మర్మ విమృగ్వరి మాతేహృదయ మర్పిపమ్

ఓ ధరణీమాతా! మేము ఓషధులు, కందమూలాలు గ్రహించడానికి, విత్తనాలు నాటడానికి నీపై త్రవ్వుతాము. అవి శీఘ్రంగా పైకి వచ్చుగాక. మావల్ల నీ మర్మస్థలాలకు, హృదయానికి హాని కలుగకుండుగాక.

మం. గ్రీష్మస్తే భూమే వర్షాణి శరద్ధేమన్తః శిశిరో వసన్తః
ఋతవస్తే విహితా హాయనీరహోరాత్రే పృథివీ నోదుహాతామ్

ఓ విశాలమైన మాతృభూమీ! గ్రీష్మం, వర్షాకాలం, శరత్తు, హేమంతం, శిశిరం, వసన్తం, హాయనాలు, రాత్రింబవళ్ళు నీకు ఏర్పరచబడినాయి. అవి మాకు సుఖప్రదాలగుగాక.

మం. యాప సర్పం విజమానా విమృగ్వరీ యస్యామాసన్నగ్నయో యేఅప్స్వన్తః
పరాదస్యూన్ దదతీ దేవపీయూ నిన్ద్రం వృణానా పృథివీ న వృత్రమ్
శక్రాయ దధ్రే వృషభాయ వృష్ణే

చలించేది, గతిశీలమైనది అయిన భూమియందు అగ్ని ఉంది. అది నీటిలో ఉంది. దేవవృత్తుల నడ్డగించే వృత్రునివంటి శత్రువులను సంహరించిన దేవరాజు ఇంద్రుని వరించిన పృథివి శక్తిమంతులు, వీర్యవంతులు సామర్థ్యం కలవారు అయిన పురుషులను ధరిస్తోంది. భూమి తన ఇరుసుపై తిరుగుతోంది. బొంగరంవలె తిరుగుతూనే అంతరిక్షంలో పయనిస్తోందని పదార్థ వైజ్ఞానికులు కొన్ని వందల సంవత్సరాలకు పూర్వం మాత్రమే తెలుసుకున్నారు. వేదర్షులు ఈ చలనాలను అనాది కాలంలోనే గుర్తించారు.

మం. యస్యాం సదో హవిర్ధానే యూపోయస్యాం నిమీయతే
బ్రహ్మాణో యస్యా మర్చ న్త్యృగ్భిః సామ్నా యజుర్విదః
యుజ్యన్తే యస్యా మృత్విజః సోమ మిన్ద్రాయ పాతవే

హవిస్సమర్పణం కోసం భూమిపై యజ్ఞమండపం నిర్మిస్తారు. ధరణిపై యజ్ఞస్తంభాలను పాతుతారు. పృథివిపైన ఋక్కులు, యజుస్సులు, సామలు పఠిస్తూ ఋత్విక్కులు అర్చన చేస్తారు. ఇంద్రునికి సోమపానం సమర్పిస్తారు. (వీటన్నిటికీ ఆశ్రయం పృథివియే అని ప్రశంస).

మం. యస్యాం పూర్వే భూతకృత ఋషయోగా ఉదానృచుః
సప్తసత్రేణ వేధసో యజ్ఞేనతపసా సహ

ప్రాచీనకాలంలో ఈ పృథివిపైన ప్రాణులకు హితాన్ని కోరేవారు, క్రాంతదర్శులయిన ఋషులు ఏడుసత్రాలు కల వేధస్సు యజ్ఞాన్ని చేశారు. తపః పూతమయిన వాక్కులతో వందనం చేశారు. (ఇపుడు అలా చేయాలని ధ్వని)

మం. సానోభూమి రాదిశతు యద్ధనం కామయామహే
భగో అనుప్రయుఙ్క్తామిన్ద్ర ఏతు పురోగవః

ఆ భూమి మాకు అవసరాలకు అనురూపమయిన కోరిన ధనాన్ని ప్రసాదించుగాక. ఐశ్వర్యం మాకు సహాయకమగుగాక. ఇంద్రదేవుడు అగ్రణి అయి ముందుకు సాగుగాక.

మం. యస్యాం గాయన్తి నృత్యన్తి భూమ్యాం మర్త్యా వ్యైఽలబాః
యుధ్యన్తే యస్యా మాక్రన్దో యస్యాం వదతి దున్దుభిః
సానో భూమిః ప్రణుదతాం సపత్నా నసపత్నం మా పృథివీ కృణోతు.

ఈ పృథివియందు ప్రసన్నతతో గానం చేస్తారు. నాట్యం చేస్తారు. దీనియందు మనుష్యులు శౌర్యంతో మాతృదేశం కోసం యుద్ధం చేస్తారు. దీనియందు శత్రువులు రోదిస్తారు. ఇక్కడ దుందుభులు వాయిస్తారు. ఈ భూమి మా శత్రువులను దూరంగా పంపుగాక. మాకు శత్రువులు లేకుండా చేయుగాక.

మం. యస్యామన్నం వ్రీహియవౌ యస్యా ఇమాః పఞ్చకృష్టయః
భూమ్యై పర్జన్య పత్న్యై నమోస్తు వర్షమేదసే

ఈ భూమిపై ధాన్యం, యవలు మొదలయిన ఆహార పదార్థాలు బాగా లభిస్తాయి. దీనిపై అయిదు రకాల మానవులు ఆనందంగా నివసిస్తున్నారు.

ఈ భూమిపై నిశ్చిత సమయంలో వర్షం పడి అన్ని పంటలు పండుతున్నాయి. పర్జన్యునిచే పోషింపబడే ఈ మాతృభూమికి వందనం చేస్తున్నాను.

మం. యస్యాః పురోదేవకృతాః క్షేత్రే యస్యా వికుర్వతే
ప్రజాపతిః పృథివీం విశ్వగర్భామాశా మాశాం రణ్యాం నః కృణోతు

దేవగణాలు సృజించిన హింసక పశువులు విభిన్నంగా క్రీడిస్తున్నాయి. సకల జీవరాశిని యీ భూమి ధరిస్తోంది. ఈ భూమియందలి ప్రతి దిక్కును ప్రజాపతి మాకు సౌందర్యసంపన్నంగా చేయుగాక.

మం. నిధిం బిభ్రతీ బహుధా గుహావసు మణిం హిరణ్యం పృథివీ దదాతుమే
వసూనినో వసుదా రాసమానా దేవీ దధాతు సుమనస్యమానా

రహస్య స్థలాల్లో ధనం, రత్నం, బంగారం, వెండి మొదలయిన నిధులు కలిగిన పృథ్వీదేవి మాకు ఖనిజ పదార్థాలను ప్రసాదించు గాక. ధనప్రదాత్రి, దివ్యరూపిణి అయిన పృథ్వి మాకు ప్రసన్నురాలై మాకైశ్వర్యమును ప్రసాదించుగాక.

మం. జనం బిభ్రతీ బహుధా వివాచసం నానాధర్మాణాం పృథివీయథౌకసమ్
సహస్రం ధారాద్రవిణస్యమే దుహాంధ్రువేవధేను రనపస్ఫురన్తీ.

అనేకవిధాల ధర్మం పాటించేవారు, విభిన్న భాషలను మాట్లాడేవారు అయిన జనులకు ఆశ్రయమిచ్చేది, నశించనిది, స్థిర స్వభావం కలది అయిన భూదేవి ఆవు పాలు ఇచ్చినట్లు లెక్కలేనంత సంపద మాకు ప్రసాదించుగాక.

మం. యస్తే సర్పో వృశ్చిక స్తృష్ట దంశ్మాహేమన్త జబ్ధో భృమలో గుహాశయే
క్రిమిర్జిన్వత్ పృథివి యద్య దేజతి ప్రావృషితన్న స్సర్పన్మోపనృపద్
యచ్ఛివం తేననోమృడ.

ఓ మాతృభూమీ! నీయందు పాము, తేలు మొదలైనవి నివసిస్తున్నాయి. అవి కుడితే బాధతోపాటు ఆకలి, దప్పిక కూడా కలుగుతాయి. అవి కుడితే

బొబ్బలు లేస్తాయి. కొన్ని క్రిములు గుహలలో ఉంటాయి. వర్షర్తువులో స్వేచ్ఛగా పాకుతుంటాయి. ఆ విషము గల ప్రాణులు మమ్ము స్పృశింపకుండు గాక. మాకు శుభాన్ని కలిగించే ప్రాణులు మాకు సుఖకరములగుగాక.

మం. యేతే పన్థానో బహవో జనాయనా రథస్య వర్త్మానసశ్చ యాతవే
యైః సంచర న్త్యుభయే భద్రపాపా స్తం పంథానం జయే మానమిత్ర
మతస్కరం యచ్ఛివం తేన నో మృడ

ఓ దేవతారూపిణీ! మనుష్యులు నడవడానికి, రథాదులు సంచరించడానికి యోగ్యమయిన మార్గాలు నీపై ఉన్నాయి. భూమిపైన పరోపకారం చేసే సజ్జనులు, స్వార్థపరులయిన దుర్జనులు సంచరిస్తున్నారు. భూదేవీ! నీవు దొంగలభయం, శత్రువుల భయం లేకుండా చెయ్యి. మేము శుభాన్ని కలిగించే బాటలో వెళ్ళి విజయం పొందుదుము గాక. ఆ మార్గాల్లో నీవు మాకు సుఖం కలిగించు.

మం. మల్వం బిభ్రతీ గురుభృద్ భద్రపాపస్య నిధనం తితిక్షుః
వరాహేణ పృథివీ సంవిదానా సూకరాయ విజిహీతేమృగాయ

గురుత్వాకర్షణ శక్తి కలిగి ఉండడంచే క్షమాగుణంతో కూడిన భూమి పుణ్యాత్ములను, పాపాత్ములను ఇద్దరినీ సహిస్తోంది. ఉత్తమ జలం ఇవ్వడంకోసం మేఘాలతో కూడిన సూర్యుని కిరణాలతో మా మాలిన్యాలను నివారించుగాక. ఈ భూమి సూర్యునికి నాలుగువైపులా విశేషంగా సంచరిస్తోంది.

మం. యేత ఆరణ్యాః పశగో మృగా వనేహితాః సింహావ్యాఘ్రాః పురుషాదశ్చరన్తి
ఉలంవృకం పృథివి దుచ్ఛునామిత ఋక్షీకాం రక్షో అపబాధయాస్మత్

ఓ భూమీ! అడవిలో పశువులను, మనుష్యులను తినే సింహం, పెద్దపులి మొదలైన జంతువులు సంచరిస్తాయి. ఉలమృగం, తోడేలు, ఎలుగుబంటి,

రాక్షసులు సంచరిస్తారు. వాటిని మాకు దూరంగా ఉంచి మమ్మల్ని నిర్భయుల్ని చెయ్యి.

మం. యేగన్ధర్వా అప్సరసో యేచారాయాఃకిమీదివః
పిశాచాన్ సర్వా రక్షాంసి తానస్మద్ భూమేయావయ

గంధర్వులు, అప్సరసలు, దొంగలు, కిమీదులు, పిశాచాలు, రాక్షసులు మొదలయిన వారిని మా నుండి దూరం చెయ్యి. ఈ మంత్రాన్ని ఇతరులను పీడించే రాక్షస లక్షణం మొదలైనవి కలవారిని మానుండి దూరం చెయ్యి అని కూడా వ్యాఖ్యానించవచ్చు.

మం. యాం ద్విపాదః పక్షిణః సంపతన్తి హంసాః సుపర్ణాః శకునా వయాంసి
యస్యాం వాతో మాతరిశ్వేయతే రజాంసికృణ్వంశ్చ్యావయంశ్చ
వృక్షాన్ వాతస్య ప్రవాముపవామను వాత్సర్చిః.

ఈ భూమియందు రెండు పాదాలు గల హంస, గరుడుడు మొదలైన పక్షులు ఎగురుతున్నాయి. దీనియందు ధూళిని, చెట్లను ఎగురగొట్టుచు వాయువు వీస్తోంది. వాయువు తీవ్రతచే అగ్నిదేవుడు కూడా తీవ్రగతితో చలిస్తున్నాడు.

మం. యస్యాం కృష్ణ మరుణంచ సంహితే అహోరాత్రేవిహితే భూమ్యామధి
వర్షేణ భూమిః పృథివీ వృతా వృతా సానోదధాతు భద్రయా
ప్రియేధామని ధామని

ఈ పృథివిపై నల్లటి రాత్రి, పగలు కలిసి ఉంటున్నాయి. ఈ పృథివి వర్షంచే ఆవరించబడి ఉంటుంది. ఈ పృథివి మమ్మల్ని శుభాన్ని కలిగించే చిత్తవృత్తులతో ప్రియమైన స్థానాల్లో ఉండేవిధంగా చెయ్యాలి.

విశే : భూమిపై మనస్సును ధారణ చేస్తే కలిగే ప్రయోజనం యోగశాస్త్రం తెలుపుతుంది.

మం. ద్యౌశ్చమ ఇదం పృథివీ చాన్తరిక్షఞ్చ మే వ్యచః
అగ్నిస్సూర్య ఆపోమేధాం విశ్వేదేవాశ్చసందదుః

ద్యులోకం, పృథివి, అంతరిక్షం, అగ్ని, సూర్యుడు, జలం, మేధాదేవత ఈ దేవతలందరూ అన్నివిధాల చలించే శక్తి (వ్యాపించే శక్తి) ప్రసాదించెదరు గాక!

విశే : వైదిక సంప్రదాయంలో సకల విశ్వం భగవానుని శరీరం. దానిలో ఉన్న సచ్చిదానంద స్వరూపుడు ఈశ్వరుడు. కాబట్టి పృథివ్యాది ప్రార్థన భగవత్ప్రార్థనే.

మం. అహమస్మిసహమాన ఉత్తరోనామ భూమ్యామ్
అభీషాడస్మి విశ్వాషా దాశామాశాం విషాసహిః

నేను శత్రువులను తిరస్కరించేవాడను, పృథివియందు విశేషంగా ప్రఖ్యాతి కలవాడను, శత్రువులకు అభిముఖంగా వెళ్ళి వారిని శిక్షించేవాడను కావాలి. అన్ని దిక్కులలో ఉండే శత్రువులను తగిన విధంగా వశం చేసుకునే వాడను కావాలి.

వివ. సమాజంలో జన్మాంతర సంస్కారాలవల్ల, చుట్టూ ఉన్న వాతావరణంలోని పరిస్థితులవల్ల కొందరు సమాజ పీడకులవుతారు. వారు అకారణంగా మంచివారికి శత్రువులవుతారు. వారిని శిక్షించకపోతే సమాజంలో దుష్టుల ప్రాబల్యం పెరిగి జనజీవితం దుఃఖమయమవుతుంది. కాబట్టి వ్యక్తులు నిర్భయంగా శత్రువుల నెదిరించేవారు కావాలి. ఒకదేశంలో మేం హింసను వదిలిపెట్టాం. కాబట్టి ఆయుధాలు మాకవసరం లేదని పూర్తిగా వదిలిపెట్టారు. అపుడు పక్కదేశంవారు ఆదేశాన్ని అవలీలగా స్వాధీనం చేసుకున్నారు. ఇపుడు వారు దేశ స్వాతంత్ర్యంకోసం ప్రయత్నిస్తున్నా ఏ దేశమూ పూనుకోవడం లేదు. తమను, తమవారిని రక్షించుకోవడంకోసం

శత్రువులను ఓడించడం హింస కాదు. తాము దీనికోసం కృషి చేస్తే ఇతరులు కూడా సహాయపడవచ్చు. తామే కృషి చేయకపోతే ఇతరులెందుకు పట్టించుకుంటారు? దుష్ట శిక్షణకు ప్రతివారూ నడుం కట్టవలసిందే అని ఈ మంత్రంలో ఉన్న ప్రబోధం.

మం. అదో యద్ దేవి ప్రథమానా పురస్తా ద్దైవేరుక్తా వ్యసర్పో మహిత్వమ్
ఆత్వా సుభూత మవిశత్తదానీ మకల్పయథాః ప్రదిశశ్చతస్రః

ఓ పృథివీ దేవీ! నీవు విస్తృతంగా లేనపుడు నిన్ను విస్తరించమని దేవతలు ప్రార్థించారు. అపుడు నీలో శ్రేష్ఠులయిన ప్రాణులు ప్రవేశించారు. అపుడు నాలుగువైపులకు విస్తరించడం వల్ల నాలుగు దిక్కుల వ్యవస్థ ఏర్పడింది.

మం. యే గ్రామా యదరణ్యం యాస్సభా అధి భూమ్యామ్
యే సఙ్గ్రామా స్సమితయ స్తేషుచారువదేమతే

భూమిపైన గ్రామాలు, నగరాలు, వనాలు, సభలు ఏర్పడిన చోట (సంగ్రామాలు = సమరాలు, సమితులు = సభలు) యుద్ధాలోచనలు జరుగుతున్నచోట మేము నిన్ను స్తుతిస్తాము.

మం. అశ్వఇవ రజో దుధువే వితాన్ జనాన్ య ఆక్షియన్ పృథివీం యాదజాయత
మన్ద్రా గ్రేత్వరీ భువనస్యగోపా వనస్పతీనాం గృభిరోషధీనామ్

భూమిపైన పుట్టిన పదార్థాలు భూమిపై ఉంటాయి. వాటిపై గుర్రాలతో సమానంగా ధూళి ఎగురుతూ ఉంటుంది. ఈ భూమి ప్రసన్నతను కలిగించేది. అగ్రణి. విశ్వాన్ని రక్షించేది. వనస్పతులను, ఓషధులను పాలించేది.

మం. యద్ వదామి మధుమత్ తద్ వదామి యదీక్షేతద్వనన్తి మా
త్విషీ మానస్మి జూతిమా నవాన్యాన్ హన్మి దోధతః

మేము పలికే పలుకు హితాన్ని కలిగించేది, మధురత్వంతో నిండినది కావాలి. మేము చూచేదంతా మాకు ప్రియము, సహాయకము కావాలి. మేము తేజస్సు, వేగం కలవారము కావాలి. ఇతరులను రక్షించు. కంపింపజేసే వారిని సంహరిస్తున్నాను.

మం. శన్తి వా సురభిః స్యోనా కీలాలోఘ్నీ పయస్వతీ
భూమి రధిబ్రవీతు మే పృథివీ పయసా సహ

శాంతిప్రదము, సుగంధముతో కూడినది, సుఖాన్నిచ్చేది, అన్నమొసగేది, జలము కలిగినది అయిన మాతృభూమి మాకు భోగానుభవ యోగ్య సామగ్రిని ఇచ్చుగాక. మాకు జలప్రదానము చేస్తూ మా పక్షాన పలుకుగాక. మమ్ము గొప్పవారిగా చెప్పునుగాక.

మం. యామన్వైచ్ఛ ద్ధవిషా విశ్వకర్మా న్తరర్ణవే రజసిప్రవిష్టామ్
భుజిష్యంపాత్రం నిహితం గుహాయదావి ర్భోగే అభవన్మాతృమద్భ్యః

విశ్వకర్మ అంతరిక్షంలో అర్ణవాన్నుండి, ప్రాథమిక ఉత్పాదక ప్రవాహాల నుండి హవిస్సుల ద్వారా భూమిని వెలువరించాడు. భోజ్య పదార్థాలతో దాచిన ఆ భండారం మాతృదేశ భక్తి కలవారికి ప్రకటమవుతుంది.

మం. త్వమస్యావపనీజనానా మదితిః కామదుఘా పప్రథానా
యత్త ఊనం తత్త ఆపూరయాతి ప్రజాపతిః ప్రథమజా ఋతస్య

ఓ ధరణీమాతా! నీవు మనుష్యులకు దుఃఖం తొలగించేదానవు. వాంఛిత పదార్థాలనిచ్చేదానవు. క్షేత్రరూపవు. విస్తారం కలదానవు. నీకు ఏమి తక్కువగా ఉందో దానిని సృష్టికి మొదట ప్రాదుర్భవించిన ప్రజాపతి పూర్ణం చేస్తాడు.

మం. ఉపస్థాస్తే అనమీవా అయక్ష్మా అస్మభ్యం సన్తుపృథివి ప్రసూతాః
దీర్ఘం న ఆయుః ప్రతిబుధ్యమానా వయం తుభ్యం బలిహృతః స్యామ

ఓ భూమీ! నీయందు పుట్టిన జనులందరూ క్షయరోగం, ఇతర రోగాలు లేనివారు; మా సమీపంలో ఉండేవారు కావాలి. మేము దీర్ఘాయుష్యం పొంది విజ్ఞానయుతులమై మాతృభూమికి హవిస్సమర్పణం చేసేవారము కావాలి.

మం. భూమే మాతర్నిదేహి మా భద్రయా సుప్రతిష్ఠితమ్
సంవిదానా దివాకవే శ్రియాం మాధేహి భూత్యామ్

ఓ మాతృభూమీ! నీవు మమ్ము కల్యాణకరమైన ప్రతిష్ఠ కలవారుగా చేయుము. ఓ క్రాన్తదర్శినీ! దేవీ! మాకు అనేక విషయాలు తెలియజేయుము. మమ్ము ఐశ్వర్యము, విభూతులతో ప్రతిష్ఠితులనుజేసి స్వర్గాన్ని పొందించు.

* * *

4. సాంమనస్య సూక్తం

పరస్పరం వివాదం చేసేవారికి పరస్పర విద్వేషం తొలగడం కోసం చేసేది సాంమనస్య కర్మ. దానిలో వినియోగించే సూక్తమిది. అథర్వణ వేదంలో నిదిది. (3-6-30)

మం. సంహృదయం సాంమనస్య మవిద్వేషం కృణోమివః
అన్యో అన్య మభి హర్యత వత్సం జాత మివా ఘ్న్యా ॥

ఓ వివాదం చేసే జనులారా! మీకు పరస్పరం విద్వేషం లేకుండా చేసే సాంమనస్యకర్మ చేస్తున్నాను. సమాన చిత్తవృత్తులతో కూడినది, పరస్పర ప్రీతితోకూడిన మనుష్యులచే ఏర్పడేది, సమాన జ్ఞానమునకు హేతువయినది అయిన సఖ్యాన్ని కలిగిస్తున్నాను. పుట్టిన దూడ, ఆవు పరస్పరప్రేమతో ఉన్నట్లు మీరు కూడ పరస్పరం అభిముఖంగా ఉండాలని కోరుకొనండి.

మం. అనువ్రతః పితుః పుత్రోమాత్రా భవతు సంమనాః
జాయాపత్యే మధుమతీం వాచం వదతు శాంతివామ్ ॥

కుమారుడు తండ్రి కోరిన పని చేసేవాడు కావాలి. తల్లి పుత్రాదులతో సమానమైన మనస్సు కలది కావాలి. భర్తతో భార్య తీయగా, శాంతిగా, సుఖంగా మాట్లాడు గాక. ఆమె భర్తతో సమాన మనస్సు కలదగుగాక.

మం. మా భ్రాతా భ్రాతరం ద్విక్షన్మా స్వసారముత స్వసా
సమ్యఞ్చః సవ్రతా భూత్వా వాచం వదత భద్రయా ॥

సోదరుడు దాయభాగం కారణంగా సోదరునికి అప్రియం చేయకుండు గాక. సోదరుని ద్వేషింపకుండుగాక. తల్లి సోదరి తన సోదరిని ద్వేషింపకుండుగాక. సోదరులందరూ సమాన ప్రవర్తన, సమాన కర్మ కలవారై కల్యాణమయిన వాగింద్రియంతో మాట్లాడుదురుగాక.

మం. యేన దేవానవియన్తినోచ విద్విషతే మిథః
తత్ కృణ్మో బ్రహ్మవో గృహే సంజ్ఞానం పురుషేభ్యః ॥

వేదం నిమిత్తంగా ఇంద్రాది దేవతలు విరుద్ధ వృత్తులను పొందుట లేదు. పరస్పరం ద్వేషించుకొనుట లేదు. సమాన జ్ఞానంవల్ల ఐకమత్యం కలిగించే సాంమనస్య కర్మ మీ గృహంలో పురుషులకోసం చేస్తున్నాను.

మం. జ్యాయస్వన్త శ్చిత్తినో మావియౌష్ట
సంరాధయన్త స్సధురా శ్చరన్తః
అన్యో అన్యస్మై వల్గు వదన్త ఏత
సధ్రీచీవాన్ వః సమనస స్కృణోమి ॥

జ్యేష్ఠ, కనిష్ఠ భావంతో పరస్పరం అనుసరించుచున్న వారై సమాన చిత్తంతో సమాన సిద్ధి కలవారై సంచరిస్తూ మీరు ఒకరినొకరు విడువకండి. ఓ జనులారా! నేను కూడా మిమ్ము కలిసి కార్యములందు ప్రవర్తించే వారుగా సమాన మనస్కులుగా చేస్తున్నాను.

మం. సమానీ ప్రపా సహ వో న్నభాగః
సమానే యోక్త్రే సహవో యునజ్మం
సమ్యఞ్చోగ్నిం సపర్యతారా
నాభిమివా భితః

ఓ సాంమనస్యం కోరే జనులారా! మీకు పానీయశాల సమానమగుగాక. అన్నభాగం కలిసి ఉండుగాక. పరస్పరానురాగవశంచే అన్నపానాదికం ఒకే చోట భుజించుదురు గాక. దానికోసం మిమ్ము ఒకే స్నేహపాశమునందు బంధిస్తున్నాను. మీరు బాగా కలిసి ఒకే ఫలాన్ని కోరు సమానజ్ఞానం కలవారు అగుచూ అగ్నిని అర్చించండి. రథచక్రానికి మధ్య ఉన్న రంధ్రం నాభి. చక్రావయవములయిన ఆకులు నియత స్థానంలో ఉండి నాభికి చుట్టూ ఉన్నట్లు మీరు ఉండి అగ్నికి పరిచర్య చేయండి.

మం. సధ్రీచీనాన్ వః సంమనస స్కృణో
మ్యేకశ్నుష్టీన్ త్సంవననేన సర్వాన్
దేవా ఇవామృతం రక్షమాణాః
సాయం ప్రాతః సౌమనసోవో అస్తు ॥

మిమ్ము ఒక పని చేయడానికి కలిసి ఉద్యుక్తులయినవారుగా, సమాన మనస్సులుకలవారుగా చేస్తున్నాను. మీకు ఒకే విధమయిన వ్యాపనం, ఒకే విధమయిన ఆహారం ఇస్తున్నాను. సాంమనస్యకర్మచే మిమ్ము వశం చేసుకుంటున్నాను. స్వర్గలోకంలో ఉండే అజరామరత్వాన్ని కలిగించే అమృతాన్ని ఐకమత్యంచే రక్షించుకుంటూన్న ఇంద్రాది దేవతలు సౌమనస్యంతో కూడి ఉన్నట్లుగా మీకు సాయం ప్రాతఃకాలాల్లో, అన్ని కాలాల్లో సౌమనస్యం కలుగుగాక.

* * *

5. వృష్టిసూక్తం (అధర్వణ-4 కా.3అ-15సూ.)

యోగులు సత్యం పలుకుతారు. వారు పలికిన వాక్యాలు సత్యమవుతాయి. అందుకే అల్లసాని పెద్దన మహాకవి విరచిత మనుచరిత్రలో ప్రవరుడు ఔషధసిద్ధునితో 'మీ మాటలు మంత్రంబులు' అన్నాడు. మహాపురుషుల చరిత్రలలో వారు పలికిన మాటలు, సత్యమయిన ఘట్టాలు మనకు కనబడతాయి.

వేదాధ్యయనతత్పరులు కూడా యోగితుల్యులు. వారు యమ నియమాదులను పాటిస్తూ వేదమంత్రపూర్వకంగా ప్రార్థన చేస్తే అది సత్యమవుతుందని వేరే చెప్పనక్కరలేదు. వర్షంకోసం వేదయోగి చేయదగిన ప్రార్థన ఈ సూక్తంలో ఉంది.

మం. సముత్పతన్తు ప్రదిశో నభస్వతీః
సమభ్రాణి వాత జూతాని యన్తు
మహ ఋషభస్య నదతో నభస్వతో
వాశ్రా ఆపః పృథివీం తర్పయన్తు

తూర్పు మొదలయిన దిక్కులందు వాయువుతో కూడి మేఘాలు పైకి రావాలి. నీటితో కూడిన మేఘాలు గాలిచే ప్రేరేపింపబడి ఒకచోట పోగుపడాలి. రంకె వేసే ఆబోతువలె వాయువుచే ప్రేరేపించబడి గర్జించే మేఘం, కురిసే వర్షం ధ్వనిస్తూ నేలను ఓషధులు మొలిచేదానిగా చేయాలి. ఓషధులు అంకురించేలా చేయాలి.

మం. సమీక్షయన్తు తవిషా స్సుదానవోపాం
రసా ఓషధీభి స్సచన్తామ్
వర్షస్య సర్గా మహయన్తు భూమిం
పృథగ్ జాయన్తా మోషధయో విశ్వరూపాః

గొప్పవి, మంచిదానం కలవి అయిన వాయువులు వర్షాన్ని కనబరచాలి. వర్షం పడేలా జనాన్ని అనుగ్రహించాలి. వర్షజలరసాలు ధాన్యం, యవలు మొదలయిన ఓషధులతో నేలలో సమూహముగా చేరాలి. వర్షజలధారలు భూమిని పూజించుగాక. వర్షధారలు అలంకరించిన భూమినుండి రకరకాల ధాన్యాలు వేరువేరుగా మొలకెత్తాలి.

మం. సమీక్షయస్వ గాయతో నభాం స్యపా
వేగాసః పృథగుద్విజన్తామ్
వర్షస్య సర్గా మహయన్తు భూమిం
పృథగ్ జాయన్తాం వీరుధో విశ్వరూపాః

ఓ వాయుగణాల్లారా! మిమ్మల్ని స్తుతించే మాకు మేఘాలను చూపండి. వేగంతో నీటి ప్రవాహాలు వేరువేరుగా ప్రవహించాలి. వర్షజలధారలు భూమిని పూజించాలి. వర్షధారలలంకరించిన భూమినుండి రకరకాల ధాన్యాలు వేరువేరుగా మొలకెత్తాలి.

పూలతో దేవతలను పూజించినట్లు తెల్లటి వర్షధారలు భూమిని పూజించాలనే భావన భూమాత యెడల గౌరవాన్ని వెల్లడిస్తుంది. నీటి ప్రవాహాలు వేరువేరుగా ప్రవహిస్తే భూమి చాలాభాగం పండడానికి హేతువౌతుంది. ప్రవాహాలన్నీ కలిస్తే వచ్చే వరదవల్ల జన ధన నష్టం ఏర్పడుతుంది. కాబట్టి ప్రార్థనలో కూడా చాలా జాగ్రత్తలు పాటించాలి.

మం. గణాస్త్వోపగాయన్తు మారుతాః పర్జన్య ఘోషిణః పృథక్
సర్గా వర్షస్య వర్షతో వర్షన్తు పృథివీ మను

ఓ వర్షాభిమాని దేవా! గర్జించే వాయుగణాలు నీ గురించి గానం చేయాలి. అనేక విధాలుగా వర్షించే వృష్టి బిందువులతో భూమిని తడుపుగాక.

మం. ఉదీరయత మరుతః సముద్రత స్త్వేషో
అర్కో నభ ఉత్ పాత యాథ

మహ ఋషభస్య నదతో నభస్వతో
వాశ్రా ఆపః పృథివీం తర్పయన్తు

ఓ వాయువులారా! సముద్రమధ్యం నుండి వర్షజలాన్ని పైకి ప్రేరేపించండి. కాంతి గల సూర్యుడు అర్చన సాధనమయిన నీటితో కూడిన మేఘాన్ని పైకి వచ్చునట్లు చేయుగాక. గొప్ప గర్జనలతో మేఘములు జలధారలతో నేలను తృప్తి పరచాలి.

మం. అభిక్రన్ద స్తనయార్దయోదధిం
భూమిం పర్జన్య పయసా సమజ్ధి
త్వయా సృష్టం బహుల మైతు వర్ష
మాశారైషీ కృశగు రేత్వస్తమ్

పర్జన్యదేవా! నీవు అంతటా గర్జించు. ఉరుములు ఉరమాలి. సముద్రాన్నుండి ఒత్తిడితో నీటిని లాగుకో. వర్షజలంతో నేలను బాగా తడుపు. నీవు కలిగించిన జలం వర్షించే మేఘాన్ని చేరాలి. వర్షధారలను కోరే సూర్యుడు కిరణాలు తగ్గి మేఘాల వెనుక అదృశ్యమగుగాక.

మం. సంవోవన్తు సుదానవ ఉత్సా అజగరా ఉత
మరుద్భిఃప్రచ్యుతా మేఘా వర్షన్తు పృథివీమను

జనులారా! కొండచిలువలవంటి నీటిప్రవాహాలు మీకు తృప్తిని కలిగించుగాక. మరుద్వాయువులచే ప్రేరేపింపబడిన మేఘాలు నేలకు అనుకూలంగా వర్షించుగాక.

మం. ఆశామాశామ్ విద్యోతతాం వాతా వాన్తు దిశోదిశః
మరుద్భిః ప్రచ్యుతా మేఘాః సంయన్తు పృథివీ మను

ప్రతి దిక్కులో మెరుపులు మెరయుగాక! దిక్కుదిక్కులయందు మేఘాలను కలిగించే వాయువులు బాగా వీచుగాక. వాయువుచే

ప్రేరేపింపబడిన మేఘాలు భూమికనుకూలంగా వర్షించడంకోసం కలియునుగాక.

మం. ఆపోవిద్యు దభ్రం వర్షం సంవోఽవన్తు
సుదానవ ఉత్సా అజగరా ఉత
మరుద్భిః ప్రచ్యుతా మేఘాః
ప్రావన్తు పృథివీ మను

మంచిదానం కల మరుత్తులారా! నీరు, మెరుపు, మేఘము, వర్షము, జగత్తుకు సంతృప్తి కలిగించుగాక. కొండచిలువలవంటి నీటిప్రవాహాలు లోకానికి సంతృప్తి కలిగించుగాక. వాయువులచే ప్రేరేపింపబడిన మేఘాలు భూమికి అనుకూలంగా ఉండి రక్షించుగాక.

మం. అపామగ్ని స్తనూభి స్సంవిదానో
య ఓషధీనా మధిపా బభూవ
సనో వర్షం వనుతాం జాతవేదాః
ప్రాణం ప్రజాభ్యో అమృతం దివస్పరి

మేఘజలంలో విద్యుద్రూపంగా ఉన్న అగ్ని విభిన్న రూపాలతో ఏకత్వం పొంది, నీటిద్వారా ఓషధులను పాలించేదై మాకు వర్షాన్ని ఇచ్చుగాక. ప్రజలకు ప్రాణాన్నిచ్చే అమృతవర్షం అంతరిక్షంలో కురియుగాక.

మం. ప్రజాపతి స్సలాదా సముద్రా దాప
ఈరయ న్నుదధి మర్దయాతి
ప్రప్యాయతాం వృష్ణో అశ్వస్య
రేతోర్వా జేతేన స్తనయిత్ను నేహి

ప్రజలను పాలించేవాడు, వర్షాన్నిచ్చేవాడు సంవత్సరరూపుడు అయిన సూర్యుడు సముద్రం నుండి నీటిని వర్షించడంకోసం తన కిరణాలతో లాగుకొనుగాక. వ్యాపించే శీలం కలది. గుర్రంవలె వేగం కలది అయిన

మేఘంయొక్క వర్షకారణమైన వీర్యం వృద్ధి పొందుగాక. ఓ పర్జన్యదేవా! మెరుపుతో కూడిన మేఘంతో మాకభిముఖంగా దయచేయి.

మం. అపోనిషించన్నసురః పితానః శ్వసన్తు
గర్గరా అపాం వరుణావనీచీ రపః సృజ
వదన్తు పృశ్ని బాహవో మణ్డూకా ఇరిణాను

వర్ష జలంతో ప్రాణాలనిచ్చే మా తండ్రి సూర్యుడు నీటిని వర్షించుగాక. అపుడు నీరు ప్రవహించే జలజలధ్వనులు కలుగుగాక. ఓ వరుణా! మేఘాల నుండి నీరు భూమిని చేరేలా అనుగ్రహించు. గడ్డిలేని నేలలో ఉన్న కప్పలు నీటిచే ప్రాణం లేచివచ్చినట్లయి బెకబెక శబ్దం చేయుగాక. ఇలా వర్షం కోసం వేదయోగి ప్రార్థన సాగింది.

కామెర్ల రోగికి లోకం పచ్చగా కనబడినట్లు కొందరు వేదద్వేషులకు వేదపఠన ధ్వని కప్పలు బెకబెకలాడినట్లు వినబడింది. ఆ భావమే తరువాతి మంత్రంలో ఉందని వారు చరిత్ర గ్రంథాల్లో ఉదాహరించారు. ఆ మంత్రం ఇది.

సంవత్సరం శశయానా బ్రాహ్మణా వ్రతచారిణః
వాచం పర్జన్య జిన్వితాం ప్రమణ్డూకా అవాదిషుః

దీనికి సాయణభాష్యామసారం భావం ఇది. నియమాల్ని పాటించే బ్రాహ్మణులవలె సంవత్సరకాలం గాలి ఎండలకు శుష్కించి పడుకుని ఉన్న కప్పలు సంవత్సరానికి వర్షజలంచే స్పృహరాగా పర్జన్యునికి ప్రీతి కలిగించే శబ్దం చేస్తున్నాయని భావం. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అన్నట్లు నీరు లేక ఎండిన ఆ కప్పలు వర్ష జలానికి సంతృప్తి పొంది సంతోషంగా అరుస్తూంటే వాటిని బ్రదికించిన పర్జన్యునికి కూడా ప్రీతి కలుగుతుందన్న మాట. ఎంత ఉదాత్త భావం కల వేదవాక్కుకు ఎలా అపార్థాలు చెప్పుకొని ప్రచారం చేసుకుంటున్నారో చూడండి.

మం. ఉప ప్రవద మండూకి వర్ష మావద తాదురి
మధ్యే హ్రదస్య ప్లవస్వ విగృహ్యాచతురః పదః

ఓ ఆడకప్పా! నీవు సంతోషం పొంది బాగా ధ్వనిచెయ్యి. నీవు వర్షం రావాలని ఆహ్వానించు. ఎటువంటి ధ్వని చేస్తే వర్షం వస్తుందో అటువంటి ధ్వని చేయుమని భావం. వర్షజలంతో మడుగు నిండగా నాలుగుకాళ్ళను ఈదుట కనుగుణంగా చాపి ఈదు. ఈతలో యథేచ్ఛగా విహరించమని భావం.

మం. ఖణ్వాఖా3ఇ ఖైమఖా3ఇ మధ్యేతదురి
వర్షం వనుధ్వం పితరో మరుతాం మన ఇచ్ఛత

ఖణ్వాఖ, ఖైమఖ, తదురి – ఇవి భిన్నజాతుల ఆడకప్పలకు పేర్లు. వివిధ జాతుల ఆడకప్పలారా! మడుగు మధ్యలో ఉన్న మీరు మీ ఘోషచేత వర్షం కలిగేలా చేయండి. ఓ రక్షించే మండూకములారా! మరుత్తుల మనస్సులను వర్షాభిముఖము అగునట్లుగా కోరుకొనండి. మీ ధ్వనిచేత వశం చేసుకొనండి.

చెట్లున్నచోట వర్షం పడినట్లు కప్పలధ్వనికి వర్షానికి ఏదో సంబంధం ఉన్నదని ఇక్కడ సూచితమవుతోంది. ఆ విషయం పరిశోధన వల్ల తేలాలి.

మం. మహాన్తం కోశ ముదచాభిషిఞ్చ
సవిద్యుతం భవతు వాతు వాతః
తన్వతాం యజ్ఞం బహుధా విసృష్టా
ఆనన్దినీ రోషధయో భవన్తు

ఓ పర్జన్యుడా! నీటికి కోశంవంటి మేఘాన్ని సముద్రం నుండి జలపూర్ణంగా ఉద్ధరించు. అంతరిక్షం మెరుపులతో ఉండాలి. తర్వాత వర్షించాలి. గాలి వర్షం పడేవిధంగా వీచాలి. వృష్టివలన అనేక విధాలుగా

వచ్చిన జలం యజ్ఞాన్ని విస్తరించుగాక. గ్రామాల్లో లభించే వరి, యవ మొదలయిన ధాన్యజాతులు, అడవిలో ఉండే తరుగుల్మాదులు వర్షజలంతో సంతోషించాలి.

ఇలా వేదర్షి కప్పవంటివి, చెట్లు చేమలుకూడా సంతోషించాలని కోరుతూ మనకు మార్గదర్శనం చేస్తున్నారు.

* * *

6. సలిల సూక్తాలు

వేద సంప్రదాయంలో భగవంతుడు విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు. ఈ విశ్వం ఆయన శరీరం. భగవంతుని స్తుతించినట్లే ఆయనలో భాగాలయిన పంచభూతాలను గూడా వేదం స్తుతిస్తుంది. నీరు ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకటి.

మం. అమ్బయో యన్త్వభి ర్జామయో అధ్వరీయతామ్
పృఞ్చతీ ర్మధునా పయః (అథర్వణ 1-4-1)

అథర్వవేదంలోని సలిల సూక్తాలలో జలస్తుతి ఉంది. యజమానులకు సోదరివలె సహాయం చేసేవి జలదేవతలు. ప్రసిద్ధ మార్గాలలో ప్రవహించే జలాలు తమ మాధుర్యరసంతో సోమం, పాలు మొదలయిన హోమ ద్రవ్యాలను కలుపుతూ యాగభూమిని చేరుతున్నాయి.

మం. అమూర్యా ఉపసూర్యే యాభిర్వా సూర్యః సహ
తానో హిన్వన్త్వ ధ్వరమ్

ఈ జలాలు ద్యులోకం నుండి వర్షరూపంలో వస్తున్నాయి. సూర్యుని సమీపంలో కూడా ఉన్నాయి. ఆ జలదేవతలు మా యజ్ఞకర్మను ఫలదాన సమర్థంగా చేయుగాక అని ప్రార్థన.

మం. ఆపో దేవీ రుపహ్వయే యత్ర గావః పిబన్తి నః
సిన్ధుభ్యః కర్త్వం హవిః

దేవతారూపములయిన ఉదకాలను ఆహ్వానిస్తున్నాను. ఈ నీరే నదులలో, చెరువులలో ఉంటే గోవులు మొదలయిన ప్రాణులు త్రాగుతున్నాయి. ప్రవహించే శీలం గల ఆ జలదేవతల నుండి పాలు, నెయ్యి మొదలయిన హవిస్సు ఏర్పడుతుంది.

మం. అప్స్వన్తరమృత మప్సు భేషజమ్
అపాముత ప్రశస్తిభి రశ్వా భవథవాజినో గావో భవథ వాజినీః

ఇలా వేదం ద్రవ ద్రవ్యాలకు నీరే మూలమని వెల్లడించింది. నీటిలో మరణాన్ని దూరం చేసే అమృతం ఉందని తెల్పింది. దీనిని పురాణ కథతో సమన్వయిస్తే సముద్రమథనంచే అమృతం పుట్టిందనే విషయం సూచింపబడుతుంది. అన్నంవల్ల ప్రాణులు బ్రదుకుతున్నాయి. అన్నానికి మూలం జలం. నీటివల్ల పంటలు పండుతాయి గదా! ఇలా నీరు మరణాన్ని దూరం చేస్తోంది.

మూర్ఛపోయిన వాడికి ముఖంపై నీళ్ళు చల్లితే స్పృహ రావడం లోక ప్రసిద్ధం. స్పృహ రాకుండా ఉంటే మరణం పొందవచ్చు కూడా. నీటికి స్పృహ తెప్పించే శక్తి ఉందన్న మాట.

నీటిలో రోగాలను నివారణ చేసే ఔషధశక్తి ఉందని కూడా వేదం తెల్పింది.

ఓషధులనుండి ఔషధాలు అంటే మందులు తయారవుతున్నాయి. ఓషధులు నీటిరసం చేత వృద్ధి పొందుతాయి. కాబట్టి నీటిలో రోగ నివారకమైన ఔషధీ శక్తి ఉందని చెప్పవచ్చు.

ఆయుర్వేదంలో కేవలం నీటినే ఔషధంగా ఉపయోగించే ప్రక్రియ ఉంది. చన్నీరు పిత్తం, విషభ్రమం, దాహం, అజీర్ణం, శ్రమ, మూర్ఛ, వాంతి తొలగిస్తుంది. పిత్తంవల్ల వేడి, దాహం, రక్తం విషమవడం, అతిసార విరేచనాలు, ప్రయాణంవల్ల కలిగిన కక్కులు, పైభాగంలో వచ్చే రక్త పిత్త రోగాలలో చన్నీరు రోగికివ్వడం మంచిదని బృహన్నిఘంటురత్నాకరం అనే వైద్యగ్రంథం చెప్పింది.

కాచిన నీరు వేగం నురుగు లేకపోతే నిర్మలం. సగానికి మరగకాచిన నీరు కఫం, మేథస్సు, వాయుదోషం, ఆమం తొలగిస్తుంది. ఉదరాగ్నిని

దీపింపజేస్తుంది. పెద్ద ప్రేగును శుద్ధం చేస్తుంది. దగ్గు, శ్వాస దోషాలను జ్వరాన్ని తొలగిస్తుంది. ఇది పథ్యం.

(నీటిచేత జనం దీర్ఘాయుష్మంతులు, రోగంలేనివారు కావాలని వేదాశీస్సులు).

కాచగా నాల్గవవంతు తగ్గిన నీరు వాతదోషాలను పోగొడ్తుంది. సగం తగ్గేదాకా కాచిన నీరు వాత పిత్త దోషాలను తొలగిస్తుంది. కాచగా నాల్గవవంతు మిగిలిన నీరు వాత పిత్త శ్లేష్మ దోషాలను తొలగిస్తుంది. కాచిన ఇనుప గుండుపై వేసిన నీరు, మట్టి కుండతో కాచిన నీరు అన్ని దోషాలను తొలగిస్తుంది. అనారోగ్యాలను తొలగిస్తుంది అని బృహన్నిఘంటు రత్నాకరమనే వైద్య గ్రంథం చెప్పింది.

మంచినీటి ప్రభావంతో గుర్రాలు బలం, వేగం కలిగినవి కావాలని, ఆవులు బలమైన మంచి పాలు కలిగినవి కావాలని వేదమాత ఆశీస్సు. ఇక్కడ గుర్రం, గోవులు ఉపలక్షణం. చెప్పవలసిన దానిలో కొంత చెప్పడం ఉపలక్షణం. గుర్రం గోవులవలె లోకానికి ఉపకరించే ప్రాణులన్నీ బలం మొదలయిన ప్రయోజనాలు పొందాలని భావం.

మం. ఆపోహిష్ఠామయోభువ స్తాన ఊర్జే దధాతన
మహే రణాయ చక్షసే (అథర్వణ 1-1-5)

ఓ జలదేవతలారా! మీరు సుఖం కలిగించే వారవ్వండి అని ప్రార్థన వేదముఖంగా జరుగుతుంది.

నీటిని త్రాగడం వల్ల ప్రాణస్థైర్యం కలుగుతుంది. వివిధాహార పదార్థాలు సుఖసాధనాలు. అవి పుట్టడానికి తోడ్పడేది జలమే. కాబట్టి జలాల్ని సుఖసాధనాలు కావలెనని వేదప్రార్థన. ఆ జలదేవతలు మనకు బలకరమయిన అన్నం ద్వారా సుఖాన్ని కలిగించాలని, పుష్టినిచ్చే పాలద్వారా మమ్మల్ని పోషించాలని ప్రార్థన.

మం. యోవ శ్శివతమోరస స్తస్యభాజయతేహనః
ఉశతీరివ మాతరః

వివిధపదార్థాల ననుభవించి బాగా ఆనందించడానికి, చిరకాల జీవనం, అభిమతఫలం చూడడంకోసం మమ్మల్ని పోషించమని జలదేవతల్ని ప్రార్థిస్తున్నారు. ఇది ఇహలోక ఫలాల్ని కోరేవారికోసం చేసే ప్రార్థన. ఉపనిషత్తులలో ఉండే నిరతిశయానంద బ్రహ్మ సాక్షాత్కరించడం కోసం పుష్టిని కలిగించమని మోక్షం కోరేవారి ప్రార్థన. ఇలా జలదేవతానుగ్రహం వల్ల ఇహలోక సుఖం, మోక్షం కూడా లభిస్తాయని తెల్పింది. నీటిలో కల్యాణ తమమయిన ప్రసిద్ధమైన సారం సర్వప్రాణులచే ఆస్వాదించబడుతుంది. ఆ సారాన్ని మాకనుగ్రహించమని ప్రార్థన. ఇక్కడ జలదేవతలను తల్లులుగా, ప్రాణులను పుత్రులుగా భావన చేయడంవల్ల నీటికి, ప్రాణులకు గల పవిత్ర సంబంధం బాగా వెల్లడవుతోంది. ప్రేమతో తల్లులు పాలిచ్చి తమ పిల్లలను పోషించినట్లు మమ్ము పోషించమని వేద ఋషి ప్రార్థన.

మం. తస్మా అరం గమామవో యస్యక్షయాయ జిన్వథ
ఆపో జనయథాచనః

ప్రసిద్ధమయిన అన్నం లభించడం కోసం జలాలను పొందుతున్నాం. ఓ జలదేవతలారా! ఆహారాభివృద్ధి కోసం వరి మొదలైన సస్యాదికాన్ని అభివృద్ధి పొందించండి. జలదేవతలారా! మా పుత్రపౌత్రాదులను అభివృద్ధి పొందించండి అని ప్రార్థన.

మం. ఈశానా వార్యాణాం క్షయన్తీశ్చర్షణీనామ్
అపోయాచామిభేషజమ్

అన్ని ధనాలకు మూలం నీరు. ధనాలలో గొప్పదైన బంగారానికి కూడా నీరు మూలమవుతుందని వేదం తెల్పింది. జలాధారాలు మనుష్యుల కాశ్రయాలు అవుతాయని వేదం చెప్పింది. చాలా నాగరకతలు నదీతీరాల్లో

వెలసినవే కదా! రోగాదులను తొలగించే ఔషధం ప్రసాదించమని జలదేవతలను ప్రార్థన చేశారు వేదర్షి.

మం. శంనో దేవీ రభిష్టయ ఆపోభవన్తు పీతయే
శంయో రభిస్రవన్తునః (అథర్వణ 1 కాం. 1 అ. రసూ.)

ప్రకాశింపజేయడం మొదలైన సుగుణాలు కల జలదేవతలారా! మాకు అంతటా యజ్ఞకర్మకోసం సుఖం కలిగించండి. త్రాగడానికి సుఖం కలిగించేవి కండి. త్రాగేనీరు రుచికరమైనదై సుఖం కలిగించాలి. వచ్చిన రోగాలు తగ్గడానికి, ఈపైన రోగాలు రాకుండా ఉండడానికి జలదేవతలు మాకభిముఖంగా రావాలి.

మం. అప్సుమే సోమో అబ్రవీ దన్తర్విశ్వాని భేషజా
అగ్నించ విశ్వశంభువమ్

నీటిలో అన్ని రోగాలను పోగొట్టే ఔషధాలు ఉన్నాయని సోమదేవుడు నాకుపదేశించాడు.

జగత్తుకు సుఖాన్ని కలిగించేవాడు, అన్ని పనులు సుఖాన్ని కలిగించేవిగా చేసేవాడు అయిన విశ్వశంభువనే పేరుగల అగ్నిగూడా నీటిలో ఉన్నాడని కూడా ఆయన చెప్పాడు అని మంత్రద్రష్ట చెప్పాడు.

సముద్రంలో బడబాగ్నిగా, మేఘంలో పిడుగు, మెరుపు రూపాలతో అగ్ని ఉండడం ప్రసిద్ధమే. నీటినుండి వెలువడిన విద్యుత్తు యంత్రాలకు, పరిశ్రమలకు, ఫ్యానులకు, దీపాలకు ఇంకా ఎన్నో రకాలుగా మానవాళికి సుఖం కలిగిస్తోంది. సుఖం కలిగించే పనులకు తోడ్పడుతోంది. ఇలాంటి అగ్నివర్ణన వేదంలో ఉండడం గమనించదగిన విషయం.

మం. ఆపః పృణీత భేషజమ్ వరూథం తన్వేఽ మమ
జ్యోక్ చ సూర్యం దృశే

ఓ జలదేవతలారా! చిరకాలం సూర్యుని చూడడం కోసం జ్వరాది రోగాలను అన్నిటినీ నివారించే ఔషధాన్ని నా శరీరానికి ఇవ్వండి అని ప్రార్థన. ఏదైన ఒక విషయం ప్రధానమైనపుడు ఆ విషయాన్ని ఆవృత్తి చేయడం వేద పద్ధతి. నీటిలో ఔషధ గుణాన్ని నొక్కి చెప్పడానికే ఈ ప్రశంస. నీటిలో ఔషధ లక్షణాన్ని ప్రకృతి వైద్యులు కూడా ప్రకటిస్తున్నారు.

ఆరోగ్యం భగవదారాధనతో కూడిన దీర్ఘాయువు కోసం అనే భావం వైదిక దార్శనిక దృక్పథం.

అత్రాహారార్థం కర్మకుర్యా దనిన్ద్యం
కుర్యా దాహారః ప్రాణసంరక్షణార్థం
ప్రాణాస్సరంక్ష్యాః తత్త్వజిజ్ఞాసనార్థం
తత్త్వం జిజ్ఞాస్యం బ్రహ్మ సంవేదనార్థమ్

అనే మున్యుపదేశం ఇక్కడ స్మరించదగింది.

మం. శంన ఆపోధన్వన్యాఃఽ శము సన్త్వనూప్యాః
శంనః ఖనిత్రిమా ఆపః శముయాఃకుమ్భ ఆభృతాః శివానః సన్తు
వార్షికీః

అన్నిరకాల నీటిని పవిత్రంగా ఉంచుకుని వాటివల్ల ప్రయోజనం పొందడం వేదపద్ధతి. మరుభూమిలో ఉండే నీరు మాకు సుఖం కలిగించాలి. బాగా నీరున్న ప్రదేశంలో నీరు సుఖకరం కావాలి.

నది, చెరువు మొదలయిన వాటినుండి కుండతో తెచ్చిన నీరు సుఖం కలిగించాలి. ఇలా ప్రతి ఇంటిలో నీరు సుఖకరం కావాలి. వర్షర్తువులో నీరు సుఖం కలిగించాలి.

ఎడారి ప్రదేశంలో ఉండే నీరు కొంచెమే. జాగ్రత్త వహించకపోతే పాడవుతుంది. నదీతీరములయందు చెరువు గట్టులయందు చెత్తపోసి

కలుషితం చేస్తే వాటిలో నీరు మురుగుగా మారుతుంది. అలా జరగకుండా వీటి విషయంలో జాగ్రత్త వహించాలి.

ఇక వర్షర్తువులో రకరకాల వస్తువులు నీటిలో కలవడంవల్ల నీరు పాడయ్యే అవకాశం ఎక్కువ. అంతరిక్షంలోని క్రిమికీటకాలు కూడా వర్షజలంలో కలవవచ్చు. వీటిని శుద్ధం చేసి వాడుకోవాలి. ఇన్నిరకాల నీళ్ళు మంచినీరుగా ఉపయోగపడాలంటే సమాజం అంతా జాగ్రత్త వహించాలి. అందుకే మళ్ళీ మళ్ళీ వేదం బోధిస్తోంది. ఈ శ్రద్ధ వహించకపోతే ఇప్పటిలాగే ప్రతి నీటిసీసా కొనుక్కుని త్రాగవలసి వస్తుంది కదా!

మం. ఇదం జనాసో విదథ మహద్ బ్రహ్మ వదిష్యతి
నతత్ పృథివ్యాం నో దివి యేనప్రాణన్తి వీరుధః (అథర్వణ 1-32-1)

ఓ జనులారా! ఈ విషయం తెలుసుకోండి. బ్రహ్మ మొదటి సృష్టి అయిన నీరు బ్రహ్మవంటిదే. గొప్పదే అని ఋషి ప్రశంసించాడు. ఓషధులన్నిటికీ ప్రీతిని కలిగించి జీవింపజేసే నీరు రూపమయిన బ్రహ్మ మొదట నేలమీద, ద్యులోకంలోను లేదు.

మం. అంతరిక్ష ఆసాం స్థామ శ్రాన్తసదామివ
ఆస్థాన మస్యభూతస్య విదుష్టద్ వేధసోనవా

భూమి స్వర్గం కాక జలం మరెక్కడ మొదట ఉంటుందని సందేహం కలుగుతుంది. మొక్కలకు ప్రాణంపోసే ఈ నీటికి అంతరిక్షలోకము అసాధారణ స్థానం.

'అంతరిక్షే మహత్సముద్రం వితతమస్తి' అని ఈ విషయం పతంజలి ముని కూడా చెప్పాడు.

తపస్సు చేసి అలసి పుణ్యలోకాలు చేరిన యక్ష గంధర్వాదులు కూడా ఈ అంతరిక్షంలోనే నివసిస్తారట. వారివలె విస్తారమయిన జలం కూడా

అంతరిక్షంలోనే ఉన్నది. ఆ జలం వర్షంద్వారా భూలోకవాసులకు కూడా జీవన కారణమవుతుంది. జలం గురించి సామాన్యులకే కాదు, గొప్పవారయిన మన్వాదులకు కూడా తెలుసో తెలియదో.

మం. యద్రోదసీ రేజమానే భూమిశ్చ నిరతక్షతమ్
ఆర్ద్రం తదద్య సర్వదా సముద్రస్యేవ స్రోత్యాః

ఓ ద్యావాపృథువులారా! నీటిని ఉత్పాదన చేయడానికి పూనుకొని మీరు అంతరిక్ష జలాన్ని పుట్టించారు. ఆ నీరు ఇప్పటికీ ఎండకుండా ఉంటున్నది. వర్షం ద్వారా నీరు భూమిని చేరినా అంతరిక్ష జలం మాత్రం అయిపోదు. సముద్రం చేరే జీవనదులు ఎండనట్లుగా ఆ అంతరిక్ష జలం కూడా ఎండిపోదు.

మం. విశ్వమన్యా మభీవార తదన్యస్యా మధిశ్రితమ్
దివే చ విశ్వవేదసే పృథివ్యైచాకరం నమః

అంతరిక్ష జలానికి కారణం ద్యావా పృథువులు. విశ్వాన్ని అంతటిని ఆవరించి ఉన్నది ద్యులోకం. అలాగే జగత్తు వర్షంకోసం ద్యులోకాన్ని కోరుతోంది. జగత్తంతా పృథివిని ఆశ్రయించి ఉంది. జగత్తుకు ధనం వంటిది, జ్ఞాన మూలము అయిన ద్యులోకానికి, అందరికీ ఆధారభూతం అయిన పృథివికి వందనం.

మం. హిరణ్యవర్ణాః శుచయః పావకా యా సుజాతః సవితాయాస్వగ్నిః
యాఅగ్నింగర్భం దధిరే సువర్ణాస్తాన ఆపః శం స్యోనాభవన్తు
(అథర్వణ 1-6-33)

హితం రమణీయం అయిన వర్ణం కలవీ, బంగారం వంటి రంగు కలవి, శుద్ధమయినవి స్నానపానాదులచే పవిత్రం చేసేవి నీళ్ళే. అందుకే స్నానం ఆచమనం చేసి ధార్మిక కార్యాలు చేస్తారు. సత్యాలు రెండు రకాలు. వ్యావహారిక సత్యం, పారమార్థిక సత్యం – వ్యవహారంలో సత్యంవలె కనబడేది

వ్యావహారిక సత్యం. ఉదాహరణానికి సూర్యుడు సముద్రం నుంచి పైకి వస్తున్నట్లు కనబడడంచేత నీటినుండి జన్మించాడనడం. పారమార్థిక సత్యం– ప్రపంచమంతా పరమాత్మ వ్యాపించి ఉన్నాడనడం – మన వ్యవహారంలోను, వేదంలోను కూడా ఈ రెండు సత్యాలు ఆధారంగా వాక్యాలు ఉంటాయి.

ప్రాణులకు ప్రేరకుడైన ఆదిత్యుడు నీటినుండి బయలుదేరాడు. మేఘంలో ఉండే నీటినుండి వైద్యుతాగ్ని, సముద్ర జలాలనుండి బడబాగ్ని బయలుదేరాయి. మంచి రంగుగల నీరు అగ్నిదేవుని గర్భంలో ధరిస్తోంది. ఇన్నిరకాల నీళ్ళు రోగాదులను తొలగించేవి, సుఖాన్ని కలిగించేవి కావాలి.

మం. యాసాం రాజా వరుణోయాతి మధ్యేసత్యాన్నృతే అవపశ్యన్ జనానామ్
యా అగ్నింగర్భం దధిరే సువర్ణాస్తాన ఆపశ్శం స్యోనాభవన్తు.

పాపులను నిగ్రహించే వరుణ రాజు సత్యాసత్యాలను వేరుచేసి చూచి దోషిని శిక్షించడంకోసం ఆయా ప్రదేశాలకు వెళతాడు.

మం. శివేన మా చక్షుషా పశ్యతాపః శివయా తన్వోప స్పృశత త్వచంమే
ఘృతశ్చ్యుతః శుచయోయాః పావకా స్తాన ఆపః శం స్యోనా భవన్తు

ఓ జలదేవతలారా! అనిష్టం తొలగాలని, ఇష్టం ప్రాప్తించాలని కోరే నన్ను మీరు మంగళము, సుఖము కలిగించే చూపులతో చూడండి. మీ అనుగ్రహాన్ని కోరే నా చర్మాన్ని ఇష్టప్రాప్తిని కలిగించే మీ నీటి శరీరంతో సుఖకరంగా స్పృశించండి. అమృతాన్ని స్రవించేవి, శుద్ధమయినవి, పవిత్రమయినవి అయిన జలాలు మాకు రోగాన్ని నివారించేవి, సుఖాన్ని కలిగించేవి అగుగాక అని ప్రార్థన.

మం. యదదః సంప్రయతీ రహా వనదతా హతే
తస్మా దానద్యోఽ నామస్థ తావో నామాని సిన్ధవః
(అథర్వణ - 3-13-1)

సంస్కృత భాషలో పేరులకు వ్యుత్పత్తి ద్వారా అర్థం తెలుస్తుంది. అంటే శబ్దమే పరిశీలిస్తే తన అర్థాన్ని తెలుపుతుందన్నమాట. ఈ అర్థాన్ని నిరుక్తం అనే వేదాంగశాస్త్రం చెబుతుంది. ఇలా పదాలకు వ్యుత్పత్త్యర్థాల్ని తెలిపే మార్గానికి వేదమే మూలం. నద ధాతువుకు అవ్యక్తమయినశబ్దం అని అర్థం. మేఘం తాడింపబడినప్పుడు నీరు ప్రవహిస్తూ ధ్వనించింది. కాబట్టి నీటి ప్రవాహానికి నది అని పేరు వచ్చింది.

నీటి ప్రవాహానికి సింధువు అని పేరు. ప్రవహించే శీలం కలదని అర్థం. ఇలాగే మిగిలిన నీటి పేరులు కూడా అర్థానుగుణంగా ఉంటాయి.

మం. యత్ప్రేషితా వరుణేనాచ్ఛీభం సమవల్గత
తదాప్నో దిన్ద్రో వోయతీ స్తస్మాదాపో అనుష్ఠన

వరుణరూపుడైన ఆదిత్యునిచే ప్రేరేపించబడి, నీరు శీఘ్రంగా నృత్యం చేస్తున్నట్లు వెళుతూంటే వాటిని ఇంద్రుడు పొందాడు. పొందబడినవనే అర్థంలో ఆపః అనే సంస్కృతం పేరు కలిగింది.

మం. అపక్రామం స్యన్దమానా అవీవరత వోహికమ్
ఇన్ద్రోవ శక్తిభిర్దేవీ స్తస్మాద్వా ర్నామవోహితమ్

నీటికి వారి అనే పేరుంది. కోరిక లేకుండా ఎల్లప్పుడూ ప్రవహించే నీటిని ఇంద్రుడు తన శక్తులతో వశం చేసుకోదలిచాడు. ఓ జలదేవతలారా! ఇలా వరధాతువు నుండి వారి అనే పేరు కలిగింది.

మం. ఏకోవో దేవో ప్యతిష్ఠత్ స్యన్దమానా యథావశమ్
ఉదానిషు ర్మహీరితి తస్మా దుదక ముచ్యతే

నీటికి ఉదకం అని మరో పేరు. యథేచ్ఛగా ప్రవహించే నీటిని అసహాయశూరుడైన ఇంద్రుడు అధిష్ఠించాడు. ఇంద్ర గౌరవంచే గొప్ప వాళ్ళమయ్యామని జలదేవతలు శ్వాసించారు. పై అర్థంలో ఉదకమనే పేరు ఏర్పడింది. (ఉత్+అన+క నకారలోపము)

మం. ఆపోభద్రా ఘృత మిదాప ఆస న్నగ్నీషోమౌ బిభ్ర త్యాప ఇత్తాః
తీవ్రో రసో మధు పృచా మరంగమ ఆమాప్రాణేన సహవర్చసా గమేత్

నీరు భద్రములు. అవి గడ్డి, పాలు, పెరుగు అనే క్రమంతో నెయ్యి అవుతున్నాయి. అలాగే అగ్నిలో హోమం చేసిన నెయ్యివల్ల తరువాత వర్షం పడుతుందని శాస్త్రం చెబుతోంది. కాబట్టి నేతివల్ల నీరేర్పడుతుందని చెప్పవచ్చు. ఆ నీరు అగ్నీషోములను ధరిస్తోంది. నీరు, అన్నం మొదలైన హవిస్సులను ఏర్పరుస్తోంది. హవిస్సులవల్ల అగ్నిలో హోమం జరుగుతుంది. నీరు సోమునికి రశ్మివృద్ధి కలిగించి తోడుపడుతోంది. ఆ నీరు రసంతో కలిసి అభివృద్ధి పొంది ఇంద్రియ శక్తిని బలాన్ని కలిగించాలని ప్రార్థన.

మం. ఆదిత్ పశ్యామ్యుత వా శ్రుణో మ్యామాఘోషో గచ్ఛతు వా జ్మాసామ్
మన్యే భేజానో అమృతస్యతర్హి హిరణ్యవర్ణా అతృపంయదావః

రసం ప్రాణంతో కలిసి నాకు ఇంద్రియశక్తిని బలాన్ని ఇచ్చిన తరువాత నేను చూడడం, వినడం, మాట్లాడడం మొదలయినవి బాగా చెయ్యగలుగుతాను. అపుడు అమృతమే సేవించినట్లు నేననుకుంటాను. హితరమణీయ వర్ణాలతో జలదేవతలారా! మీ నీటిని సేవించడంచే నేను తృప్తిని పొందాను.

మం. ఇదం వ ఆపో హృదయమయం వత్స ఋతావరీః
ఇహేత్థ మేత శక్వరీ ర్యత్రేదం వేశయామివః

ఓ జలదేవతలారా! మీకు అర్పిస్తున్న హృదయ స్థానీయ హిరణ్యం వైపు రండి. సత్యంతో కూడిన జలదేవతలారా! ఈ గుంటలో వేసిన మండూకం మీకు వత్సవంటిది. దూడవైపు పరిగెత్తు గోవువలె మీరావైపు ప్రవహించండి. అభిమత ఫలప్రదాన సమర్థములయిన జలదేవతలారా! ఈ గుంటలో వేసిన నాచు ప్రాకునట్లు మీరు స్థిరప్రవాహం కలవి అగుదురుగాక. నేనిపుడు మిమ్ము ఈ ఖాతంలో ప్రవేశపెడుతున్నాను.

మం. సస్రుషీ స్తదపసో దివా నక్తఞ్చ సస్రుషీః
వరేణ్య క్రతు రహ మపో దేవీ రుపహ్వయే (అథర్వణ 6-23-1)

సర్వప్రాణులను జీవింపజేసే ప్రసిద్ధ రూపాన్ని పొందినవీ, జగద్రక్షణ కర్మతో కూడినవీ, రాత్రి పగలు అన్నికాలాల్లో ప్రవహించేవీ అయిన ఈ నీటిని ప్రశస్త కర్మ చేసే నా దగ్గరికి ఆహ్వానిస్తున్నాను.

మం. ఓతా ఆపః కర్మణ్యా ముఞ్చన్త్వితః ప్రణీతయే
సద్యః కృణ్వన్త్వేతవే

ఎడతెగకుండా ప్రవహించేవీ, లౌకిక కర్మల్లో, వైదిక కర్మల్లో ఉపయోగపడేవీ అయిన జలదేవతలు అన్ని అనర్థాలకు మూలమయిన మా పాపం పోగొట్టునుగాక.

వెంటనే ప్రకృష్ట ఫలం పొందడానికి మమ్మల్ని అర్హులుగా చేయుగాక.

మం. దేవస్య సవితు స్సవే కర్మ కృణ్వన్తు మానుషాః
శంనో భవ న్త్వప ఓషధీ శ్శివాః

సర్వప్రేరకుడు, ప్రకాశించేవాడు అయిన సూర్యుని ప్రేరణవల్ల మనుష్యులు లౌకిక వైదిక కర్మలను అనుష్ఠించుదురు గాక. మంగళకరమైన ఓషధులు, వాటిని పెంపొందించే జలదేవతలు మాకు పాపాలను తొలగించే హేతువులగుగాక.

మం. హిమవతః ప్రస్రవన్తి సిన్ధో సమహ సఙ్గమః
ఆపోహ మహ్యంతద్దేవీ ర్దదన్ హృద్ ద్యోత భేషజమ్
(అథర్వణ 6-3-24)

పాపం తొలగించే గంగాది నదీరూప జలాలు హిమవత్ పర్వతం నుండి ప్రవహిస్తున్నాయి. అవన్నీ సముద్రంలో కలుస్తున్నాయి. ఆ జలదేవతలు హృదయదాహాన్ని తొలగించే ఔషధాన్ని నాకు ఇత్తురు గాక.

మం. యన్మే అక్ష్యో రాదిద్యోత పార్ష్ణిః ప్రపదోశ్చ యత్
ఆపస్తత్ సర్వం నిష్కరన్ భిషజాం సుభిషక్తమాః

ఏ రోగాలు నా కన్నులకు బాధ కలిగిస్తున్నాయో, ఏ రోగాలు నా పాదాల ముందువెనుక భాగాలను ఆశ్రయించి ఉన్నాయో రోగం పోగొట్టడంలో బాగా నైపుణ్యం కల జలదేవతలు ఆ రోగాలను పోగొట్టుగాక.

మం. సిన్ధుపత్నీ సిన్ధురాజ్ఞీః సర్వాయా నద్యస్థన
దత్తనస్తస్య భేషజం తేనా వో భునజామహై

సింధుపత్నులు, సముద్రానికి రాణులు అయిన నదులారా! మా రోగాలకు ఔషధాన్ని ప్రసాదించండి. ఆ ఔషధాలవల్ల మేము రోగంలేని వారమై బలాన్ని కలిగించే మీకు సంబంధించిన అన్నపానాదులను పొందుదుముగాక.

* * *

7. వాస్తోష్పతి సూక్తం

నూతన గృహ భూమి సంస్కరణం (అథర్వణ వేదం 3, కాం – 3, అ– 12 సూ) కోసం ఈ సూక్తం వినియోగిస్తారు. మహాశాంతియందు, శంకుస్థాపన, శాలాభూమిని దృఢం చేసే సమయంలో, శాలకు వెదురుబొంగు అమర్చే సమయంలో, నవగృహప్రవేశ సమయంలో, యజమానపత్ని నీటిబిందెతో మొదట ప్రవేశించే సమయంలో ఈ సూక్తంలోని మంత్రాలకు వినియోగం ఉంది.

మం. ఇహైవ ధ్రువాం నిమినోమి శాలాం
క్షేమే తిష్ఠాతి ఘృతముక్షమాణా
తాంత్వాశాలే సర్వవీరా స్సువీరా
అరిష్ట వీరా ఉపసంచరేమ ॥

ఈ ప్రదేశంలో స్థిరమైన గృహమును స్తంభం పాతడం మొదలయిన పనులతో నిర్మించుచున్నాను. ఆ ఇల్లు అభిమతమైన ప్రయోజనాల నిస్తూ అగ్న్యాది బాధలు లేకుండా ఉండుగాక.

ఓ శాలా! అటువంటి నీయందు అనేక పుత్రాదులతో కూడినవారమై, శోభన గుణములుకల సంతానాదులతో కూడిన వారమై మేము సంచరిస్తాము.

మం. ఇహైవ ధ్రువా ప్రతితిష్ఠ శాలే
శ్వావతీ గోమతీ సూనృతావతీ
ఊర్జస్వతీ ఘృతవతీ పయస్వ
త్యుచ్ఛ్రయస్వ మహతే సౌభగాయ ॥

ఓ శాలా! నీవీ ప్రదేశంలో స్థిరంగా ఉండు. చాలా గుర్రాలతో, చాలా గోవులతో, ప్రియవాక్కులుగల బాలాదుల వాక్కులతో, అధికమయిన

అన్నముతో, బాగా నేతితో, బాగా పాలతో కూడినదానవై మాకు గొప్ప సౌభాగ్యంకోసం ఉత్కృష్టంగా ఉండు.

మం. ధరుణ్యసి శాలే బృహచ్ఛన్దాః పూతి ధాన్యా
ఆత్వావత్సో గమేదా కుమార ఆ ధేనవః సాయమాస్పందమానాః॥

ఓ గృహమా! నీవు భోగసమూహాన్ని ధరించేదానవు. ప్రశస్త స్తంభాలతో కూడినదానవు. గొప్ప పైకప్పు కలదానవు. గొప్ప వేదాలతో కూడినదానవు. వాసనతో కూడిన జీర్ణధాన్యంతో కూడినదానవు. బహువిధ భోగదానాదులచే అక్షయ ధాన్యంతో కూడినదానవు. ఇటువంటి నిన్ను దూడలు చేరుగాక. పుత్రాదులు చేరుగాక. ఈ గృహమందు గోవులు దూడలతోను, స్త్రీలు పుత్రాదులతోను ఉండుగాక. పాలిచ్చే ఆవులు సాయంకాలం పాలు కారే పొదుగులతో నిన్ను చేరుగాక.

మం. ఇమాం శాలాం సవితా వాయురిన్ద్రో
బృహస్పతిర్నిమినోతు ప్రజానన్
ఉక్షన్తూద్గా మరుతో ఘృతేన
భగో మో రాజా నికృషింతనోతు ॥

అందరినీ ప్రేరేపించే సవితృదేవుడు, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి శాలా నిర్మాణ పద్ధతిని ప్రకర్షంగా ఎరిగినవారై స్తంభాది స్థాపనచే ఈ శాలను నిర్మింతురు గాక. మరుత్తులు కూడా స్రవించే శీలం కల నీటిచే గృహభూమిని దున్నుదురు గాక.

మం. మానస్య పత్ని శరణా స్యోనా
దేవీ దేవేభి ర్నిమితా స్యగ్రే
తృణం వసానా సుమనా అస
స్త్వమథాస్మభ్యం సహవీరం రయిందాః

భా. మాన్యుడైన వాస్తుపురుషుని పత్నివంటి గృహమా! ధాన్యాదికాన్ని రక్షించేదానవు, సుఖాన్ని కలిగించేదానవు, ప్రకాశించేదానవు, సృష్ట్యాదిలో దేవతలచే నిర్మింపబడిన దానవు, ప్రాణుల భోగంకోసం సృష్టించబడినదానవు. ఆ నీవు పైన గడ్డిని కప్పుగా వేసుకుని, శోభనమయిన మనస్సు కలదానివి అగుము.

మం. ఋతేన స్థూణా మధిరోహ వం
శోగ్రో విరాజన్నప వృఙ్ఙ్వ శత్రూన్
మాతే రిషన్నుప సత్తారో గృహాణాం
శాలే శతం జీవేమ శరదః సర్వవీరాః ॥

నీవు ఎరుగని రూపముతో శాలమధ్య ఉన్న స్తంభముపై ఉండు. అతిశయయిన బలంతో విశేషముగా దీపిస్తూ మా శత్రువులను తొలగించు. ఓ గృహమా! నీయందు నివాసం చేసేవారు హింసింపబడకుందురు గాక. నీయందు నివసించే మేము అభిలషితమయిన పుత్రపౌత్రాదులతో కూడి నూరు సంవత్సరాలు జీవింతుము గాక.

మం. ఏమాం కుమార స్తరుణ ఆవత్సో జగతాసహ
ఏమాం పరిస్రుతః కుమ్భ ఆదధ్నః కలశైరగుః ॥

ఈ శాలకు యువకుడు కుమారుడు అయిన పుత్రుడు వచ్చుగాక. అలాగే గమనశీలం గల గోవు మొదలయిన వాటితో వచ్చుగాక. స్రవించే శీలం కల తేనె కుండలు వచ్చుగాక. పెరుగుతో నిండిన కుండలు వచ్చుగాక.

మం. పూర్ణం నారి ప్రభర కుమ్భమేతం
ఘృతస్య ధారామమృతేన సమ్భృతామ్
ఇమాం పాత్రా నమృతేనా సమఙ్ధీ
ష్టా పూర్త మభి రక్షత్యేనామ్ ॥

ఓ నారీ! నీటితో నిండిన ఈ కుండను గృహమునకు తీసుకువెళ్ళు. ఈ కుండ అమృతమయమయిన నీటితో నిండినది. స్రవించే శీలం కల తేనె, నేతుల ధారలను స్రవించేది, ఈ కలశాన్ని అమృతరూపమయిన నీటితో ప్రకాశించేదిగా చెయ్యి. ఈ ప్రవేశించే శాలను, అక్కడ చేసే శ్రౌత స్మార్తకర్మలను రక్షించుగాక. చోరాగ్న్యాది భయాలనుండి రక్షించుగాక.

మం. ఇమా ఆపః ప్రభరామ్య యక్ష్మా యక్ష్మ నాశనీః
గృహానుప ప్రసీదా మ్యమృతేన సహాగ్నినా ॥

ఈ కలశంలో ఉండే నీరు ప్రకర్షంగా శాలకు తీసుకువెళుతున్నాను. ఈ నీటిని సేవించేవారికి రోగాలను నాశం చేసేవి అయిన నీటిని, అవినాశి అయిన అగ్నితో కూడా గృహంలో ఉంచుతున్నాను.

* * *

8. నాసదీయ సూక్తం

(ఋగ్వేదం 10 మం. 129 సూ.)

దీనికి పరమేష్ఠి ప్రజాపతి ఋషి. పరమాత్మ దేవత.

మం. నాసదాసీ న్నో సదాసీత్తదానీం
నాసీద్రజో నో వ్యోమా పరో యత్
కిమావరీవః కుహకస్య శర్మ
న్నమ్భః కిమాసీ ద్గహనం గభీరమ్

ఈ మంత్రంలో సృష్టికి పూర్వావస్థ తెలుపబడుతోంది. అపుడు సమస్త ప్రపంచం లేదు. అది ప్రళయావస్థ. ప్రళయదశలో జగత్తుకు మూలకారణం చెవులపిల్లి కొమ్మువలె అసలు లేకుండా లేదు. అసలు లేని దానినుండి సద్రూపమైన జగత్తు పుట్టదు. ఆత్మవలె సద్రూపంగా నిర్వచింపదగినదిగానూ లేదు. అపుడు భూమి మొదలు పాతాళం వరకు అంతరిక్షం మొదలు సత్యలోకం వరకు గల లోకాలు లేవు. ఆవరింపబడేది లేనందువల్ల ఆవరించేది కూడా లేదు. ఆవరించేది ఎక్కడ ఉండి ఆవరిస్తుంది? ఆధారభూతమైన ప్రదేశం లేదు. భోక్త అయిన ఏ జీవుని సుఖంకోసం ఆవరిస్తుంది? సృష్టి జీవుల ఉపభోగంకోసం కదా! ఆ సృష్టి ఉంటే బ్రహ్మాండం భూతములచే ఆవరించబడుతుంది. ప్రళయదశలో భోక్తలయిన జీవులు ఉపాధులు లయం కావడం వల్ల గోచరించరు. భోక్త లేనపుడు ఆవరణానికి నిమిత్తం లేకపోవడంవల్ల ఆవరించడం సంభవించదు. అపుడు భోక్తలు కాని భోగ్యపదార్థం కాని లేవని భావం. ప్రవేశించుటకు శక్యంకాని అగాధమయిన నీరు గూడా అపుడు లేదు. ఇది అవాంతర ప్రళయాన్ని తెలిపే శ్రుతి.

మం. నమృత్యు రాసీ దమృతం నతర్హి
నరాత్ర్యా అహ్న ఆసీ త్ప్రకేతః

ఆనీ దవాతం స్వధయా తదేకం
తస్మా ద్ధాన్యం నపరః కిఞ్చ నాసీత్

అపుడు మృత్యువుకాని మరణ రాహిత్యంకాని లేవు. రాత్రికాని పగలు కాని ప్రజ్ఞానముకాని అపుడు లేవు. సకల వేదాంత ప్రసిద్ధమైన బ్రహ్మతత్త్వము శ్వాసించుచుండెను. మామూలు వాయువు లేదు. ఆ బ్రహ్మ మాయతో కూడి ఉంది. ఇంతకంటె ఇతరమైన జగత్తు లేదు.

మం. తమ ఆసీత్తమసా గూహ్య మగ్రే
ప్రకేతం సలిలం సర్వమా ఇదమ్
తుచ్ఛే నాభ్వపిహితం యదాసీ
త్తపస స్తన్మహినా జాయ తైకమ్.

సృష్టికి పూర్వం ప్రళయ దశయందు సమస్త జగత్తు భావరూపాజ్ఞాన తమస్సుచే దాగి ఉంది. దానినుండి ప్రకటం కావటమే జగత్తుకు జన్మ. వ్యవహారస్థితియందువలె అపుడు జగత్తు నామరూపాలతో విస్పష్టంగా లేదు. కనబడే ఈ జగత్తు తన కారణమైన బ్రహ్మంతో అవిభక్తంగా ఉంది. అల్పమైన సదసద్విలక్షణమైన భావరూపాజ్ఞానంచే కప్పబడి ఉంది. అది సృష్టి చేయదగిన వాటి పర్యాలోచన మహత్త్వంచే పుట్టింది.

మం. కామ స్తదగ్రే సమవర్తతాధి
మనసోరేతః ప్రథమం యదాసీత్
సతోబన్ధు మసతి నిరవిన్దన్
హృదిప్రతీష్యా కవయో మనీషా.

మొదట పరమేశ్వరుని మనస్సులో సృష్టించాలనే సంకల్పం కలిగింది. అదే భావి ప్రపంచానికి బీజమయ్యింది. ఇది గడచిన కల్పంలో ప్రాణుల పుణ్యకర్మ కారణంగా సృష్టి సమయంలో కలిగింది. ఇపుడున్నదిగా కనబడే సమస్తజగత్తుకు హేతువైంది. కల్పకాలంలో ప్రాణులచే ఆచరింపబడిన

కర్మసమూహాన్ని క్రాంతదర్శులయిన కవులు త్రికాలజ్ఞులై తమ హృదయంలో బుద్ధిని నియమించి విచారణ చేసి సత్ కంటే విలక్షణమైనదైన, అవ్యాకృతం అయిన జగత్కారణాన్ని వివేకంతో కనుగొన్నారు.

మం. తిరశ్చీనో వితతో రశ్మిరేషా
మధఃస్విదాసీఽ దుపరి స్విదాసీత్
రేతోధా ఆసన్ మహిమాన ఆసన్
స్వధా అవస్తాత్ప్రయతిః పరస్తాత్.

అవిద్య, కామం, కర్మ సృష్టికి హేతువులు. సూర్యకిరణాలు శీఘ్రంగా జగత్తున వ్యాపించినట్లు అవిద్య, కామ, కర్మలచే జగత్తు విస్తరించింది. మొదట పుట్టిన కార్యవర్గం మధ్యలో ఉందా? క్రింద ఉందా? అని ప్రశ్న. అతిశీఘ్రంగా వ్యాపించడంచే దాని క్రమం గుర్తించడానికి వీలులేకపోయింది. సృష్టించిన వారిలో కొందరు బీజ భూతమైన కర్మను చేస్తూ దాని ఫలాన్ని అనుభవించే జీవులు. ఆకాశం మొదలైన మహాభూతాలు భోగ్యాలు. ఇలా మాయాసహితుడైన పరమేశ్వరుడు జగత్తునంతా సృష్టించి దానిలో ప్రవేశించి భోక్త, భోగ్యం మొదలైన విభాగం చేశాడు. వీటిలో భోగ్య వస్తువు నికృష్టం, భోక్త ఉత్కృష్టుడు.

మం. కో అద్ధావేద క ఇహ ప్రవోచత్
కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః
అర్వాగ్దేవా అస్య విసర్జనే
నాథా కోవేద యత ఆబభూవ

ఈ సృష్టి తెలుసుకొనడాని కశక్యమైనది. కాబట్టి విస్తరించి చెప్పడం లేదు. ఎవడు పరమార్థంగా తెలుసుకొనగలడు? ఎవడు దీనిని లోకానికి చెప్పగలడు? భూత భౌతిక, భోక్తృ, భోగ్యాది రూపంగా ఉన్న యీ సృష్టి ఏ ఉపాదాన కారణంనుండి పుట్టిందో, ఏ నిమిత్త కారణం నుండి పుట్టిందో

ఎవరు విస్తరంగా చెప్పగలరు? దేవతలు కూడా భూతసృష్టికి తరువాత పుట్టినవారే. కాబట్టి తమకు ముందు పుట్టిన సృష్టిని గురించి తెలుసుకోలేరు. ఒక మనుష్యాదులెలా చెప్పగలరు?

మం. ఇయం విసృష్టి ర్యత ఆబభూవ
యదివా దధే యది వాన
యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్
సో అఙ్గ వేద యది వానవేద

జగత్సృష్టివలె జగద్ధారణం కూడా విస్తరంగా తెలుసుకొనడాని కశక్యమే. జగత్తుకు ఉపాదాన కారణమైన పరమాత్మనుండి గిరి నదీ సముద్రాది రూపమైన ఈ విచిత్ర సృష్టి బయలుదేరింది. ఆయన దీనిని ధరిస్తున్నాడా? లేదా? ఆయన తప్ప దీనినెవడు ధరించగలడు? ఏ పరమాత్మ నుండి ఈ సృష్టి ఏర్పడెనో ఆయన నెవరెరుగ గలరు? కుండ ఏర్పడడానికి మట్టి ఉపాదాన కారణం. కుమ్మరి నిమిత్త కారణం. కొందరు ప్రధానంనుండి ఈ జగత్తు స్వయంగా పుట్టిందని విరుద్ధంగా భావిస్తున్నారు.

ఆయనయే జగత్తుకు ఉపాదానమని ఎవరు తెలుసుకొన్నారు? తటస్థ కారణమే ఈశ్వరుడని కొందరు భావించారు. దేవతలే ఎరుగలేని దానిని అర్వాచీనులెలా తెలుసుకుంటారు? భూత భౌతికాత్మకమైన ఈ జగత్తుకు అధ్యక్షుడైన ఈశ్వరుడు గొప్పది, సత్యము అయిన ఆకాశంవలె నిర్మలమైన స్వప్రకాశంలో ఉన్నాడు. ఆ పరమేశ్వరుడే తెలుసుకోవాలి. ఇతరు లెరుగ లేరని నాసదీయసూక్తానికి సాయణాచార్య భాష్యం.

* * *

9. భైషజ్య సూక్తాలు

మం. విధాతాథర్వ సర్వస్వ మాయుర్వేదం ప్రకాశయన్
స్వనామ్నా సంహితా ఇచ్ఛక్రే లక్షశ్లోకమయీ మృజుమ్

– భావప్రకాశము

(విధాత అథర్వవేద సర్వస్వమయిన ఆయుర్వేదాన్ని ప్రకాశింపజేస్తూ లక్ష శ్లోకాలు కలది, ఋజువుగా ఉన్నది అయిన ఆయుర్వేద సంహితను తన పేరుతో రచించాడు.) భావ ప్రకాశమనే ఆయుర్వేద గ్రంథం ఆయుర్వేదం అథర్వవేద సర్వస్వమని చెప్పింది. అథర్వవేదంలో ఆయుర్వేద విషయాలున్నాయని భావం. అందుకే అథర్వవేదానికి ఆయుర్వేదం ఉపవేదమని కొందరు చెప్పారు.

వాక్కు మనస్సు శరీరం అనేవాటికి త్రికరణాలని పేరు. ఒక పని చెయ్యడానికివి సాధనాలన్నమాట. త్రికరణశుద్ధిగా పనిచేస్తే, త్రికరణాలను ఒకే అంశంపై లగ్నం చేస్తే దానిని పరమ తపస్సు అంటారు.

సత్యరూపుడు భగవంతుడు. బ్రహ్మచర్యంవల్ల మనస్సు బలంగా ఉంటుంది. భక్తితో ఎడతెగకుండా చిరకాలం చేస్తే ధార్మిక సాధనలు ఫలిస్తాయని శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతీ స్వామి తన యోగసూత్ర వ్యాఖ్యానంలో చెప్పారు.

అథర్వణ వేదమంత్రాలు సిద్ధమంత్రాలు. మహర్షులు భగవద్ధ్యానం చేస్తూంటే భగవదనుగ్రహం వల్ల అప్రయత్నంగా వారి నోటినుండి ఉదాత్తానుదాత్త స్వరిత స్వరాలతో బయలుదేరినవా మంత్రాలు. వాటిని వారు రచించలేదు కాబట్టి వారు ఆ మంత్రాలకు కర్తలు కారు, ద్రష్టలు అంటే దర్శించినవారు.

సత్యం పలుకుతూ బ్రహ్మచర్యంతో భక్తితో కార్యం నెరవేరేవరకు ఏ దినము మానకుండా సూత్రగ్రంథాలు చెప్పిన రీతిగా చిరకాలం వినియోగిస్తే ఈ మంత్రాలు చెప్పిన ఫలాన్ని తప్పక కలిగించగలుగుతాయి.

మం. జరాయుజః ప్రథమ ఉస్రియోవృషావాత భ్రజాస్తనయన్నేతి వృష్ట్యా
సనోమృదాతి తన్వ ఋజుగోరుజన్ య ఏకమోజస్త్రేధా విచక్రమే

ప్రథమకాండంలో మూడో అనువాకంలో 12వ సూక్తమిది. వాతపిత్త శ్లేష్మాల ప్రకోపంవల్ల వచ్చే రోగాల శాంతికోసం ఔషధ సేవచేసే సమయంలో ఈ సూక్తం వినియోగిస్తారు.

అదితి కుమారుడు ఆదిత్యుడు. అత డుదయం నక్షత్రాలను వెలవెలజేస్తూ ఉదయిస్తాడు. అతడు సౌరకుటుంబంలో మొదట పుట్టినవాడు. ఇతని కిరణాలవల్ల జనులు నివసించగలుగుతున్నారు. ఈ సూర్యుడు వర్షమిస్తాడు. గాలివలె శీఘ్రంగా పయనిస్తాడు. ఆయన ప్రయాణంలో చాలాగాలి ఆయన వెంట ఉంటుంది. ఇలాంటి సూర్యుడు మేఘాలను గర్జింపజేస్తూ పెద్ద వర్షంతో వస్తున్నాడు.

ఆ ఆదిత్యుడు మా శరీరాలను సుఖింపజేయుగాక. ఇతడు సూటిగా ప్రయాణిస్తాడు. అతడొకడే తేజస్సును అగ్ని వాయు సూర్యరూపంలో మూడురీతులుగా చేసి భూమి మొదలయిన మూడులోకాలు ఆక్రమించాడు. అతడు మా శరీరాలను సుఖపెట్టుగాక.

ఆ సూర్యుడు తన తేజస్సుతో అగ్ని వాయు చంద్రరూపాల్లో ఉన్నాడు. తన తేజస్సుతో అన్ని శరీరాలను ఆక్రమించి వాతపిత్త శ్లేష్మములను కలిగించు దేవతారూపములతో ఉన్నాడు. వాతపిత్త శ్లేష్మాల ప్రకోపంవల్ల వివిధ రోగాలు కలుగుతున్నాయి. ఆ ప్రకోపం శాంతిస్తే అనేక రోగాలు తగ్గుతాయి. కాబట్టి సూర్యప్రార్థనచే ఈ మూడు దోషాలవల్ల కలిగే రోగాలు తొలగిపోతాయి.

మం. అజ్గే అజ్గే శోచిషాశిశ్రియాణం నమస్యన్త స్త్వా హవిషా విధేమ
అజ్కా న్త్సమజ్కాన్ హవిషా విధేమ యో అగ్రభీత్పర్వాస్యాగ్రభీతా

ప్రాణులందరి శరీరాలలో తన కాంతిచే ప్రాణరూపంలో వ్యాపించి ఉన్నవాడు సూర్యుడు. ఓ సూర్యుడా! ఇటువంటి నిన్ను స్తుతి నమస్కారాదులతో పూజిస్తున్నాము. చరువు, ఆజ్యము, సమిధలు సమర్పించి పరిచర్య చేస్తున్నాము. సూర్యుని వెంట పయనించే పరివార దేవతలకు హవిస్సు అర్పించి పరిచర్య చేస్తున్నాము. జ్వరాదిరూప రోగము ఈ పురుషునికి శరీరావయవ సంధుల నాక్రమించి బాధిస్తోంది. ఆ రోగముల నివృత్తికోసం హవిస్సును అర్పించి పరిచర్య చేస్తున్నాము.

మం. ముఞ్చ శీర్షక్త్యా ఉతకాస ఏనం పరుష్పరు రావివేశా యో అస్య
యో అభ్రజావాతజా యశ్చ శుష్మో వనస్పతీన్త్సచతాం పర్వతాంశ్చ

ఓ సూర్యుడా! ఈ పురుషునికి శిరోరోగాన్ని తొలగించు. ఇతనికి హృదయ కంఠాల మధ్య సంధిబంధాలలో కాసమనే శ్లేష్మరోగం వ్యాపించింది. ఆ రోగాన్ని పోగొట్టు. మేఘం వర్షించే జల సంబంధంచే ఏర్పడేది శ్లేష్మరోగం. ఉదరము నుండి వెలువడే వాతం నుండి కలిగేది వాతరోగం. పిత్త వికారం నుండి ఏర్పడేది జ్వరాది రోగము. ఈ రోగాలన్నీ ఇతనిని విడచి మనుష్య సంచారం లేని అడవిలో ఉండే చెట్లను, శిలోచ్చయములను ఆశ్రయించుగాక.

మం. శంమే పరస్మై గాత్రాయ శమ స్త్వవరాయమే
శంమే చతుర్భ్యో అజ్గేభ్యః శమస్తు తన్వేఽ మమ

ఈ మంత్రంలో రోగార్తుడు తనకు ఆరోగ్యాన్ని ప్రసాదించమని తానే ప్రార్థిస్తున్నాడు. నా శరీరంలో పై భాగంలో ఉన్న శిరస్సుకు అక్కడ ఉన్న రోగం తొలగి సుఖం కలుగుగాక. నా శరీరానికి క్రిందిభాగంలో ఉండే పాదములకు రోగం తొలగి సుఖము కలుగుగాక. నా చేతులకు కాళ్ళకు

రోగము తొలగి సుఖము కలుగుగాక. నా మధ్య శరీరానికి రోగము తొలగి సుఖము కలుగుగాక.

1 కాండం - 23 సూక్తం

మం. నక్తం జాతాస్యోషధే రామే కృష్ణే అసిక్నిచ
ఇదం రజని రజయ కిలాసం పలిత ఇచ్ఛయత్

ఈ సూక్తం, సుపర్ణో జాతః అనే మరో సూక్తం తెల్ల బొల్లి రోగాన్ని పోగొట్టడానికి వినియోగిస్తారు. భృంగ, హరిద్ర, ఇంద్ర వారుణి, నలిక, ఎండిన గోమయం. వీటినుపయోగించి పై సూక్తాలను పఠిస్తూ శ్వేత కుష్ఠును నివారిస్తారు. తెల్లబడిన వెంట్రుకలను తొలగించి ఈ ఓషధులను, సూక్తాలను వినియోగిస్తారు. ఈ రోగాలు తొలగడానికి ఈ సూక్తాలతో ఆజ్యహోమం కూడా చేస్తారు.

ఓ ఓషధీ! హరిద్రా! నీవు రాత్రి పుట్టినదానవు కాబట్టి బొల్లిని తొలగించి నలుపు కలిగించగలవు. వ్యాధితులకు రోగాన్ని తొలగించే భృంగరాజమనే ఓషధీ! నలుపు రంగును కలిగించే ఇంద్రవారుణీ! నలుపురంగును కలిగించే నీలి ఓషధీ! మీరు శ్విత్రాది రోగదోషాలను తొలగించి ఆ శరీర భాగానికి సహజమైన రంగును కలిగించండి. రోగదోషంచే తెల్లబడిన జుట్టుకు నలుపురంగు కలిగించండి.

మం. కిలాసఞ్చ పలితఞ్చ నిరితో నాశయా పృషత్
ఆత్వా స్వో విశతాం వర్ణః పరా శుక్లాని పాతయ

ఓ ఓషధీ! కిలాసం (తెల్లబొల్లి) పలితం (జుట్టు తెల్లబడుట) అనే రోగాలను తొలగించి ఆ రోగాలను నాశం చెయ్యండి. ఓ రోగీ! రోగం కలిగిన నీ శరీర భాగాలకు పూర్వమందుండే సహజవర్ణం వచ్చుగాక. రోగ భాగాల్లో ఉండే తెలుపు మరల ఈ రోగికి రాకుండా దూరంగా పోవుగాక.

మం. అసితంతే ప్రలయనమాస్థాన మసితం తవ
అసిక్న్య స్యోషధే నిరితో నాశయా పృషత్

ఓ నీలీ! నీ ఉత్పత్తి స్థానం నలుపు. నిన్ను ఉంచిన చోటు గూడా నలుపుగా అవుతుంది. ఓ ఓషధీ! నీవు నలుపుగా ఉంటావు. ఇది నీ స్వభావం. కాబట్టి నీవు ఈ శ్విత్రాది రోగ దూషితమైన శరీర భాగం నుండి రోగాన్ని వేరుచేసి రోగాన్ని పూర్తిగా పోగొట్టు.

మం. అస్థిజస్య కిలాసస్య తనూజస్య చ యత్త్వచి
దూష్యా కృతస్య బ్రహ్మణా లక్ష్మ శ్వేత మనీనశత్

ఈ మంత్రంచే ఎముక నాశ్రయించి ఉన్న కిలాసాన్ని పోగొట్టమని ప్రార్థిస్తున్నారు. ఎముకయందు, చర్మమందు ఆ మధ్యగల మాంసమందు కిలాసమును, శత్రువులు చేసిన కృత్యాప్రయోగంచే కలిగిన శ్విత్ర రోగమును ఈ మంత్రంచే పోగొడుతున్నాను.

1 కాండ, 4 అనువాకం - 25 సూక్తం

మం. యదగ్నిరాపో అదహత్ ప్రవిశ్య యత్రాకృణ్వన్ ధర్మధృతో నమాంసి
తత్ర త ఆహుః పరమం జనిత్రం సనః సంవిద్వాన్ పరివృఙ్ధ్థితక్మన్

ఒకరోజు ఉండే జ్వరము, శీతజ్వరం, సంతతజ్వరం, వేలాజ్వరం మొదలైనవి శాంతించడానికి ఈ సూక్తం జపిస్తారు.

ఓ కృచ్ఛ్ర జీవనాన్ని కలిగించే జ్వరమా! ఇనుప గొడ్డలిని కాల్చి నీటిలో ఉంచి ఆ నీటితో రోగికి స్నానం చేయించాలి. అగ్ని నీటిలో ప్రవేశించి ఉంది. ఈ ఉష్ణోదకంచే జ్వరం కలిగిన వానికి అభిషేకం చేయడం వల్ల రోగిని విడిచిపెట్టు. ఉష్ణంతో సహా వెళ్ళు.

ధర్మము నాచరించే యజమానులు ఈ అగ్నిలో హవిస్సులను వేలుస్తారు. ఆ అగ్నినుండే నీ ఉత్కృష్ట జన్మ కలిగిందని చెబుతున్నారు. (జఠరాగ్ని నుండే జ్వరమేర్పడుతుందని వైద్యులు చెబుతున్నారు).

కృచ్ఛ్ర జీవనం కలిగించే జ్వరమా! తడుపుటకు ఉపయోగించే వేడి జలములలో ప్రవేశించి అగ్ని నిన్ను తగులబెట్టెను. కాబట్టి ఈ ఉష్ణముతో కూడ మమ్ము వదలి వెళ్ళు.

మం. యద్యర్చి ర్య దివాసి శోచిః శకల్యేషి యది వా తే జనిత్రమ్
హ్రూడుర్నామాసి హరితస్య దేవ సనః సంవిద్వాన్ పరివృఙ్ధితక్మన్

ఓ తక్మ జ్వరమా! నీవు ఉష్ణగుణంతో కూడినదానవైతే, శరీరానికి సంతాపం కలిగించే దానవైతే నీ జన్మ అగ్నినుండి ఏర్పడినది. ఓ జ్వరమా! నీవు పురుష శరీరానికి పీతవర్ణం కలిగిస్తావు. కాబట్టి నీకు హ్రూడువు అని పేరు ఉంది. జ్వరానికి చాలా పేరులున్నాయి. వాటిలో ఇది ఒక ప్రసిద్ధ నామము.

మం. యదిశోకో యది వాభిశోకో యదివారాజ్ఞో వరుణస్యాసి పుత్రః
హ్రూడుర్నామాసి హరితస్యదేవ సనః సంవిద్వాన్ పరివృఙ్ధితక్మన్

ఓ శీతజ్వరమా! నీవు శరీరం లోపల తాపాన్ని కలిగించేదానవు. శరీరానికి అంతటికీ తాపాన్ని కలిగిస్తావు. పాపాలను చేసేవారిని శిక్షించే వరుణ దేవునికి కుమారుడవు. నీ పేరు హ్రూడువు. నీవు శరీరానికి పసుపురంగు కలిగిస్తావు. కాబట్టి నీకీపేరు వచ్చింది. నీకు కారణము అగ్ని అని గుర్తించి మా శరీరము ఉష్ణముతో గూడ విడిచిపెట్టు.

మం. నమః శీతాయ తక్మనే నమో రూరాయ శోచిషే కృణోమి
యో అన్యేద్యు రుభయద్యు రభ్యేతి తృతీయకాయ నమో అస్తు తక్మనే

చలిని కలిగించే శీత జ్వరానికి నమస్కారం. చలి తర్వాత తాపాన్ని కలిగించే రూరమనే జ్వరానికి నమస్కారం. మరునాడు వచ్చే శీత జ్వరం, రెండురోజులు వచ్చే శీతజ్వరము, మూడవరోజూ వచ్చే శీతజ్వరము నాలుగవ రోజు మొదలైన రోజులలో వచ్చే శీతజ్వరం వీటికి నమస్కారాలు. ఇలా నమస్కారాలచే ప్రీతుడై జ్వరము మమ్ము వదిలిపెట్టుగాక.

2వ కాండ - 4వ అనువాకం - 25 సూక్తం

మం. శంనో దేవీ పృష్ణి పర్ణ్యశం నిర్ఋత్యా అకః
ఉగ్రాహి కణ్వ జమ్భనీ తామభక్షి సహస్వతమ్

కుష్ఠురోగం మొదలైన రోగాలకు వైద్యం చేయవలసినపుడు ఈ సూక్తంతో పృశ్ని పర్ణిని పిండిచేసి పూయాలి. ఈ వైద్య ప్రక్రియలో మరికొన్ని ఓషధులు కూడా ఉపయోగించాలి.

ప్రకాశించే చిత్రపర్ణి అనే ఈ ఓషధి మాకు రోగం తగ్గించి సుఖం కలిగించుగాక. రోగానికి మూలమైన నిర్ఋతికి దుఃఖం కలిగించుగాక. ఉగ్రమైన బలం కలది, పాపాన్ని నశింపజేసేది, రోగాన్ని పోగొట్టగల సామర్థ్యం కలది అయిన పృశ్నిపర్ణిని అనులేపనం మొదలైన కర్మలచే నేను సేవిస్తున్నాను.

మం. సహమానేయం ప్రథమా పృశ్ని పర్ణ్యజాయత
తయాహం దుర్నామ్నాం శిరోవృశ్చామి శకునేరివ

రోగాలను తొలగించే సామర్థ్యం కల పృశ్నిపర్ణి ఓషధులలో ముఖ్యమైనదై ప్రథమంగా పుట్టింది. ఈ పృశ్నిపర్ణిచేత దద్రు, విసర్పకం, శ్విత్రం మొదలైన కుష్ఠురోగ విశేషాలకు శిరస్సువలె ప్రధానమైన మూలకారణాన్ని నేను తొలగిస్తున్నాను. పక్షి శిరస్సును కత్తి మొదలైన సాధనాలు లేకపోయినా అనాయాసంగా ఎలా విరిచివేయవచ్చో ఆ విధంగా ఈ రోగాన్ని సమూలంగా పృశ్నిపర్ణితో పెకలించి వేస్తున్నాను.

మం. అరాయ మసృక్పావానం యశ్చస్థాతిం జిహీర్షతి
గర్భాదం కణ్వం నాశయ పృశ్నిపర్ణి సహస్వచ

శరీరంలో ఉండే రక్తాన్ని త్రాగే కుష్ఠు మొదలైన రోగాలను నశింపజెయ్యి. ఆ రోగాలచే శరీరాన్ని పోషించే శుద్ధరక్తం పోతుంది. కనుక రోగం రక్తాన్ని పానం చేస్తోందని ఆలంకారికంగా చెప్పారు. శరీరాభివృద్ధిని హరించబోయే గ్రహణి మొదలైన రోగాలను కూడా నాశం చెయ్యమని ప్రార్థన.

ఓ పృశ్నిపర్ణీ! గర్భాన్ని తినివేసే రోగానికి మూలమైన పాపాన్ని నాశం చెయ్యి. గర్భాన్ని ధ్వంసం చేసే శత్రువులను తిరస్కరించు.

మం. గిరిమేనాం ఆవేశయ కణ్వాన్ జీవిత యోపనాన్
తాంస్త్వందేవి పృశ్నిపర్ణ్యగ్ని రివానుదహన్నిహి

ఓ పృశ్నిపర్ణీ! ప్రాణాన్ని మోహింపజేసే కుష్ఠాది రోగాలకు మూలమైన పాపాన్ని కొండలయందు పడవెయ్యి. ప్రకాశించేదానా! పృశ్నిపర్ణీ! దావాగ్ని అరణ్య మృగాలను తగులబెట్టినట్లు నీ వా పాపాలను దహిస్తూ వెళ్ళు.

మం. పరాచ ఏనాన్ ప్రణుదకణ్వాన్ జీవితయోపనాన్
తమాంసి యత్ర గచ్ఛన్తి తత్క్రవ్యాదో అజీగమమ్

ఓ పృశ్నిపర్ణీ! ప్రాణాలను మోహింపజేసే ఈ పాపాలను మాకు దూరంగా పోగొట్టు. సూర్యోదయానంతరం చీకట్లు సూర్యరశ్మి లేనిచోట చేరినట్లు సూర్యుడు లేని స్థానానికి మాంసాది ధాతువులను తిను రోగాలను పంపుతున్నాను. రోగం పాపానికి ఫలం. రోగం తగ్గించినా, పాపం ఉంటే మళ్ళీ రోగం వస్తుంది. కాబట్టి పాపం కూడా పోవాలని చెబుతున్నాను.

ఇక్కడ కొన్ని ఓషధుల పేర్లున్నాయి. వాటి ఔషధ శక్తులను ప్రయోగపూర్వకంగా పరిశీలన చేసి, వాటిని ప్రస్తుతకాలంలో కూడా రోగనివారణానికి ఉపయోగించగలిగితే లోకానికి మేలు కలుగుతుంది.

మం. అపచితః ప్రతత సుపర్ణో వసతేరివ
సూర్యః కృణోతు భేషజం చన్ద్రమా వోపోచ్ఛతు (6-9-83 సూ)

గండమాలా రోగమునకు చికిత్స చేయుటయందు ఈ సూక్తానికి వినియోగం. ఆ చికిత్సా విధానం కౌశిక సూత్రమందుంది. రోగంవల్ల గళం నుండి క్రిందికి వ్యాపించిన గండమాల ఈ శరీరము నుండి తొలగుగాక.

శోభనముగా ఎగురు గ్రద్ద తన గూడునుండి శీఘ్రంగా ఎగిరినట్లు ఈ రోగి గండప్రదేశమును విడిచి ఇచటనుండి ఈ రోగం వేగంగా ఎగిరిపోవును గాక. ఈ గండమాలను సర్వప్రేరకుడైన ఆదిత్యుడు నివారణం చేయుగాక. అమృతమయుడైన చంద్రుడు గండమాలను పోగొట్టుగాక.

మం. ఏన్యేకా శ్యేన్యేకా కృష్ణైకా రోహిణీద్వే
సర్వాసా మగ్రభం నామావీరఘ్నేశపేతన

గండమాలా రోగములో చాలా భేదాలున్నాయి. ఒక గండమాలకు ఏని అని పేరు. ఏతవర్ణము కలది ఏని. కొంచెం ఎరుపుతో కూడిన తెలుపు రంగుకు ఏతవర్ణమని పేరు. వేరొక గండమాలకు శ్యేని అని పేరు. శ్వేత వర్ణము కలది శ్యేని. మిక్కిలి తెల్లని రంగు శ్వేతవర్ణము. ఇంకొక గండమాల కృష్ణ వర్ణము కలది. రెండు గండమాల రకములకు రోహిణులు అని పేరు. ఇవి ఎరుపు వర్ణం కలవి. వాతపిత్త శ్లేష్మాలవల్ల ఇవి వేరు వేరు రంగులతో ఉంటాయి.

ఓ గండమాలా రోగములారా! నేను మీ నామాలను గ్రహిస్తున్నాను. కాబట్టి మీరు సంతోషించి ఈ రోగిని చంపకుండా విడిచిపెట్టి వెళ్ళండి.

మం. అసూతికా రామయణ్యపచిత్ ప్రపతిష్యతి
గ్లౌరితః ప్రపతిష్యతి సగలున్తో నశిష్యతి

చీమును కలిగించకుండా నాడీ మార్గాలలో సంచరించేది, వ్రణాత్మకము అయిన ఈ రోగం ఈ శరీరాన్నుండి మన్త్ర సామర్థ్యం వల్ల బయటకుపోతుంది. ఈ వ్రణంవల్ల సంతోషం నశిస్తోంది. ఈ రోగం పోవడంవల్ల దానివల్ల కలిగిన దుఃఖానుభవం కూడా పోతుంది.

గండమాలవల్ల అక్కడక్కడ చేతులు కాళ్ళు మొదలైన అవయవాల సంధుల్లో కంతులు కలుగుతాయి. చంద్రుడు వాటిని, వ్రణాల వల్ల కలిగిన వికృతులనన్నిటినీ తొలగిస్తాడు.

మం. వీహిస్వా మాహుతిం జుషాణో మనసా
స్వాహా మనసా యదిదం జుహోమి (అథర్వ 6-9-84)
యస్యాస్త ఆసని ఘోరే జుహోమ్యేషాం, బద్ధానామవసర్జనాయకమ్
భూమిరితి త్వాభి ప్రమన్వతే జనా నిర్ఋతి రితి త్వాహంపరివేద సర్వతః

ఓ వ్రణ రోగాభిమానిదేవా! నీవు నీకు సమర్పించిన ఆహుతిని ఆస్వాదించి భక్షించు. ఈ ఆహుతి బాగుగా హుతమగు గాక.

ఓ రోగాభిమాని పాపదేవతా! నేను మనస్ఫూర్తిగా ఈ ఆహుతిని హోమం చేస్తున్నాను. నీ క్రూరమైన ముఖమందు హవిస్సు అర్పిస్తున్నాను. ఈ వ్రణ రోగం వల్ల కలిగిన బంధాలు తొలగించడంకోసం వీటిని సేవించు. వ్రణాన్ని కడగడం కోసం ఈ ఔషధ జలం ఉపయోగిస్తాను.

మం. భూమిరితిత్వాభిప్రమన్వతే జనా నిర్ఋతి
రితిత్వాహం పరివేద సర్వతః

ఓ వ్రణాభిమాని దేవతా! నిన్ను విశేష జ్ఞానం లేనివారు మామూలు ప్రదేశమని భావిస్తారు. నేను నీ స్వరూపాన్ని ఎరిగినవాడను. అన్ని రోగాలకు మూలకారణమైన పాపదేవతవని అన్ని హేతువులవలన ఎరుగుదును.

అంతటా ఉండే ఓ పాపరూపిణీ! మేం సమర్పించిన హవిస్సు గ్రహించు. మేం ఇప్పుడు సమర్పించిన హవిర్భాగం నీది. దీనితో సంతోషించి మాకు దగ్గరలో గల గోవు మొదలైన వాటిని, దూరంగా మాకు కనబడకుండా ఉన్నవారిని ఈ రోగానికి మూలమైన పాపం నుండి విడిపించు. ఈ హవిస్సు నీకు బాగా హుతమగుగాక.

మం. ఏవోష్వ న్నిర్ఋతే నేహా త్వమయస్మయాన్ విచృతాబన్ధపాశాన్
యమో మహ్యం పునరిత్త్వాం దదాతి తస్మైయమాయ నమో అస్తు
మృత్యవే

పూర్తిగా బాధ కలిగించే పాపదేవతా! మమ్మల్ని బాధించడానికై ఇనుప త్రాళ్ళవలె మిక్కిలి దృఢమైన ఈ బంధనరూప రజ్జువుల వంటి రోగాలను భేదించు.

'ఓ రోగగ్రస్తుడా! ప్రాణాలనపహరించు యముడు నిన్ను మరల మాకిస్తున్నాడు. ప్రాణాపహారియైన ఆ మృత్యురూపుడయిన యమునకు నమస్కారమగుగాక.

మం. అయస్మయే ద్రుపదే బేధిషే ఇహాభిహితో మృత్యుభిర్యే సహస్రమ్
యమేనత్వం పితృభి స్సంవిదాన ఉత్తమం నాకమధిరోహ యేమమ్

ఓ నిర్ఋతీ! పాపదేవతా! ఇనుముతో నిర్మించిన సంకెళ్ళతోను, కర్రతో చేసిన పాదబంధనమందు నీవు పురుషుణ్ణి బంధించినప్పుడు అతడు మృత్యు పాశాలచే బంధింపబడతాడు. పాపదేవత సంకెళ్లు మొదలైన రూపాలతో బాధిస్తుందన్న మాట. జ్వరాదిరోగాలు, రక్షః పిశాచాదులు ఇలా మరణ హేతువులు. వాటిద్వారా పాపదేవత బాధిస్తుందని భావం.

ఓ నిర్ఋతి దేవతా! నీవు యమునితోను, పితృదేవతలతో ఆలోచించి ఐకమత్యం పొంది దుఃఖ స్పర్శలేని ఉత్తమ సుఖమును ఈ రోగికి కలిగించు.

6 కాండం - 11 అను. 109 సూ -

ఈ సూక్తం ధనుర్వాతం క్షిప్తవాతం మొదలైన వాతరోగశాంతికోసం వినియోగిస్తారు. ఆ శాంతివిధానం కౌశిక సూత్రంలో ఉంది.

మం. పిప్పలీ క్షిప్త భేషజ్యాఽ తాతి విద్ధ భేషజీ
తాం దేవాః సమకల్పయ న్నియం జీవిత వా అలమ్

పిప్పలి అనే ఓషధికి కణాది అని పర్యాయనామం. ఇది ఇతర ఓషధులను తిరస్కరించే గొప్ప ఓషధి. ఇతర ఓషధుల కంటె గొప్పదని భావం.

ఇది క్షిప్తమనే వాతరోగాన్ని తొలగిస్తుంది. ఇది ఇతర ఓషధులను అతిశయంగా వేధ చేస్తుంది. ఇతర ఓషధుల కంటె ఉత్కృష్టమైనదని భావం. రోగాన్నంతటినీ తొలగిస్తుంది కాన అతివిద్ధభేషజి అని దీనిని స్తుతించారు.

ఇలాంటి పిప్పలిని ఇంద్రాది దేవతలు అమృత మథన సమయంలో ఈ ఒక్క ఓషధే సర్వరోగ నివారణం చేత సర్వప్రాణులను జీవింప చెయ్యడానికి సమర్థము అని ఏర్పరచారు.

మం. పిపల్యః సమవదన్తాయతీ ర్జననా దధి
యం జీవ మశ్నవామహైన సరిష్యాతి పూరుషః

హస్తి పిప్పలి మొదలైన వేరు వేరు రకములైన పిప్పలి ఓషధులన్నీ అమృతంకోసం మథనం జరిగిన కాలంలో పుట్టాయి. తరువాత ఒకచోట చేరి 'ఏ పురుషునిలో భేషజంగా మేం ప్రవేశిస్తామో ఆ ప్రాణి నశించకుండు గాక' అని సంభాషించుచున్నాయి.

మం. అసురాస్త్వా న్యఽఖనన్ దేవా స్త్వోదవపన్ పునః
వాతీ కృతస్య భేషజీ మథో క్షిప్తస్య భేషజీమ్

ఓ పిప్పలీ! అసురులు నిన్ను తవ్వారు. వాతరోగం కలిగిన వానికి నీవు ఔషధానివి. మాటి మాటికి అవయవాలను క్షేపణం చేసే రోగం కలవానికి నీవు ఔషధానివి. సకల ప్రాణులకు హితం కోసం దేవతలు నిన్ను ఉద్ధరించారు.

6 కాం - 13 అను - 136 సూ -

జుట్టు వృద్ధి చేసుకోవాలని కోరేవాడు కాచమాచీఫలం, జీవన్తీ ఫలం, భృంగరాజం వినియోగించి చెప్పబోయే రెండు సూక్తాలతో అనుష్ఠానం చేయాలి. వినియోగ విధానం కౌశికసూత్రంలో చెప్పారు.

మం. దేవీ దేవ్యామధి జాతా పృథివ్యా మస్యోషధే
తాం త్వా నితత్ని కేశేభ్యో దృంహణాయ ఖనామసి

కాచమాచి మొదలైన ఓషధులారా! మీరు ప్రకాశించేవారై భూమియందు జన్మించారు. అడ్డంగా పాకే ఓషధీ! కేశములను దృఢంగా చేసుకోవడానికి నిన్ను సంగ్రహిస్తున్నాము.

మం. దృంహప్రత్నాన్ జనయా జాతాన్ జాతాను వర్ధీయసస్కృధి
యస్తే కేశోవ పద్యతే సమూలో యశ్చవృశ్చ్యతే ।
ఇదంతం విశ్వభేషజ్యాఽభిషిఞ్చామి వీరుధా ॥

ఓ ఓషధీ! పురాతన కేశాలను నీవు దృఢం చెయ్యి. పుట్టని కేశాలను పుట్టించు. పుట్టిన కేశాలను కూడా బాగా వృద్ధి పొందునట్లు పొడవైనవానిగా చెయ్యి.

కేశముల అభివృద్ధిని కోరేవాడా! నీ జుట్టు నడుము తెగి భూమిపై పడుతున్నది. మూలంతో కూడా కేశము ఛేదింపబడుతున్నది.

ఈ ఓషధి వినియోగం చేత నీ జుట్టును ఆశ్రయించిన రోగాలనన్నింటినీ తొలగించే ఓషధి (జలం) చేత తడుపుతున్నాను. ఈ ఓషధి ప్రయోగంవల్ల, మంత్ర సామర్థ్యంవల్ల జుట్టునాశ్రయించిన రోగాలసమూహం నశించాలి.

మం. యాంజమదగ్ని రఖనద్ దుహిత్రే కేశవర్ధనీమ్
తాం వీతహవ్య ఆభర దసితస్య గృహేభ్యః

జ్వలించే అగ్నులు కల జమదగ్ని మహర్షి తన కుమార్తె కోసం కేశాలను వృద్ధి పొందించే ఈ ఓషధిని తవ్వి పైకి తీశాడు. ఆ ఓషధిని వీతహవ్యుడనే మహర్షి కేశవృద్ధి కోసం కృషి కేశుడనే ఋషి ఇంటినుండి తీసుకువెళ్ళాడు.

మం. అభీశునా మేయా ఆసన్ వ్యామేనాను మేయాః ।
కేశానదా ఇవ వర్ధన్తాం శీర్ష్ణస్తే అసితాః పరి ॥

కేశాభివృద్ధిని కోరేవాడా! నీ కేశాలు మొదట అంగుళితో కొలవదగినవి. తరువాత నాలుగంగుళాలు, పిదప ఆరంగుళాలు, ఆ తరువాత చూచిన రెండు హస్తాల పరిమాణంచే కొలువదగినవయ్యాయి. ఓ పురుషుడా! నీ శిరస్సునుండి చుట్టూ నల్లటి కేశాలు నడాలనే గడ్డివలె వృద్ధి పొందుగాక.

నడాలు చెరువునీటి దగ్గర పుట్టి ఒత్తుగా వేగంగా పొడవుగా పెరుగుతాయి. అలా జుట్టు పెరగాలని భావం.

మం. దృంహమూల మాగ్రం యచ్ఛ విమధ్యం యామ యౌషధే
కేశా నడా ఇవ వర్ధన్తాం శీర్ష్ణస్తే అసితాః పరి

ఓ ఓషధీ! కేశముల మూలాన్ని దృఢం చెయ్యి. కేశముల కొనలను పొడవుగా చెయ్యి. కేశముల మధ్యములను కూడా స్థిరంగా చెయ్యి. ఓ పురుషుడా! నీ కేశాలు నడాలవలె నీ శిరస్సునుండి చుట్టూ దట్టంగా వృద్ధి పొందుగాక.

* * *

10. సంచరణ ప్రాధాన్యం

ఇది ఐతరేయ బ్రాహ్మణంలో 33 అధ్యాయంలో 3వ ఖండంలోనిది.

హరిశ్చంద్రుడనే రాజు తనకు సంతానం కలిగితే అతనితో యజ్ఞం చేస్తానని వరుణునకు మొక్కుకున్నాడు. అభిలాష బలంగా ఉన్నప్పుడు ఇలాంటి మొక్కులు మొక్కడం అక్కడక్కడ కనబడుతుంది. వరుణానుగ్రహంవల్ల అతనికి కుమారుడు కలిగాడు. కాని అతనిని యజ్ఞంలో పశువుగా చెయ్యలేక ఏవో సాకులు చెప్పి యజ్ఞానికి వాయిదాలు వేశాడు. చివరికి వరుణుని ఒత్తిడిచేత కుమారుడికి విషయం చెప్పాడు. కుమారుడు రోహితుడు యజ్ఞంలో పశువుగా ఉండడానికి అంగీకరించక ధనుస్సు తీసుకుని అడవికి వెళ్ళిపోయాడు.

మం. అథహైక్ష్వాకం వరుణో జగ్రాహ తస్యహోదరం
జజ్ఞే. తదుహ రోహితః శుశ్రావ. సోరణ్యా
ద్గ్రామమేయాయ. తమిన్ద్రః పురుష రూపేణ పరేత్యోవాచ.
నానా శ్రాన్తాయ శ్రీరస్తీతి రోహిత శుశ్రుమ
పాపో నృషద్వరోజన ఇన్ద్ర ఇచ్చరతః
సఖా చరైవేతి.

రోహితుడు అడవిలో సంవత్సరం నివసించాక ఇక్ష్వాకు వంశీయుడైన హరిశ్చంద్రుని వరుణుడు రోగరూపంతో పట్టుకున్నాడు. దానిచేత హరిశ్చంద్రుని పొట్ట నీటితో ఉబ్బి మహోదరమనే రోగం కలిగింది. ఈ విషయం అడవిలో ఉన్న రోహితునికి ఒకరి ద్వారా తెలిసింది. అతడు తండ్రిని చూడడానికి అడవినుండి గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఇంద్రుడు బ్రాహ్మణరూపంతో వచ్చి రోహితునితో ఇలా అన్నాడు.

శ్రమలేకుండా ఒకచోటే నివసించే శీలం కలవాడికి అనేక విధాలయిన సంపద ఉండదు. కార్యనిర్వహణం కోసం పలుచోట్లకు సంచరించి అలసిన వాడికి అనేక విధాలయిన సంపద కలుగుతుందని నీతి కుశలురయిన పురుషులవలన విన్నాము.

విద్యాదులచేత శ్రేష్ఠుడయినా బంధుగృహాల్లో ఎల్లప్పుడూ ఉంటూ వారిచే అవమానింపబడేవాడు తుచ్ఛుడవుతాడు. కాబట్టి నీకు తండ్రి ఇంట్లో ఉండడం తగదు. అడవిలో ఉండే నాకు సహాయం ఎలా ఉంటుందని సందేహించనక్కరలేదు. సంచారం చేసే నీకు పరమేశ్వరుడే సఖుడవుతాడు. కాబట్టి అన్నివిధాలా సంచరించు అని చెప్పాడు.

వివరణం : ఈ కథలో ఇంద్రుడు రోహితుని తండ్రి దగ్గరకు వెళ్ళకుండా ఆపడంకోసం ఈ మాటలు చెపుతున్నాడు. అయినా వీటిలో ఒకేచోట కదలకుండా ఉండడంవల్ల కలిగే దోషాలు సంచరణం చేసేవారికి కలిగే గుణాలు చెప్పడం జరిగింది. కుర్చీనుండి కదలకుండా ఉండేవారికి అలా కదలకపోవడంవల్ల కలిగే దోషాలు, సంచారంవల్ల కలిగే గుణాలు ఈ సూక్తంలో గ్రహించదగినవి.

మం. చరైవేతివైమా బ్రాహ్మణోఽ వోచదితి హ ద్వితీయం
సంవత్సర మరణ్యే చచార సోరణ్యాద్గ్రామమేయాయ
తమిన్ద్రః పురుష రూపేణ పర్యేత్యోవాచ
పుష్పిణ్యౌ చరతో జఙ్ఘే భూష్ణురాత్మా ఫలగ్రహిః
శేరేస్య సర్వే పాప్మానః శ్రమేణ ప్రపథే హతశ్చరైవేతి

బ్రాహ్మణరూపంలో ఉన్న ఇంద్రుని వాక్యం విని అతని మాటపై గొప్ప ఆదరంతో మరల ఒక సంవత్సరం అడవిలో సంచరించి తండ్రిని చూడడంకోసం గ్రామానికి వచ్చే రోహితుని చూచి ఇంద్రుడు బ్రాహ్మణ రూపంతో వచ్చి ఇలా చెప్పాడు. పర్యటన చేసేవారికి పిక్కలు పుష్పించిన

చెట్లవలె శ్రమ జయంచే దృఢంగా అందంగా ఉంటాయి. అలాగే మధ్యదేహం కూడా అభివృద్ధి పొందినదై ఆరోగ్యమనే ఫలంతో ఉంటుంది. వృద్ధిపొందే వృక్షం తగిన కాలంలో పళ్ళను కాసినట్లు సంచారంచేసే పురుషునికి బీజాదులు శక్తివంతాలవుతాయి. జఠరాగ్ని దీపిస్తుంది. మధ్యదేహం పాటవంతో ఆరోగ్యఫలం పొందుతుంది.

తీర్థక్షేత్రాలను సంచరించేవారికి దేవతా దర్శనంచేత, తీర్థయాత్రాది ప్రయాసచేత పాపాలు పోతాయి. కాబట్టి అరణ్యంలో సంచరించు. తండ్రి ఇంట్లో ఉండకు.

మం. చరైవేతి వైమా బ్రాహ్మణోవోచదితి హ తృతీయం సంవత్సరమరణ్యే
చచార సోరణ్యాద్గ్రామమేయాయ తమిన్ద్రః పురుష రూపేణ పర్యేత్యోవాచ.
ఆస్తే భగ ఆసీనస్యోర్ధ్వ స్తిష్ఠతి తిష్ఠతః
శేతే నిపద్యమానస్య చరాతి చరతో భగశ్చరైవేతి ॥

కూర్చుని ఉండేవాడికి సంపద కూర్చుని ఉంటుంది. అభివృద్ధికి కారణమయిన ప్రయత్నంలేదు కాబట్టి వృద్ధిని పొందదని భావం. లేచి నిలబడినవాడి సంపద అభివృద్ధికి అభిముఖంగా ఉంటుంది. కృషి వాణిజ్యం మొదలయిన ప్రయత్నం జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి అభివృద్ధి కభిముఖంగా ఉంటుందని చెప్పారు. భూమియందు పడుకొని ఉన్నవారి సంపద నిద్రపోతుంది. ఉన్న ధనరక్షణం గురించికూడా ఆలోచన లేనందువల్ల అది నశిస్తుందని భావం. సంపాదనకోసం పర్యటనం చేసేవారికి సంపద నానాటికి వృద్ధి పొందుతుంది. కాబట్టి సంచరణం చెయ్యి. ఒకచోట ఉండకు అని భావం.

మం. చరైవేతి వైమా బ్రాహ్మణో వోచదితిహ
చతుర్థం సంవత్సరమరణ్యే చచార సోరణ్యా
ద్గ్రామమేయాయ తమిన్ద్రః పురుషరూపేణ పర్యేత్యోవాచ

కలిః శయానో భవతి సంజిహానస్తు ద్వాపరః
ఉత్తిష్ఠం స్త్రేతా భవతి కృతం సంపద్యతే చరం శ్చరైవేతి.

వ్యక్తికి నాలుగురకాల స్థితులుంటాయి. నిద్రించడం, దానిని వదిలిపెట్టడం, లేవడం, సంచరించడం అని ఆ నాల్గు అవస్థలు. కలియుగం పడుకొని ఉంటుంది. ద్వాపరయుగం పానుపును వదలుతుంది. త్రేతాయుగం పానుపు వదలి లేస్తుంది. కృతయుగం సంచరిస్తూ ఉంటుంది. ఇక్కడ నాలుగు యుగాల లక్షణాలను చెప్పారు. వీటిలో మొదటి దానికంటే రెండవది, దానికంటె మూడవది, అంతకంటె నాల్గవది శ్రేష్ఠాలు. కాబట్టి కృతయుగ లక్షణంతో వ్యక్తి కర్తవ్యనిర్వహణంకోసం సంచరిస్తూ ఉండాలి.

మం. చరైవేతి మా బ్రాహ్మణోఽ వోచదితి హ పఞ్చమం
సంవత్సర మరణ్యేచచార సోరణ్యాద్గ్రామ మేయాయ
తమిన్ద్రః పురుష రూపేణ పర్యేత్యోవాచ
చరన్వై మధు విన్దతి చరన్స్వాదు ముదుమ్బరమ్
సూర్యస్య పశ్య శ్రేమాణం యేనతన్ద్రయతే చరంశ్చరైవేతి

ఒక పురుషుడు సంచరిస్తున్నవాడై వృక్షాగ్రమందు తేనె పొందుతాడు. మరొకడు సంచరిస్తూ రుచిగా ఉండే మేడిపళ్ళు మొదలయిన ఫలాలను పొందుతాడు. అంటే ఆయా ప్రదేశాల్లో దొరికే భోగాలను పొందుతాడు. సూర్యుడు అంతటా సంచరిస్తూన్నా బద్ధకించడంలేదు. అతని శ్రేష్ఠత్వం జగద్వంద్యత్వం చూడు. కాబట్టి సంచరించు.

ఇలా ఇంద్రుడు చేసిన ఉపదేశంచేత సంచారం చేసిన రోహితునకు యజ్ఞంలో పశువు కానక్కరలేకుండా తండ్రికి ఆరోగ్యం కలిగే ఉపాయం దొరికింది.

కాబట్టి వ్యక్తి బద్ధకించకుండా ఒక మంచి కర్తవ్యాన్ని నెరవేర్చడంకోసం సంచరిస్తూ ఉండాలి.

ఐతరేయ బ్రాహ్మణం. 3 అధ్యాయం, 3 ఖండం : ఇంద్రుడు వరుణునకు హరిశ్చంద్రునికి పరీక్షపెట్టాడు. అందుకే రోహితుని వెళ్ళకుండా ఆపాడు. హరిశ్చంద్రుడు మొక్కిన మొక్కు చెల్లించకపోవడంచే వరుణుడు సహనం కోల్పోయి హరిశ్చంద్రునికి మహోదరరోగం కలిగించాడు.

అనుచితమైన మొక్కు మొక్కి మమతచే మాటనిలుపుకోలేక హరిశ్చంద్రుడు జలోదరరూప ప్రారబ్ధం అనుభవించాడు. రోహితుడు ఇంద్రుని మాటను పాటించడంవల్ల తనకు జీవనం, తండ్రికి ఆరోగ్యం కలిగే ఉపాయం లభించింది. ఈ సందర్భంలో ఇంద్రుడు చేసిన ఉపదేశం అనేకార్థబోధకంగా ఉంది. సంచరించేవారికి పిక్కలు అందంగా బలంగా ఉంటాయనేమాట ఉపలక్షకం. చెప్పదగిన దానిలో కొంతమాత్రమే చెప్పడం ఉపలక్షణం. నడిచేవారికి శరీరం అందంగా బలంగా ఉంటుందని భావం.

సంచరించేవారికి భాగ్యం లభిస్తుందనడంచే బద్ధకించకుండా పురుషార్థాలకోసం ప్రయత్నించే వారికి అవి లభిస్తాయని తెలుస్తుంది. ఇది కూడా ఉపలక్షణ పద్ధతిచే చేసిన బోధ. ఇవి శాశ్వత సత్యాలు.

* * *

11. భూమికర్షణం - బీజావాపం

శ్రీ కృష్ణయజుర్వేదంలో నాల్గవకాండలో రెండవ ప్రపాఠకంలో అయిదవ అనువాకంలో ఆహవనీయచయనంకోసం భూమిని దున్నడం, తరువాత విత్తనాలు నాటడం, ఓషధులతో చికిత్స ప్రస్తావన ఉన్నాయి.

ఆర్యులు దేశద్రిమ్మరులు. వారికి వేటవృత్తి అని భారతచరిత్ర పుస్తకాల్లో పాఠాలు చెబుతారు. పై వేదభాగాన్ని పరిశీలిస్తే వేదం సేద్యవిషయాలనేకం చెప్పిందని తెలుస్తుంది. ఓషధి మొక్కలను పెంచి వైద్యంచేయడంకూడా వేదం ఉపదేశించిందని తెలుస్తుంది. దీనిలో చాలా మంత్రాలు అథర్వణవేదంలో కూడా ఉన్నాయి.

మం. సంవరత్రా దధాతన నిరాహావాన్ కృణోతన
సిఞ్చామహా అవట ముద్రిణం వయం విశ్వాహాదస్తమక్షితమ్

మం. నిష్కృతాహావ మవటగ్ం సువరత్రగ్ం సుషేచనమ్
ఉద్రిణగ్ం సిఞ్చే అక్షితమ్

కట్టెలతో రాతితో ఏర్పరచిన తొట్టెలోకి నీరు పోయండి. ఈ తొట్టెల నుండి నీరు ప్రవహించడానికి తూములు, నూతినుండి నీరు తోడడానికి దృఢమయిన చర్మంతో చేసిన త్రాళ్ళు, బాగా నీళ్ళు తోడడానికి సాధనమయిన చేదలు, అయిపోకుండా బాగా నీరు కలిగిన నూతులు ఏర్పరచండి.

మం. సీరాయుఞ్జన్తి కవయో యుగా వితన్వతే పృథక్
ధీరా దేవేషు సుమ్నయా

దేవతలకు సుఖం కోరేవారు, సేద్యం చేయడమెరిగినవారు, బద్ధకంలేనివారు నాగలిని సిద్ధం చేయుదురుగాక. కాడులు మూడుకాని ఆరుకాని విడిగా విస్తరింతురు గాక.

మం. యునక్త సీరావియుగా తనోత కృతేయోనౌ వపతేహ బీజమ్
గిరాచ శ్రుష్టి స్సభరా అసన్నో నేదీయ ఇత్సృణ్యా పక్వమాయత్

ఓ కర్షకులారా! నాగళ్ళను కట్టండి. కాడులను అమర్చండి. దున్నిన తరువాత ఈ యోగ్యమయిన నేలలో శుభాశీస్సులతో విత్తనాలను నాటండి. అక్కడ మొలచిన వరిమొక్కలు మాకోసం ధాన్యభారంతో కూడినవగుగాక. అల్పకాలంలోనే పండిన ధాన్యం ఏర్పడుగాక. కోతకుపయోగించే కొడవలిచే ఆ ధాన్యం మాచెంతకు చేరుగాక.

మం. లాఙ్గలం పవీరవగ్ం సుశేవగ్ం సుమతిత్సరు
ఉది త్కృషతి గామవిం ప్రపర్వ్యఇ్చ పీవరీమ్
ప్రస్థావద్రథ వాహనమ్

వజ్రంవలె మిక్కిలి పదునైనది, కర్షకులు బాగా దున్నుటకు అనువైనది అయిన ఈ నాగలి పెద్ద మట్టి పెళ్ళలు లేచునట్లు దున్నుగాక. ఈ నాగలి మంచిదని కర్షకులు భావిస్తారు. ఇది ఎత్తుపల్లాలుగల భూమిని గమన విశేషంతో దున్నుతుంది. ఈ దున్నడంచే పంట బాగా పండడంవల్ల యజమానుడు బలిసిన గోవును, ప్రథమ వయస్సుగల కన్యను, ప్రయాణ సమర్థమయిన రథమును సంపాదించుకుంటాడు.

మం. శునం నః ఫాలా వితుదన్తు భూమిగ్ం శునం కీనాశా అభియన్తువాహాన్
శునం పర్జన్యో మధునా పయోభిః శునా సీరా శున మస్మాసు ధత్తమ్

మాకు సుఖం కలిగే విధంగా నాగలికొనలు భూమిని బాగా దున్ను గాక. కర్షకులు ఎద్దులను సుఖం కలిగే విధంగా తోలుతూ వెళ్లుదురు గాక. మేఘుడు మాకు సుఖం కలిగే విధంగా మధుర రసంతో కూడిన నీటితో వర్షం కలిగించుగాక. వాయుదేవా! సూర్యదేవా! మీరు మాకు సుఖం కలిగింతురుగాక.

లౌకికంగా దున్నడంలో మంత్రం ఉండదు. యజ్ఞంలో దున్నడానికి మంత్రం ఉంటుంది. ఋతువులారు కాబట్టి ఆరు ఎద్దులను కట్టదగిన నాగలితో మూడు విభాగాలుగా ఉన్న నాగలితో దున్నాలి. ఇలా చేస్తే ఋతువులచే దున్నించినట్లవుతుంది. పన్నెండు ఎద్దులు కట్టుటకు వీలైన ఆరు నాగళ్ళను అమర్చుటకు వీలయిన ఆరు విభాగాలు గల నాగలితో దున్నుతారు. సంవత్సరానికి పన్నెండు మాసాలు కాబట్టి సంవత్సర దేవత చేత దున్నించినట్లవుతుంది.

మం. కామం కామదుఘే ధుక్ష్వ మిత్రాయ వరుణాయచ
ఇన్ద్రాయాగ్నయే పూష్ణ ఓషధీభ్యః ప్రజాభ్యః॥

కోరికలు తీర్చే నాగేటి చాలూ! మా మిత్రాదులకు భోగం సంపాదించు. ప్రదక్షిణంగా దున్నాలి. దున్నవలసిన క్షేత్రాన్ని పక్షి ఆకారంగా భావించి తోకనుండి శిరస్సు వరకు మూడుచాళ్ళు, కుడిరెక్కనుండి ఎడమరెక్కవరకు మూడుచాళ్ళు, దక్షిణం శ్రోణినుండి ఉత్తరం అంసమువరకు మూడుచాళ్ళు, ఉత్తరం శ్రోణినుండి దక్షిణం అంసం వరకు మూడు చాళ్ళు దున్నాలి. మొత్తం పన్నెండు చాళ్ళు ఏర్పడతాయి. ఇలా ఆ వృత్తి చేయడంవల్ల మూడు సంఖ్యచేత యజ్ఞాన్ని ప్రారంభించినట్లవుతోంది.

మం. ఘృతేన సీతా మధునా సమక్తా విశ్వైర్దేవైరనుమతా మరుద్భిః
ఊర్జస్వతీ పయసాపిన్వమానాస్మాన్ సీతే పయసాభ్యావవృత్స్వ

మధురమైన ఆవునెయ్యితో తడిసినది; దేవతలందరి చేత, మరుత్తులచేత బాగుందని అంగీకరింపబడినది, నీటిచే తడుపబడినది ఈ నాగేటి చాలు. ఓ నాగేటి చాలూ! నీటితో తడపబడి నీవు అంతటా ఆవృత్తిని పొందు.

శ్రీ కృష్ణయజుర్వేదం 4వ కాండలో 2వ ప్రపాఠకంలో 6వ అనువాకంలో ఈ సూక్తం ఉంది. ఈ మంత్రాలు పఠిస్తూ ఓషధులను దున్నిన పొలంలో నాటుతారు.

మం. యాజాతా ఓషధయో దేవేభ్య స్త్రియుగం పురా
మన్దామి బభ్రూణా మహగ్ం శతం ధామాని సప్తచ।

వర్షాకాలము, శరత్కాలము, వసంతకాలము అనే మూడు కాలాల్లో సృష్ట్యాదిలో దేవతలనుండి ఓషధులు జన్మించాయి. ప్రాణులను భరించడానికి సమర్థమయినవి, పండడంవల్ల పచ్చని వర్ణాన్ని పొందేవి అయిన ఆ ఓషధులకు వందల రకాలున్నాయి. గ్రామ్యాలు ఆరణ్యాలు అని ఏడేడు ధాన్య భేదాలున్నాయి. వాటిని చూచి సంతోషిస్తున్నాను.

మం. శతంవో అమ్బధామాని సహస్రముత వోరుహః
అథా శతక్రత్వోయూయ మిమంమే అగదఙ్కృత

భా. ఓ తల్లివంటి ఓషధులారా! మీలో రకాలు, మీకు పొలాలు వందలున్నాయి. మీకు మొలకలు వేలున్నాయి. ఇక్కడ వందలు వేలు అనే పదాలచే అపరిమితత్వం చెప్పబడుతోంది. మీచే వందల యజ్ఞాలు నిర్వహించబడతాయి. మీరు మా యజమానునికి ఆకలి దప్పిక రోగాలు లేకుండా చేయండి.

మం. పుష్పావతీః ప్రసూవతీః ఫలినీరఫలా ఉత
అశ్వాఇవ సజిత్వరీ ర్వీరుధః పారయిష్ణవః

కొన్ని ఓషధులకు పుష్పాలు మాత్రమే ఉంటాయి. వాటికి ఫలాలు ఉండవు. కొన్ని పుష్పోత్పత్తి పూర్వకంగా ఫలించేవరకు ఉంటాయి. కొన్ని పుష్పాలులేకుండా కేవలం పళ్ళతోకూడి ఉంటాయి. మరికొన్ని ఓషధులకు ఫలాలు, వాటికి హేతువులయిన పుష్పాలు ఉండవు. కొన్ని తీగల రూపంలో ఉంటాయి. కొన్ని ఫలాలు కలిగినా నశించకుండా చాలా సంవత్సరాలు జీవించే శీలంతో ఉంటాయి. ఇవన్నీ యుద్ధంలో గుర్రాలవలె జయశీలం కలవి.

మం. ఓషధీరితి మాతరస్తద్వోదేవీ రుపబ్రువే
రపాగ్ంసి విఘ్నతీరిత రపశ్చాతయ మానాః

తల్లితో సమానము, దేవతలవంటివి అయిన ఓషధులారా! ఓషధులు కాబట్టి మిమ్ము నేను ప్రార్థిస్తున్నాను. పాపాలను నాశం చేస్తున్నవై పాపఫలమయిన దుఃఖాన్ని నాశం చేస్తున్నవై రండి.

మం. అశ్వత్థేవో నిషదనం పర్ణేవో వసతిః కృతా
గోభాజ ఇత్కిలా సథ యత్సన వథ పూరుషమ్

ఓ ఓషధి దేవతలారా! మీరు అశ్వత్థంలో నివసిస్తారు. మోదుగచెట్టు మీ నివాస స్థానం. (దేవతలధిష్ఠిస్తారు కాబట్టి రావిచెట్టు ప్రదక్షిణ నమస్కారాలతో పూజింపబడుతుంది. మోదుగచెట్టు యజ్ఞకర్మల కుపయోగపడుతుంది.) మీరు మీస్థావర రూపంలో భూమియందే ఉంటారని ప్రసిద్ధం. మీరు ప్రాణులను అన్నదానంచే పోషిస్తారు. కాబట్టి స్థావరరూపంలో ఉంటారు.

మం. యదహం వాజయన్నిమా ఓషధీర్హస్త ఆదధే
ఆత్మా యక్ష్మస్య నశ్యతి పురా జీవగృభో యథా

నేను ఆహారం కోరుతూ ఓషధులను చేతియందుంచుకున్నపుడే ఆకలి, రోగం నశిస్తాయి. తినడానికి ముందే నశించిన వంటివౌతాయి. లోకంలో వేటగాడు చెవులపిల్లిని పట్టుకోవడానికి పూర్వమే అది చెవులతో కళ్ళుమూసుకుని భూమికి అతుక్కుని మరణించిన దానివలె అయినట్లు ఓషధులను పట్టుకుంటేనే రోగాలు నశిస్తాయి.

మం. యదోషధయ స్సఙ్గచ్ఛన్తే రాజాన స్సమితావివ
విప్రస్స ఉచ్యతే భిషగ్ రక్షోహామీవ చాతనః

ఓషధులన్నీ ఫలాలనివ్వడంకోసం రాజులు ప్రతిపక్షులు సేనను జయించుటకు పరస్పరానుకూలంగా రణభూమిలో కలిసినట్లు క్షేత్రంలో

కలిసినపుడు ఓషధుల రసవీర్యాలను భావనం చేయడం తెలిసిన వైద్యుడు భిషక్ (రోగ చిత్సకుడు) అని చెప్పబడతాడు.

పక్వం చేసిన ఓషధులతో రాక్షసులను సంహరించే (సూక్ష్మక్రిములను సంహరించే) పురోడాశం చేసి ఆ ఉపద్రవ రూపమయిన రోగాన్ని పోగొడతాడు. అతడు ఓషధులచేత ఏర్పడిన పథ్యాదులచే కూడా రోగాలను నాశం చేస్తాడు.

మం. నిష్కృతిర్నామవో మాతా థాయూయగ్గ్స్థ సంకృతీః
సరాః పతత్రిణీః స్థనయ దామయతి నిష్కృత

ఓ ఓషధులారా! ఆకలి మొదలయినవాటిని తొలగించడమే మీ ఉత్పత్తికి కారణం. మీరు మీ పనిని చేయడానికి సమర్థులుకండి. మీరు ఆకలి మొదలయినవి పోగొట్టేవారు, పత్రములను మరల పొందేవారు కావాలి. రోగమువలె బాధించే ఆకలిని పోగొట్టండి.

మం. అన్యావో అన్యామవత్వన్యాన్యస్యా ఉపావత
తాస్సర్వా ఓషధయ స్సంవిదానా ఇదం మే ప్రావతావచః

ఓ ఓషధులారా! మీలో ఒక ఓషధిని మరొక ఓషధి రక్షించుగాక. మీరు పరస్పరం రక్షించుకొందురుగాక.

ఓ ఓషధులారా! మీరు పరస్పరం ఐకమత్యం పొందినవారై ప్రార్థనారూపమైన వాక్యాన్ని ప్రకర్షంగా రక్షించండి.

మం. ఉచ్ఛుష్మా ఓషధీనాం గావో గోష్ఠా దివేరతే
ధనగ్ం సనిష్యన్తీనామాత్మానం తవ పూరుష

గోవులు ఇండ్లనుండి అరణ్యములకు వెళ్ళినట్లు ఓషధులను తినుటచే వాటి బలాలు పైకి వెలువడుతున్నాయి. ఓ యజమానుడా! నీకు ధనాన్ని

ఇచ్చినట్లు నీ శరీరానికి తమను ఈ ఓషధులు ఇచ్చుకొనదలచాయి. అవి నీ శరీరాకారంలో పరిణామమును పొంది నీకు శరీరాన్ని ఇస్తున్నాయని భావం.

మం. అతివిశ్వాః పరిష్ఠాః స్తేన ఇవ వ్రజమక్రముః
ఓషధయః ప్రాచుచ్యవుర్య త్కిఞ్చ తనువాగ్ంరపః

శరీరంలో ప్రవేశించిన అన్ని ఓషధులు అజీర్ణాది దోషాలను పోగొట్టడానికి శరీరమందు వ్యాపించాయి. దొంగ రాత్రివేళ గోవు నపహరించుటకు గోశాలలో ప్రవేశించి గోశాల అంతటా తిరిగినట్లు ఓషధులు నీ శరీరంలో వ్యాపించాయి. శరీరానికి సంబంధించిన జ్వరం, శిరోవ్యాధి, గుల్మం, అతిసారం మొదలయిన పాపఫలం ఏ కొంచెం కలదో అదంతా ఓషధులు వినాశం చేశాయి.

మం. యాస్థ ఆతస్థురాత్మానం
యా ఆవివిశుః పరుః పరుః
తాస్తే యక్ష్మం విబాధన్తాముగ్రో
మధ్యమ శీరివ

ఓ యజమానుడా! నీ శరీరాన్ని ఏ ఓషధులు ఆక్రమించి ఉన్నాయో, ఏ ఓషధులు ప్రతిపర్వ రసరూపంలో ప్రవేశించాయో అవన్నీ నీ రోగాన్ని విశేషంగా నాశం చేయుగాక. తనవారు, ఇతరులు అనే పక్షపాతం లేకుండా శాస్త్రీయమార్గంలో ఉండే రాజు దుష్టులను అత్యుగ్రుడై నాశం చేసినట్లు ఓషధులు నీరోగాన్ని విశేషంగా నాశం చేయుగాక.

మం. సాకం యక్ష్మ ప్రపతశ్యేనేన కికి దీవినా
సాకం వాతస్య ధ్రాజ్యా సాకం నశ్య నిహాకయా

శ్లేష్మంచే అడ్డగించబడిన కంఠమందు కలిగే ధ్వని అనుకరణం కికి. ఆ ధ్వనితో ఉండే రోగం కికిదీవి. ఇది శ్లేష్మంవల్ల కలిగేది. దేగవలె తీవ్రంగా

ఉంటుంది శ్యేనం. ఇది పిత్తంవల్ల కలిగే రోగం. ఓ రాజయక్ష్మాది రోగమా! నీవు పిత్తంవల్ల, శ్లేష్మంవల్ల కలిగిన రోగంతో కూడ బాగా నశించు. బాధచేత 'అయ్యో! కష్టం. చచ్చిపోతున్నాను' అని శబ్దం కలిగించే రోగం నిహాక. దానితో కూడా రాజయక్ష్మరోగమా! నశించు.

మం. అశ్వావతీగ్ం సోమవతీ మూర్జయన్తీ ముదోజసమ్
ఆ విత్సి సర్వా ఓషధీ రస్మా అరిష్టతాతయే

ఒక ఓషధి జాతికి అశ్వావతి అనిపేరు. ఆ ఓషధులు సమృద్ధిగా పండితే ధనం ద్వారా గుర్రాలు లభిస్తాయి. కాబట్టి ఆ ఓషధికి అశ్వావతి అని పేరు. ఒక ఓషధి జాతి సోమవతి. ఈ ధాన్యం సమృద్ధిగా పండితే ఆ ధనంతో సోమయాగం చేయవచ్చు. కాన ఆ ఓషధి జాతికి సోమవతి అని పేరు. మరొకటి ఊర్జయన్తి. ఊర్జమంటే బలం. బలం కలిగిస్తుంది కాబట్టి ఊర్జయన్తి అని పేరు. మరో ఓషధి జాతికి ఉదోజాః అని పేరు. శరీరంలో ఏడుధాతువులు ఉంటాయి. త్వక్కు, చర్మం, మాంసం, మేదస్సు, అస్థి, మజ్జ, శుక్రం అని వాటి పేరులు.

బ్రహ్మచర్యవ్రతం చేసేవారికి ఎనిమిదో ధాతువు ఏర్పడుతుంది. ఆ ధాతువు పేరు ఓజస్సు. ఉత్కృష్టమయిన ఓజస్సును కలిగించే ఓషధి ఉదోజాః. అన్నం ద్వారా శరీర ధాతువుల నన్నింటిని పోషించే ఓషధి ఇది. ఆ ఓషధులన్నీ నాకు లభించాయి. ఈ యజమానికి పీడ కలుగకుండా ఈ ఓషధు లుపయోగిస్తాయి.

పైన పేర్కొన్న పదునాలుగు మంత్రాలతో ఓషధులు నాటుతారు; లేదా క్రింది ఏడు మంత్రాలతో కూడా ఓషధులు నాటవచ్చు.

మం. యాః ఫలినీర్యా అఫలా అపుష్పా యాశ్చపుష్పిణీః
బృహస్పతి ప్రసూతా స్తానోముఞ్చన్త్వగ్ం హసః

ఫలములతో కూడినవి, ఫలములు లేనివి, పూలు లేనివి, పూలతో కూడినవి అయిన ఓషధులన్నీ బృహస్పతిచే ప్రేరేపింపబడినవై మమ్ము పాపాలనుండి విడిపించుగాక.

మం. యా ఓషధయః సోమరాజ్ఞీః ప్రవిష్టాః పృథివీమను
తాసాం త్వమస్యుత్తమా ప్రణోజీవాతవే సువ

సోముడు స్వామియైన ఓషధులు సోమరాజ్ఞులు. అవి భూమిలో ప్రవేశిస్తున్నాయి. వాటిలో నాటబడే ఓషధీ! నీవు ఉత్తమమైనదానివి. మాకు జీవనౌషధం కోసం ప్రేరణ కలిగించు.

మం. అవపతన్తీరవదన్ దివ ఓషధయః పరి
యం జీవ మశ్నవా మహై న సరిష్యాతి పూరుషః

లోకం నుండి పడిన వర్షబిందువులు ఓషధిరూపంతో పుడుతున్నాయి. స్వర్గంపైనుండి భూమిపైన పడే ఓషధులు ఇలా అన్నాయి. 'మేము ఏ ప్రాణిలో వ్యాపిస్తామో అతడు నశించడు' అని.

మం. యాశ్చేదముపశ్రుణ్వన్తి యాశ్చదూరం పరాగతాః
ఇహ సంగత్యతాస్సర్వా అస్మై సందత్త భేషజమ్

దూరంగా ఉండి నా ప్రార్థనను కొంచెం విన్న ఓషధి దేవతలు ఈ పనియందు కలిసినవై ఈ యజమానునికి క్షుధాది రోగనివారకమయిన చికిత్స చేయుగాక.

మం. మావో రిషత్ ఖనితా యస్మై చాహం ఖనామివః
ద్విపచ్చతుష్పదస్మాకగ్ం సర్వమస్త్వనాతురమ్

ఓ ఓషధులారా! చికిత్సకోసం మిమ్ము తవ్వి తీసేవాడు నశించకుండు గాక. నేను ఏ వ్యాధిగ్రస్తునికి చికిత్సకోసం తవ్వుతున్నానో అతడు కూడా నశించకుండుగాక. చికిత్సకై మమ్మాశ్రయించి మా మనుష్యులు, పశువులు, రోగ రహితులగుదురు గాక.

మం. ఓషధయ స్సంవదన్తే సోమేన సహరాజ్ఞా
యస్మై కరోతి బ్రాహ్మణ స్తగ్ం రాజన్ పారయామసి

ఓషధి దేవతలు తమ ప్రభువైన సోమునితో ఇలా అన్నాయి. వైద్యుడు మామూలము మొదలయిన వాటితో ఎవరికి చికిత్స చేశాడో అతనికి రోగము తొలగిస్తాము.

ఈ మంత్రములకు చెందిన బ్రాహ్మణంలో చెప్పిన విశేషాలివి. పై మంత్రాలతో పదునాలుగు ఓషధులను నాటాలి. గ్రామాలలో పండేవి ఏడు. అడవులలో పండేవి ఏడు. నువ్వులు, మినుములు, వరి, యవలు, కొఱ్ఱలు, అణువులు, గోధుమలు గ్రామాలలో పండించే ఓషధులు.

వెదురుబియ్యం, చావలు, నివ్వరిధాన్యం, జర్తిలములు, గవీధుకములు, మర్కటకములు, గార్ముతములు అడవిలో పండే ఓషధులు. గ్రామ్యములయిన ఓషధులను దున్నిన నేలలోను, ఆరణ్యౌషధులను దున్నని నేలలోను నాటాలి. నాగేటి చాలునందు మూలమునుండి అగ్రమువరకు ఓషధులను నాటాలి. దీనివల్ల పంట సమృద్ధిగా పండుతుంది. పై పదునాలుగు ఓషధులలో ఏవైనా లభించకపోతే వాటి స్థానంలో యవలను తేనె కలిపి నాటాలి.

ఇలా తైత్తిరీయసంహితలో ఆహవనీయచయనం సందర్భంగా దున్నడం, విత్తనాలు నాటడం చెప్పారు.

బ్రాహ్మణాన్ని బట్టి ఈ మంత్రాలకు దున్నడం, వివిధ ధాన్యం విత్తనాలను నాటడాలకు సంబంధించినవిగా వ్యాఖ్యానం చేశారు. మంత్రాలలో చికిత్స ప్రసంగం రావడంవల్ల దీనిలో ఓషధులు రోగనివారణకు ఉపయోగించేవి కూడా అని తెలుస్తోంది. అవి ఏ ఓషధులో ఏ రోగ నివారణకు ఎలా ఉపయోగించాలో వేరే వేదశాఖల ద్వారా కాని, ఆయుర్వేదం ద్వారా కాని గ్రహించాలి.

* * *

12. శింశుమారం విశ్వచిత్రం

(తైత్తిరీయారణ్యకంలో 2వ ప్రపాఠకంలో 19వ అనువాకం)

అన్ని యాగాల ఆరంభ సమయాలలో బ్రహ్మోపస్థానం చేయాలి. అది ఆయుష్కరం. సాయంసంధ్యావందనం తరువాత కూడా బ్రహ్మోపస్థానం చెయ్యవచ్చు. బ్రహ్మోపస్థానం చేసేవేళ సర్వాత్మకుడైన పరమేశ్వరుణ్ణి శింశుమారమనే మొసలిరూపంలో ధ్యానం చేయాలి. ఇక్కడ ఖగోళంలో ఉండే చుక్కలన్నిటిని శింశుమారం ఆకారంలో వర్ణించి దాని అవయవాలలో ఏయే దేవతలను ధ్యానించాలో శ్రుతి చెబుతోంది.

మం. యస్మైనమస్తచ్ఛిరో ధర్మోమూర్ధానం బ్రహ్మోత్తరా హనుర్యజ్ఞోధరా విష్ణుర్హృదయగ్ం సంవత్సరః ప్రజనన మశ్వినౌ పూర్వపాదా వత్రిర్మధ్యం మిత్రా వరుణా వపరపాదావగ్నిః పుచ్ఛస్య ప్రథమం కాండం తత ఇన్ద్రస్తతః ప్రజాపతి రభయం చతుర్థగ్ం సవాఏష దివ్య శ్శాక్వర శ్శిశుమారః

ఏ పరమాత్మకు అందరూ నమస్కరిస్తారో ఆ పరబ్రహ్మ శింశుమారానికి మూర్ధస్థానీయం. శిరస్సు పైభాగం మూర్ధం, క్రింది భాగం శిరస్సు, చతుర్ముఖ బ్రహ్మ శింశుమారానికి పై దౌడ. యజ్ఞం శింశుమారానికి క్రింది దౌడ. విష్ణువు శింశుమారానికి హృదయం. సంవత్సరరూప కాలపురుషుడు శింశుమారానికి జననేంద్రియం. అశ్వినులు శింశుమారానికి ముందుపాదాలు. అత్రిముని శింశుమారానికి మధ్య శరీరం. మిత్రావరుణులు శింశుమారానికి క్రింది పాదాలు. శింశుమారం తోకయందు చాలా భాగాలున్నాయి. శింశుమారం తోక ప్రథమభాగం అగ్ని. రెండవభాగం ఇంద్రుడు, మూడవభాగం ప్రజాపతి, నాల్గవభాగం భయరహిత పరబ్రహ్మ. ఇది దివ్యమయిన, అత్యంత శక్తివంతం అయిన శింశుమారం (నీటి మొసలి) ఆకారం.

మం. తగ్ంహ య ఏవం వేదాప పునర్మృత్యుం జయతి
జయతి స్వర్గం లోకం నాధ్వని ప్రమీయతే
నాగ్నౌ ప్రమీయతే నాప్సు ప్రమీయతే నానపత్యః
ప్రమీయతే లఘ్వాన్నో భవతి.

ఈ దివ్యమయిన శింశుమారాన్ని మనస్సుచే ధ్యానించినవాడు అపమృత్యువును జయిస్తాడు. స్వర్గాన్ని పొందుతాడు. బాటలో మరణించడు. అగ్నివల్ల అతనికి మరణం రాదు. నీటివల్ల అతనికి దుర్మరణం రాదు. అతడు సంతానం లేకుండా మరణించడు. అతని కంతటా సులభంగా ఆహారం లభిస్తుంది.

ధ్యానం తరువాత ఉత్తరముఖంగా తిరిగి నిలబడి ధ్రువ మండలాన్ని చూస్తూ శింశుమారానికి ఉపస్థానం చెప్పాలి.

మం. ధ్రువస్త్వమసి ధ్రువస్యక్షితమసి త్వం భూతానా మధిపతి
రసిత్వం భూతానాగ్ం శ్రేష్ఠోసిత్వాం భూతాన్యుప పర్యావర్తన్తే
నమస్తే నమస్సర్వంతే నమోనమ శ్శిశు కుమారాయ నమః

ఓ శింశుమారా! నీవు వినాశం లేనివాడివి. స్థిరమయిన ఆకాశాదులకు నివాస స్థానానివి. సకల ప్రాణులకు అధిపతివి. భూతాలలో శ్రేష్ఠుడివి. అన్ని భూతాలు నిన్ను చుట్టూ సేవిస్తూంటాయి. కాబట్టి నీకు నమస్కారం. సర్వజగత్తు నీకధీనం. నీకు సంబంధించిన సమస్తానికి నమస్కారం. శింశుమారానికి కుమారునివంటి ధ్రువునికి నమస్కారం.

ఐరోపా అంతరిక్ష సంస్థవారు ఉపగ్రహంపై ప్లాంక్ టెలిస్కోప్ పెట్టి ఒక సంవత్సరకాలం ఛాయాచిత్రాలు తీసి కలిపితే విశ్వఛాయాచిత్రం ఏర్పడింది. దీనిని 2010 జూలై 5వ తేదీన విడుదల చేశారు. దానిలో ఇక్కడ వర్ణించిన శింశుమారరూపం కనబడుతోంది. పరమాత్మకు ప్రతీక ప్రణవమని ఉపనిషత్తులలో ఉంది. దీనిలో దేవనాగరి ప్రణవ లిపికూడా

ఉంది. ఈ శింశుమారం చుట్టూ హాట్‌గాస్ ఉంది. లింగపురాణంలో జ్యోతిర్లింగంనుండి విశ్వం వచ్చినట్లు ఉంది. ఈ హాట్ గాస్ జ్యోతిర్లింగ రూపమన్నమాట. శింశుమారాన్ని విష్ణురూపమని శ్రీమద్భాగవత పురాణం చెబుతుంది. ఇలా సనాతన ధర్మంలో ప్రముఖమయిన విష్ణురూపం, శివలింగ రూపం, ప్రణవరూపం శాశ్వతంగా ఉన్నాయని ఈ చిత్రం నిరూపిస్తోంది. ధర్మం విశ్వానికి ప్రతిష్ఠ అంటే పాదాలు. ఈ మహాకలియుగంలో ధర్మానికి తపస్సు, శౌచం, దయ అనే మూడుపాదాలు లోపించాయని శ్రీమద్భాగవతం చెపుతోంది. దానికి సూచకంగా ఈ శింశుమారానికి ఒకటే పాదం కనబడుతోంది కాబోలు. మిగిలిన పాదాలు లోపించాయన్నమాట.

ఐరోపా అంతరిక్ష సంస్థ తీసిన ఖగోళ చిత్రం వర్ణన వేదంలో కనబడడం, దేవనాగరి ప్రణవలిపి ఖగోళంలో గోచరించడం సనాతన ధర్మానుయాయులు సంతోషించే విషయాలు.

* * *

13. నమకంలోని రుద్రుడు -పశుపతి దేవుని ముద్రిక

భారతదేశ చరిత్ర గ్రంథాల్లో హిందూమతం సింధునాగరికత కాలానికి లేదని, సింధునాగరికత కాలపు జనం తమ మత చిహ్నాలను వదల లేదనీ, కాబట్టి ఆ కాలంలో ఏమతముందో తెలియదనీ వ్రాశారు.

కాని సింధునాగరికత అవశేషాల్లో లభించిన పశుపతి దేవుని ముద్రికలో కనబడుతున్న చిత్రాలకు, శ్రీకృష్ణయజుర్వేదంలోని నమకంలోని రుద్రవర్ణనకు దగ్గర సంబంధం కనబడుతోంది. ఆ విషయం పరిశీలిద్దాం.

పశుపతి దేవుని ముద్రికలో రుద్రునికి జుట్టులేదు. 'వ్యుప్తకేశాయచ' అని నమకంలో మంత్రం. జుట్టు లేని రుద్రునికి నమస్కారం అని అర్థం. మనకు వాడుకలో ఎక్కడా జుట్టులేని శివరూపం కనబడదు. ఇది వేదసంస్కృతి సింధుసంస్కృతిలో ఉందనడానికి బలమైన నిదర్శనం.

'నమస్తారాయ' అని నమకం. ప్రణవంచే ప్రతిపాదింపబడేవాడు రుద్రుడని భావం. పశుపతి దేవుని ముద్రికలో రుద్రునికి కుడివైపున ప్రణవం ఉంది.

'కవచినేచ' అని నమకం. కవచం కల రుద్రునికి నమస్కారమని అర్థం. ఈ ముద్రికలో రుద్రుడు కవచం ధరించాడు. పై మంత్రంలోని భావాన్నే 'వర్మిణేచ' అనే నామం కూడా చెబుతుంది.

ఈ ముద్రికలో పశుపతిదేవుడు ఉన్నాడని చరిత్రకారులు చెప్పారు. 'నమశ్శజ్గాయచ పశుపతయేచ' అని నమకం రుద్రుని పశుపతిగా పేర్కొంది.

'ఆయుధినేచ' అని నమకం. ఆయుధం కలవానికి నమస్కారం అని భావం. ముద్రికలో రుద్రుని చిత్రం ప్రక్క బాణరూపమయిన ఆయుధం ఉంది. 'యాత ఇషుశ్శివతమా' అని నమకంలో శివుని బాణం గురించి ఉంది.

నమకంలో రుద్రునికి 'ఉగ్రాయచ, భీమాయచ, విరూపేభ్యః' అనేవి విశేషణాలు. ఉగ్రమయినవాడు, భయంకరుడు, వికృతరూపం కలవాడు' అని ఆ పదాలు తెలుపుతాయి. పశుపతిదేవుని రూపం భయంకరంగా, వికృతిరూపంగా ఉంటుంది. ఇవన్నీ నమకంలోను, పశుపతి దేవుని ముద్రికలోను సమానంగా ఉన్న అంశాలు.

శివ సహస్రనామస్తోత్రం, శివాష్టోత్తర శతనామస్తోత్రం, మంత్రశాస్త్రం, అమరకోశంలోని శివనామాలు మొదలయిన వాటిలో ఉన్న విశేషాలు కూడా సింధుసంస్కృతిలో కనబడతాయి.

పై ముద్రికలో శివుని శిరస్సుపై చంద్రుడు, పైకి చిమ్మే ప్రవాహం ఉన్నాయి. అమరకోశంలో చంద్రశేఖరః అని శివునికి పేరుంది. చంద్రుడు తలపై గలవాడని అర్థం. 'గంగాధరః' అని శివుని నామాల్లో అక్కడే ఉంది. గంగను ధరించిన వాడని అర్థం.

రుద్రుని ముద్రికలో శివుని చేతిలో మృగశిరస్సు ఉంది. 'మృగధరం వందే పశూనాం పతిమ్' అని శివస్తుతి. శరీరంలో శిరస్సు ప్రధానం అని నానుడి కాబట్టి ఇక్కడ రుద్రుని చేతిలో మృగశిరస్సు చిత్రించారేమో!

శివుని నుదుట మూడోకన్ను ఉంది. అమరకోశంలో రుద్రునికి త్రిలోచనః, త్ర్యంబకః (మూడు కన్నులు కలవాడు) అని పేర్లు. శివ సహస్రంలో రుద్రునికి 'మహా మేఘ నివాసీ' (82శ్లో), జ్యోతిషామయనం (57శ్లో) అనే నామాలున్నాయి. జ్యోతిస్సులంటే చుక్కలు. ముద్రికలో శివునికి కుడివైపు చుక్కలతో కూడిన మేఘాలున్నాయి. అమరకోశంలో 'వ్యోమకేశః' అని శివునికి నామం. ఆకాశం జుట్టుగా గలవాడని అర్థం. రూపం లేని ఆకాశాన్ని చూపించడానికి చిత్రకారుడు మేఘం చుక్కలు చిత్రించి ఉండవచ్చు. సింధుబలి ముద్రికలో అగ్నిజ్వాల ఉంది. 'అగ్నిజ్వాలః' అని శివుని నామం. (శివసహస్ర 82 శ్లో)

శివునికి పైన డమరుకం, గొడ్డలి ఉన్నాయి. డమరుకం యోగి ధరించే వాద్యం. 'వాదయన్ డమరం యోగీయత్ర కుత్రాశ్రమే స్థితః' అని యోగి డమరుకం వాయిస్తాడని తెలుస్తుంది. శివుడు యోగీశ్వరుడు కాబట్టి ఇక్కడ డమరుకం చిత్రం చిత్రించబడింది. 'శాంతం పద్మాసనస్థం' అని శివస్తుతి శ్లోకంలో 'పరశుమభయదం' అని గొడ్డలిని ధరించినట్లుంది. శివుని పైన శంఖం, ఏనుగు ఉన్నాయి. శివపంచాయతన పూజలో శంఖపూజ ఉంటుంది. శివునికి 'గజేశ్వరః' (148 శ్లో) అని నామం. శివుని ఎదుట పశువు ఉంది. శివుని వాహనం నంది అని ప్రసిద్ధి. శివ సహస్ర నామావళిలో నందిః (75 శ్లో) అనే నామం ఉంది. లింగపురాణంలో నందీశ్వరుడు శివావతారమని ఉంది. (లింగ-42 అ-12 శ్లో) సింధు నాగరికత అవశేషాలలో ఆబోతుచిత్రం, కొమ్ములుగల రుద్రుని చిత్రం ఉన్నాయి.

సింధు శిలల్లో ఒక రాతిపై గుహలో శివలింగం ఉన్నట్లు చెక్కారు. శివునికి 'గుహావాసీ' (శివసహస్రం 61శ్లో) అనే నామం ఉంది.

ఇలా సింధుసంస్కృతిలో హిందూమతంలోని వైదిక రుద్రారాధన స్పష్టంగా కనబడుతోంది. ఈ స్థితిలో ఆనాటి ప్రజలు మతాన్ని గురించి తెలిపే చిహ్నాలను వదలి వెళ్ళలేదనడం వాస్తవానికి దూరం.

* * *

14. సంఖ్యావాచకాలు -సున్న -తైత్తిరీయ సంహిత 7-2-11

వేదంలో సంఖ్యలు చాలా ఉన్నాయి. శ్రీకృష్ణయజుర్వేదంలో అశ్వమేధ ప్రకరణంలో పది అనువాకాల్లో సంఖ్యేయవాచక పదాలతో హోమ మంత్రాలున్నాయి. వీటిలో సరి, బేసి సంఖ్యలతో హోమమంత్రాలు బేసి సంఖ్యలతో హోమమంత్రాలు, సరి సంఖ్యలతో హోమమంత్రాలు ఉన్నాయి. బేసిసంఖ్యల మంత్రాలతో ఆజ్యహోమాలు, సరిసంఖ్యల మంత్రాలతో అన్నహోమాలు చేయాలి. ఇక్కడ సంఖ్యావాచకాలు ఒకటి నుండి పరార్ధం వరకు లభిస్తున్నాయి. ఒకటి ప్రక్కన పన్నెండు సున్నలు పెడితే వచ్చే సంఖ్య పరార్ధం. పరార్ధం పరసంఖ్యలో సగం. పరార్ధం మానవ సంఖ్యా వాచకాలలో చివరిది. బ్రహ్మ ఆయుర్దాయం రెండు పరార్ధాలు.

మం. శతాయస్వాహా సహస్రాయ స్వాహాఽయుతాయ స్వాహా
నియుతాయ స్వాహా ప్రయుతాయ స్వాహాఽర్బుదాయ స్వాహా
న్యర్బుదాయ స్వాహా సముద్రాయ స్వాహా మధ్యాయ స్వాహా
ఽన్తాయ స్వాహా పరార్ధాయ స్వాహా

ఏకం, దశం, శతం, సహస్రం, అయుతం, నియుతం, ప్రయుతం, అర్బుదం, న్యర్బుదం, సముద్రం, మధ్యం, అంతం, పరార్ధం అనేవి ఆ సంఖ్యా వాచకాలు.

ఇవి ఒకదానికంటే మరొకటి పదిరెట్లు ఎక్కువ. పై మంత్రాలలో ఉన్నవి సంఖ్యేయవాచకపదాలు. సంఖ్యచే చెప్పబడేవి సంఖ్యేయాలు. వీటిని సంఖ్యావాచకపదాలుగా కూడా వ్యవహరిస్తారు.

ఇక్కడున్న సంఖ్యేయవాచక మంత్రాలలో ఎక్కాలు కూడా ఉండడం విశేషం.

ఉదా : మూడో ఎక్కం చూద్దాం-1-3-3, 2-3-6, 3-3-9 ఇలా ఇరవై పంక్తుల వరకు ఎక్కాలు సాగుతాయి. వీటిలో మూడేసి వరుసలున్నాయి.

ఒకటి రెండు వరుసలు తొలగించి మూడోవరుస మాత్రం వేదంలోగల సంఖ్యేయవాచకాల వరుసలో ఉంటుంది.

ఉదా: చతుర్భ్యః స్వాహాష్టాభ్య స్వాహా
ద్వాదశభ్యః స్వాహా షోడశభ్యః స్వాహా
విగ్ం శత్యై స్వాహా..... షణ్ణవత్యై స్వాహా శతాయ స్వాహా..."

ఇది నాలుగో ఎక్కానికి చివరి వరుస-4,8,12,16,20,96,100

ఎక్కం ఇరవై వరుసలతో ముగుస్తుంది. కాని ఈ మంత్రాలతో నూరు వరుసల వరకు ఉంటుంది. కాని ఇరవై తరువాత క్లిష్టి పెడతారు. అంటే అవి మనం ఊహించుకోవాలి. చివరి సంఖ్యలను చెప్పడం వల్ల ఈ మధ్య సంఖ్యలు కూడా మనం చెప్పుకోవాలని తెలుస్తుంది.

ఈ వేద సంఖ్యేయాలతో 19 అనడానికి ఏకాన్న విగ్ం శతిః అని ఉంది. ఒకటి తక్కువ ఇరవై అని అర్థం. నవ విగ్ం శతి= 29 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి.

వేదంలో పరార్ధం వరకు సంఖ్యా వాచకాలుంటే తరువాత వాడుకలో ఇంకా అవసరమయ్యాయి. కాబట్టి కోటికి, పరార్ధానికి నడుమ మరికొన్ని సంఖ్యలు చేరాయి. శ్రీమద్రామాయణం, మహాభారతం, వాచస్పత్య నిఘంటువు మొదలయిన చోట్ల ఇంకా సంఖ్యావాచకాలు చేరాయి.

శ్రీమద్రామాయణంలో అర్బుదం, న్యర్బుదం, శంఖం, మహాశంఖం, బృందం, మహాబృందం, పద్మం, మహాపద్మం, ఖర్వం, మహాఖర్వం, సముద్రం, ఓఘం, మహౌఘం అనే సంఖ్యావాచకాలున్నాయి. ఒకటికి ప్రక్కన 60 సున్నలు చేరితే మహౌఘమవుతుంది (శ్రీమద్రామాయణం-యుద్ధ-28 సర్గ). ఇలా తరువాత ఏర్పడిన సంఖ్యావాచక విస్తృతికి శ్రీకృష్ణయజుర్వేదం దారి చూపింది.

ఇన్ని సంఖ్యలు సున్న లేకుండా వ్రాయడమెలా?

సున్న ఆర్యభటుని ఆవిష్కరణమని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారు చెప్పారు. ఆర్యభటుడు సున్న అధికంగా ఉపయోగించాడు.

కాని అంతకు ముందు సున్న ఉంది. ఆర్యభటుడు క్రీ.శ 499లో తన గ్రంథరచన చేసినట్లు చెప్పుకొన్నాడు.

క్రీ.పూ. రచించిన సూర్యసిద్ధాంతంలో గ్రహాల భగణాలను చెబుతూ 'ఖచతుష్కరథార్ణవాః' అని 4320000 సంఖ్యను చెప్పాడు. దీనిలో నాలుగు సున్నలను ఖచతుష్కంగా పేర్కొన్నాడు. (మధ్యమాధికారః 27 శ్లో.)

క్రీ.పూ. రచించిన బృహత్పరాశర హోరాశాస్త్రంలో కూడా గ్రహాది సాధనాధ్యాయంలో ఖరసైర్విహృతమ్= 60 చే భాగించగా అనే అర్థంలో ఖ శబ్ద ప్రయోగం చేశారు. (బృహత్పరాశరహోరాశాస్త్రం, గ్రహాది సాధనాధ్యాయం)

ఇక్కడ ఖ అంటే సున్న. కాబట్టి క్రీస్తుకు పూర్వంనుండి జ్యోతి శ్శాస్త్రజ్ఞుల వాడుకలో సున్న 'ఖ' అని వ్యవహరింపబడుతోంది.

పాణినీయ శిక్షలో లిఖిత పాఠకుణ్ణి పాఠకాధమునిగా పరిగణించారు. పాణిని క్రీ.పూ. ఏడవ శతాబ్ది వాడని సంస్కృత సాహిత్య చరిత్ర చెబుతోంది. అప్పటికి లిపి ఉందన్నమాట.

పైన కృష్ణయజుర్వేదంలో పరార్ధం వరకు సంఖ్యా వాచకాలు చూచాం కదా! అంత విస్తృత సంఖ్య సున్న లేకుండా ఉండడం సముచితం కాదు.

ఋగ్వేదంలో అగ్ని ప్రార్థన ఇలా ఉంది.

మం. అగ్నే స్థూరం రయిం భర పృథుం గోమన్తమశ్వినమ్
అజ్ఝి ఖం వర్తయా పణిమ్ - (ఋగ్వేదం-10-156 సూ.3)

ఓ అగ్నీ! స్థూలం, విస్తీర్ణం, గోవులతో కూడినది, అశ్వాలతో కూడినది అయిన ధనం మాకిమ్ము.

ఖం= సున్నని, అజ్ఝి= ప్రకాశింపచెయ్యి. వణిజుని ప్రవర్తింపచేయుము.

పై మంత్ర భాష్యములో ఖం, అజ్ఝి అనే పదాలకు అంతరిక్షమును తడుపుము అని అర్థం చెప్పారు. అంతరిక్షాన్ని తడపడం కుదరదు కాబట్టి వారే 'ప్రకాశయ= ప్రకాశింప చేయుము' అని వేరే అర్థం చెప్పారు. కాని తరువాత వణిజుని ప్రవర్తింపచేయుమని ఉంది. వర్తకుడు ప్రవర్తించడానికి గణితం వృద్ధిపొందాలి. గణితం వృద్ధి పొందడానికి సున్న ప్రకాశించాలి. అంటే బాగా వెల్లడికావాలి.

తరువాతి కాలంలో ఖం అనే పదం సున్న అనే అర్థంలో వ్యాప్తిని పొందింది. కాబట్టి ఇక్కడ ఖం అనే పదానికి సున్న అని అర్థం చెప్పడం సముచితం. పై మంత్రాలలో తేన జేష్మధనం ధనమ్= (అగ్నిచే సర్వ ధనాన్ని మేము జయింతుముగాక.) అని ఉంది.

తానోహిన్వ మఘత్తయే= మాకు ధనలాభం కోసం నీరక్షణను కలిగించుము. - (ఋగ్వేద -10-156-1, 2 మం.)

అని ధనం సంబంధి ప్రార్థన ఉండడంవల్ల కూడా ఇక్కడ వాణిజ్య సంబంధమయిన అర్థం చెప్పాలని తెలుస్తుంది. అలాగే ఖం అనే పదానికి సున్న అని అర్థం చెప్పడానికి వీలవుతోంది. మొత్తంపై వేదంలో సంఖ్యావాచకాలు చాలా ఉన్నాయని సారాంశం.

* * *

15. అన్నసూక్తం - (తైత్తిరీయ బ్రాహ్మణమ్-2 కాం-8ప్ర-8అ.)

తైత్తిరీయబ్రాహ్మణంలో కొన్ని అన్నసూక్త మంత్రాలున్నాయి. అన్నాభిమాని దేవత వచనాలు ఈ సూక్తంలో ఉన్నాయి.

మం. అహమస్మి ప్రథమజా ఋతస్య
పూర్వం దేవేభ్యో అమృతస్యనాభిః
యో మా దదాతి సఇదేవ మావాః
అహమన్న మన్న మదన్త మద్మి ॥

నేను అన్నాభిమాని దేవతను. యజ్ఞాన్ని మొదట చేయించేవాడిని నేను. (యజ్ఞం హవిస్సువల్ల జరుగుతుంది. హవిస్సు అన్నరూపం కాబట్టి ఇలా చెప్పారు.) అన్నస్వామినైన నేను పూర్వం అమృతాన్ని పట్టుకున్నవాడను. దేవతలు అమృతం ఆశ్రయించి ఉంటారు. అమృతం కూడా ఒక ఆహారమే. కాబట్టి నేనే దానిని సంపాదించేవాడను. శ్రద్ధతో అన్నరూపుడనైన నన్ను (అన్నాన్ని) దానం చేసిన అన్నదాత స్వయంగానే నన్ను స్వీకరిస్తున్నాడు.

లోకంలో దాత, అదాత (దాత కానివాడు) అని ఇద్దరు పురుషులు. వీరిలో మొదటివాడు తరువాతి కాలంలో అనుభవించడంకోసం స్వీకరిస్తున్నాడు. ఎంత అన్నం దానం చేస్తున్నాడో దానికి వంద, వెయ్యి రెట్లు అన్నం వృద్ధి పొందుతుంది. కాబట్టి దాతే నన్ను బాగా గ్రహిస్తున్నాడు. రెండవవాడు నన్ను ఇవ్వకుండా తానే తింటున్నాడు. తానే తింటున్నానని తలుస్తున్నాడు. నేనెవరికీ పెట్టననే భావం గల అతనిని నేనే తింటాను. అంటే అన్నం పెట్టని వానికి కాలాంతరంలో అన్నం పుట్టదు. కాబట్టి అన్నదేవుడే అతనిని నాశం చేసినట్లవుతుందని భావం.

మం. పూర్వమగ్నేరపి దహత్యన్నమ్
యత్తౌహాఽ ఉ సాతే అహముత్తరేషు

వ్యాత్త మస్య పశవః సుజమ్భమ్
పశ్యన్తి ధీరాః ప్రచరన్తి పాకాః ॥

ఆహారం అగ్నికి ముందు పెట్టకుండా తింటే ఆ అన్నం ఆ తిన్నవానిని దహిస్తుంది. తిన్న ఆహారాన్ని ఉదరంలో ఉండే అగ్ని (ఉష్ణం) ఒక పూటలో పక్వం చేస్తుంది. దానం చేయకుండా తిన్నవాణ్ణి ఆ అన్నం అపుడే దహిస్తుంది. నరకానికి కారణమయిన పాపం అపుడే కలుగడమే దహించడము. దాత, అదాత ఇద్దరూ ప్రయత్నం కలవారే. దాత దానం చేయడంకోసం ప్రయత్నిస్తాడు. అదాత తినడంకోసం ప్రయత్నిస్తాడు. వారిలో దాతలుగా ఉన్నవారే శ్రేష్ఠులు. వారి దగ్గర నేను క్షీణించకుండా ఉంటాను. మూఢులు అయిన అదాతల కోసం అన్నదేవుని ముఖం తీక్ష్ణదంతాలతో తెరచుకొని ఉంటుంది. ఈ అన్నదేవుని అభిప్రాయం దాతలయిన బుద్ధిమంతు లెరుగుదురు. మూఢులు బాగా తింటుంటారు. కాని కొంచెం కూడాపెట్టరు.

మం. జహా మ్యన్యమ్ న జహామ్యన్యమ్
అహ మన్నం వశ మిచ్చరామి
సమాన మర్థం పర్యేమి భుఞ్జత్
కోమామన్నం మనుష్యో దయేత ॥

అన్నదేవుడంటున్నాడు. అదాతను నేను వదిలి పెడుతున్నాను. దాతను వదలిపెట్టను. అన్నదేవుడనైన నేను నావశంలోనే ఉంటాను. (దాతకాని వానిని విడవడం, దాతను స్వీకరించడం తన వశంలో ఉంటుందని భావం.)

భోగ దానములు రెండింటియందు సమానమయినవానిని ఆ రెండింటికోసం ధనం సమానంగా కోరే వ్యక్తిని రక్షిస్తూ అంతటా అతనిని చేరతాను. (భోగమాత్రలంపటుణ్ణి రక్షించను, చేరను అని అభిప్రాయం.) అదాతను వదలి దాతయెడల పక్షపాతంతో ఉండే నన్నెవడు నివారించగలడు? నివారించుట కెవడూ శక్తుడు కాడని భావం.

మం. పరాకే అన్నం నిహితం లోకఏతత్
విశ్వైర్దేవైః పితృభిర్గుప్త మన్నమ్
యదద్యతే లుప్యతే యత్పరోప్యతే
శతతమీ సాతనూర్మే బభూవ ॥

అన్న వినియోగం రెండు రకాలు. 1. పారలౌకికం, 2. లౌకికం. పరలోకంలో ఉన్న పిత్రాదులకర్పించబడింది పారలౌకికం. దాత దేవలోకంలో, పితృలోకంలో నాకిది లభించాలనే విశ్వేదేవతలను, పితృదేవతలను ఉద్దేశించి అన్నం సమర్పిస్తున్నాడు. కాబట్టి అర్పించిన అన్నం పరలోకంలో దాచినట్లు అవుతోంది. ఆ అన్నం విశ్వేదేవతలచేత రక్షింపబడినదవుతోంది. అగ్నిలో హోమం చేయబడిన దానిని, దానం చేయబడిన దానిని దేవతలు, పితృదేవతలు ఆశ్రయించి ఉంటారు. ఇది పారలౌకిక వ్యవహారం.

ఏ అన్నాన్ని తింటారో, ఏది గిన్నెలో మాడిందో, ఏది పాసిపోయిందో ఆ అన్నం నశిస్తోంది. ఇవి ఐహికాలు. తన ఐశ్వర్యం ప్రకటించడంకోసం దేనిని బయట పడవేస్తున్నారో అది ఐహికమే. ఈ ఐహిక పారలౌకిక అన్నాలన్నీ అన్నస్వామినైన నా శరీరంలో లేశభాగం. నూరవవంతు. నా మాహాత్మ్యం ఇటువంటిది.

మం. మహాన్తౌ చరూ సకృద్దుగ్ధేన పప్రౌ
దివఞ్చ పృశ్ని పృథివీఞ్చ సాకమ్
తత్సం పిబన్తౌ నమినన్తి వేధసః
నైత ద్భూయో భవతి నో కనీయః ॥

లోకంలో చాలా పాలిచ్చే గోవు ఒకసారి ఇచ్చే పాలతో రెండు కుండలు నింపినట్లు ఈ లోకంలో కొంచెం అన్నదానం చేసినా స్వర్గం, భూమి రెండు లోకాలను నింపుతుంది. అనగా రెండు లోకాల్లో అన్నదాతకు ఆహారానికి లోటుండదని భావం.

అగ్నియందు హోమం చేసిన హవిస్సు, విద్వాంసులకు పెట్టిన అన్నము, మంత్రములచే పూతమై వేయిరెట్లు ఫలిస్తుంది. ఆ అన్నాన్ని తినిన బుద్ధిమంతులయిన దాతలు తమను, అన్నమును నశింపచేయుటలేదు. దానంచేసి శేషాన్ని తినడం సమ్యగ్భక్షణం. అలా చేసి ఆ అన్నాన్ని నాశం చేయడం లేదు. వారు పెట్టిన ఆహారం తరువాత వృద్ధి పొందుతుంది. ఇలా వృద్ధి పొందడంవల్ల వారికి చిరకాలం అన్నానికి లోటుండదు. భోజనం చేసే అన్నం ఎక్కువ, తక్కువ కాకూడదు. అన్నం అధికమయితే అజీర్తి. అన్నం తక్కువయితే ఆకలి తీరదు.

మం. అన్నం ప్రాణమన్న మపాన మాహుః
అన్నం మృత్యుం తము జీవాతు మాహుః
అన్నం బ్రహ్మాణో జరసం వదన్తి
అన్న మాహుః ప్రజననం ప్రజానామ్ ॥

అన్నం అన్ని వ్యవహారాలకు కారణం కాబట్టి అన్నమాహాత్మ్యం అవివాదం. పైన సంచరించే ప్రాణవాయువు, క్రింద సంచరించే అపానవాయువు అన్నంవల్ల కలిగిన బలంచే సంచరిస్తున్నాయి. కాబట్టి ప్రాణాపాన వాయువులు అన్నాత్మకములని చెపుతారు. అన్నరసం వైషమ్యం పొందితే వ్యాధి ద్వారా చంపుతుంది కాబట్టి అన్నాన్ని మృత్యువని కూడా అంటారు. ఆ అన్నాన్ని జీవనౌషధమంటారు. అది లోకంలో ప్రసిద్ధం. ఆయుర్వేదశాస్త్రవెరిగిన పండితులు అన్నమే మునలితనము కలిగిస్తుందంటారు. కొన్ని ఆహారాలు తింటే తల నెరసిపోతుందని ఆయుర్వేద ప్రసిద్ధము. అన్నమే ఇంద్రియవృద్ధి ద్వారా సంతానము కలిగిస్తుందని చెబుతారు.

మం. మోఘ మన్నం విన్దతే అప్రచేతాః
సత్యం బ్రవీమి వధ ఇత్సతస్య

నార్యమణం పుష్యతి నోసఖాయం
కేవలాఘో భవతి కేవలాదీ ॥

అన్నదానం చేయనివాడు ప్రకృష్ట జ్ఞానం లేనివాడై వ్యర్థంగానే అన్నం తింటున్నాడు. ఈ విషయం సత్యమే. నేను చెబుతున్నాను. ఆ అన్నం వ్యర్థమే కాదు. దానరహితుడైన వానిని అన్నం వధవలె బాధిస్తుంది. దాతకానివాడు అర్యమ మొదలగు దేవతలకు అన్నము సమర్పించడు. అతిథిరూపుడైన మనుష్యునికి పెట్టడు. కాబట్టి దేవతలను, మనుష్యులను పోషించడు. ఇతని ఆహారం పరలోకానికి ఉపయోగపడడం లేదు కనుక అది వ్యర్థమవుతోంది. ఇతరులకు పెట్టకుండా ఇక్కడే అన్నం తినేవాడు కేవలం పాపాన్నే తింటున్నాడు. అతడు పాపాన్నే సంపాదిస్తున్నాడు. కొంచెం కూడా పుణ్యం పొందడంలేదు. నరకహేతువవడంచే ఇది వధవలె బాధ కలిగించేదే.

మం. అహం మేఘ స్తనయన్ వర్షన్నస్మి
మా మదన్త్యహ మద్మ్యన్యాన్
అహగ్ం సదమృతో భవామి
మదాదిత్యా అధి సర్వేతపన్తి ॥

ఉరుముతూ వర్షిస్తూ ఉండే మేఘం కూడా అన్నమే. అగ్నియందు హోమం చేయబడిన అన్నమే మేఘరూపంలో పరిణతి పొందిందని భగవద్గీత చెబుతున్నది. దాతలు నన్ను (అన్నాన్ని) సుఖంగా భక్షిస్తున్నారు. దాతలు కాని వారిని నేనే భక్షిస్తాను. (నశింపచేస్తానని భావం) నేనే దాతలకు పథ్యాన్నమై అమృతమవుతాను. దేవత్వాన్ని కలిగిస్తానని భావం. ఆదిత్యులు కూడా ఆహారం మూలంగానే అధికంగా ప్రకాశిస్తున్నారు. ఆహారం లేకపోతే వారు ప్రకాశించలేరు అని అన్న సూక్తం అన్నదాన ప్రాధాన్యం తెలుపుతోంది.

* * *

16. కుంతాప సూక్తాలు

అథర్వణ వేదం 20వ కాండలో 127వ సూక్తం నుండి 136వ సూక్తం వరకు ఉన్నవాటిని కుంతాపసూక్తాలంటారు. ఇవి అథర్వణవేదంలోనే కాక ఋగ్వేదంలోనూ ఉన్నాయి. వీటికి సాయణాచార్యుల వారి భాష్యం లేదు. శ్రీశ్రీపాద దామోదరసాత్వలేకర్ గారు వీటిలో కొన్ని చాలా క్లిష్టాలు కాబట్టి, అవి ఎరిగిన వారిని తెలుపమనే విజ్ఞప్తిని అధస్సూచికలో వ్రాశారు. క్షేమకరణ దాస్‌త్రివేది వీటిని వివిధ ధర్మోపదేశకాలుగా వ్యాఖ్యానించారు. వారి వ్యాఖ్య ననుసరించి వివరిస్తున్నాను. కుంతాపం అంటే పాపాన్ని (దుఃఖాన్ని) పోగొట్టేదని భావం. స్పష్టతకోసం వారిచ్చిన అర్థభావాలు రెండూ వ్రాస్తున్నాను.

మం. ఇదం జనా ఉపశ్రుత నరాశంస స్తవిష్యతే
షష్టిం సహస్రా నవతిం చ కౌరమ ఆరుశమేషు దద్మహే 127 సూ.

అర్థం : ఓ జనులారా! ఈ మాట ఆదరంగా వినండి. మనుష్యులలో ప్రశస్త పురుషుడు స్తుతించబడతాడు. పృథివిలో ఆనందించే రాజా! హింసకులను విసరివేసే వీరుల మధ్యలో అరవైవేల తొంభై దానాలను పొందుతాము.

భావం : ఉత్తమకర్మ చేసే మనుష్యుడు ప్రపంచంలో ఎప్పుడూ గొప్పదనాన్ని పొందుతాడు. ఈ విషయాన్ని ఆలోచించి రాజు కర్మ నిపుణులైన వీరులయెడ ఆదరం చూపుతూ మంచి పాత్రత గలవారికి చాలా పారితోషికాలనివ్వాలి.

మం. ఉష్ట్రా యస్య ప్రవాహణో వధూమన్తో ద్విర్దశ
వర్ష్మా రథస్య నిజిహీడతే దివ ఈషమాణా ఉపస్పృశః

మం. ఏష ఇయాయ మామహే శతం నిష్కాన్ దశస్రజః
త్రీణి శతా న్యర్వతాం సహస్రా దశ గోనామ్

అర్థం : రాజు రథానికి పూన్చబడినవి, వేగంగా వెళ్ళేవీ అయిన ఆడ మగ ఒంటెలు ఇరవై ఉన్మత్తుడైన వాని ఉన్నత పదవిని అవమానిస్తాయి. ఆ రాజు తన ఉద్యోగులకు నూరు బంగారు ముద్రికలను, పూలదండలను, మూడు వందల గుర్రాలను, పదివేల గోవులను పారితోషికంగా ఇచ్చాడు.

భావం : రాజు 20 ఆడు మగ ఒంటెలను రథానికి పూనిచి (దేశంలో చరిస్తూ లోకానికి మేలు చేసే) అనేక యత్నాలు చేయాలి, చేయించాలి. లోకానికి మేలు చేసేవారికి బాగా తగిన పారితోషికాలివ్వాలి.

మం. వచ్యస్వరేభ వచ్యస్య వృక్షేన పక్వే శకునః
నష్టే జిహ్వో చర్చరీతి క్షురో న భురిజోరివ

అర్థం : ఓ విద్వాంసుడా! ఉపదేశించు, ఉపదేశించు. పండిన పండ్లుగల చెట్టుపై నిలిచి పక్షి కూసినట్లు ఉపదేశించు. దుఃఖాలు వ్యాపించినపుడు ధారణ పోషణలు చేసేవారి నాలుక ఉపదేశాలతో చలిస్తూ ఉంటుంది. మంగలికత్తి జుట్టును తొలగించడంకోసం చలించినట్లు ఉపదేశాలు చేసే నాలుక క్లేశాలను పోగొట్టడం కోసం చలిస్తూ ఉంటుంది.

భావం : ఫలించిన చెట్టుపై పక్షి ప్రసన్నంగా కూసినట్లు విద్వాంసులైన స్త్రీ పురుషులు ప్రసన్నులై సంతానం మొదలైన వారికి సదా సదుపదేశం చేయాలి. మంగలికత్తితో జుట్టును కత్తిరించినట్లు తమ సదుపదేశం ద్వారా క్లేశాలను తొలగించాలి.

మం. ప్రరేభాసో మనీషా వృషా గావ ఇవేరతే
అమోత పుత్రకా ఏషామమోతగా ఇవాసతే

అర్థం : బలం కలిగిన ఎద్దులను ముందుకు నడిపినట్లు విద్వాంసులు బుద్ధిని ముందుకు ప్రేరేపిస్తారు. ఓ బంధనం లేని మానవుడా! ఈ విద్వాంసుల కుమారులు విద్యలను, భూమిని తప్పక పొందుతారు.

భావం : బలం కలిగిన ఎద్దు ముందుకు సాగినట్లు మనుష్యుడు విఘ్నాలను తొలగించుకొని బుద్ధిని అనేక ప్రకారాలుగా వృద్ధి చేసుకోవాలి. సంతానం మొదలైన వారిని యోగ్య విద్వాంసులుగా, రాజ్యాధికారులుగా చేసుకోవాలి.

మం. ప్రరేభధీం భరస్వ గోవిదం వసువిదమ్
దేవత్రేమాం వాచం శ్రీణేహేషు ర్నా వీరస్తారమ్

అర్థం : ఓ విద్వాంసుడా! భూమిని పొందేవాడు, ధనాన్ని పొందేవాడు బుద్ధిని మంచిరీతిగా వహించుగాక. బాణం లక్ష్యంవైపు వెళ్ళడానికి సిద్ధమైనట్లు ఈ వాక్కు విద్వాంసుల నడుమ పక్వతను పొందుగాక.

భావం : చతురుడైన ధనుర్ధారి బాణము లక్ష్యాన్ని మాత్రం చేరినట్లు మనుష్యుడు విద్వాంసులలో కూర్చుని రాజ్యం, ధనం పొందడానికి నిశ్చయించుకొని ప్రయత్నం సఫలం చేసుకోవాలి.

మం. రాజ్ఞో విశ్వజనీనస్య యో దేవోమర్త్యా అతి
వైశ్వానరస్య సుష్టుతిమా సునోతా పరిక్షితః

అర్థం : విజయాన్ని కోరే పురుషుడు మనుష్యులలో గుణవంతుడు, అందరికీ హితం కలిగించేవాడు, అందరికీ నాయకుడు, అన్నివిధాలా ఐశ్వర్యం కలవాడు కావాలి. అటువంటి రాజుయొక్క ఉత్తమ స్తుతిని బాగా చెయ్యి.

భావం : అందరికీ హితం కలుగజేసే మనుష్యుని నుండి మనుష్యులందరూ ఉత్తమ గుణాలను గ్రహించాలి.

మం. పరిచ్ఛిన్నః క్షేమ మకరోత్ తమ ఆసన మాచరన్
కులాయన్ కృణ్వన్ కౌరవ్యః పతి ర్వదతి జాయయా

అర్థం : 'అంధకారాన్ని ఛేదించే రాజు ఆసనాన్ని గ్రహించి ఆనందాన్ని కలిగించాడు. గృహాలను నిర్మించే కార్యాలను రాజు చేయిస్తున్నాడు' అని

భర్త భార్యతో చెబుతున్నాడు. న్యాయంగా పాలించే రాజును గురించి ఇంటిలో భార్యాభర్తలు మంచిగా చెప్పుకుంటారని భావం.

భావం : న్యాయం చేసేవాడు, ప్రజ్ఞాపాలకుడు అయిన రాజును గురించి గృహ యజమానుడు తన భార్యతో చెబుతున్నాడు.

మం. కతరత్ త ఆహరాణి దధి మన్థాం పరిశ్రుతమ్
జాయాః పతిం విపృచ్ఛతి రాష్ట్రే రాజ్ఞః పరిక్షితః

అర్థం : నాణ్యమైన ఏ వస్తువులు నీకోసం నేను తీసుకువచ్చేది? పెరుగు, చిక్కని మజ్జిగ, శ్రుతము, నెయ్యి మొదలైనవేమి తీసుకువచ్చేది? అని ఐశ్వర్యం కలిగిన రాజు పాలనలో భార్య భర్తను అనేక రీతుల అడుగుతోంది.

భావం : సునీతి గల రాజు రాజ్యంలో పాలు పెరుగు నెయ్యి మొదలైనవి అధికంగా పొంది జనులు సుఖంగా ఉంటారు.

మం. అభీవస్వః ప్రజిహీతే యవః పక్వః పథో బిలమ్
జనః సభద్ర మేధతి రాష్ట్రే రాజ్ఞః పరిక్షితః

అర్థం : అన్నిరకాల ఐశ్వర్యం కలిగిన రాజు రాజ్యంలో జనం మంచి నివాసం కలిగినవారై, బాగా పండిన యవ మొదలైన ధాన్యాలు గాదె మొదలైన చోట్ల దాచుకుని అవసరమైనపుడు పొందుతూ ఆనందిస్తారు.

భావం : రాజు ఏర్పాటు చేసిన మంచి వ్యవస్థ వల్ల రైతులు మొదలైన ధనవంతులు పండిన పంటను ఒకచోట పాతర మొదలైన వాటిలో భద్రపరచి అవసరమైనపుడు తీసుకొని వాడుకొని సుఖించాలి.

మం. ఇన్ద్రః కారుమబూ బుధ దుత్తిష్ఠ విచరా జనమ్
మమే దుగ్రస్య చర్మధి సర్వఇత్తే పృణా దరిః

అర్థం : బాగా ఐశ్వర్యంకల ప్రభువు వృత్తినిపుణునితో చెప్పాడు 'లే! జనంలో సంచరించు. తేజస్వంతుడనైన నా యెడల భక్తితో ఉండు. ప్రత్యేకంగా శత్రువు కూడా నీకు తృప్తిని కలిగిస్తాడు. నీ వశంలో ఉంటాడని భావం.

భావం : ప్రతాపవంతులైన రాజు ఏర్పాటు చేసిన మంచి వ్యవస్థవల్ల మనుష్యులు మంచి ఉద్యమం కలవారై పరస్పరం విచారించుకోండి. రాజ భక్తులై దొంగలు మొదలైన ప్రజాశత్రువులను వశం చేసుకోండి.

మం. ఇహగావః ప్రజాయధ్వ మిహాశ్వా ఇహ పూరుషాః
ఇహో సహస్ర దక్షిణోపి పూషా నిషీదతి

అర్థం : ఓ గోవులారా! మీరీ గృహంలో నివసించండి. ఓ గుర్రాల్లారా! మీరూ ఇక్కడ ఉండండి. ఓ పురుషులారా! మీరిక్కడ వృద్ధి పొందండి. ఇక్కడ వేల దక్షిణలనిచ్చే పోషకుడైన గృహపతి కూడా ఉంటాడు.

భావం : ఉత్తమ రాజు చేసిన మంచి వ్యవస్థ వల్ల గృహస్థులారా! గోవులను, గుర్రాలను, మనుష్యులను వృద్ధి పొందించి పరస్పరం ఉపకారం చేసుకోండి.

మం. నేమా ఇన్ద్ర గావో రిషన్ మో ఆసాం గోప రీరిషత్
మాసా మమిత్రయు ర్జన ఇన్ద్ర మాస్తేన ఈశత

అర్థం : ఈ గోవులు, భూమి నశించకుండుగాక. వీటి రక్షకుడు నశించకుండుగాక. ఓ రాజా! (ఓ ఇంద్రా) శత్రుత్వాన్ని కోరే నీచ జనులు, దొంగలు వీటిని స్వాధీనం చేసుకొనకుందురు గాక.

భావం : రాజు బందిపోట్లు, దొంగలు మొదలైన వారినుండి పంట భూములు మొదలైన వాటిని రక్షిస్తూ ప్రజలను పాలించాలి.

మం. ఉపనోనరమసి సూక్తేన వచసా వయంభద్రేణ వచసావయమ్
వనాదధి ధ్వనో గిరో నరిష్యేమ కదాచన

అర్థం : ఓ రాజా! మాకు నీవిపుడాదరంతో ఆనందం ఇస్తున్నావు. వేదోక్త వాక్యంతో, కల్యాణాన్ని కలిగించే వాక్యంతో మేము క్లేశాలనుండి వేరుపడి గొప్ప ధ్వని కలవారమై వాక్కునెపుడూ నష్టం చెయ్యం.

భావం : రాజు, ప్రజలు పరస్పరం ఉపకారం చేసుకొని దృఢ ప్రతిజ్ఞతో ప్రపంచంలో సుఖం పెంపొందించుకోవాలి.

మం. యస్సభేయో విదథ్వః సుత్వాయజ్వాథ పూరుషః
సూర్యం చామూరిశాదస స్తద్ దేవాః ప్రాగకల్పయన్ 128 సూక్తం

అర్థం : సభలో చతురుడైనవాడు, విద్వాంసులలో ప్రశంసనీయుడు, తత్త్వరసాన్ని వెలువరించేవాడు, కలుపుగోలుతనం కలవాడు, యజ్వ అయినవాడు పురుషుడు. ఆ సూర్యునితో సమానంగా ప్రతాపం కల పురుషుని నిశ్చయించి హింసకులను నాశం చేసే విద్వాంసులు మొదట ఉచ్చస్థానాన్ని ఏర్పరిచారు.

భావం : విద్వాంసులు జనులందరిలో నీతినిపుణుడైన మనుష్యుని సభాపతిగా చేసి ప్రజలను రక్షించాలి.

మం. యోజామ్యా అప్రథయ స్తద్ యత్ సఖాయం దుధూర్షతి
జ్యేష్ఠో యదప్రచేతా స్తదాహు రధరా గితి

అర్థం : కులస్త్రీని పడవేసేవాడు, మిత్రుని చంపదలచినవాడు, వయసు పెరిగినా అజ్ఞాని అయినవాడు అధోగతి పొందుతాడని చెప్పారు.

భావం : కులస్త్రీని పాపంలో తగుల్కొనజేసేవాడు, మిత్రద్రోహి, వయోవృద్ధుడైనా అజ్ఞాని అయినవాడు విద్వాంసులలో నీచగతిని పొందుతాడు.

మం. యద్భద్రస్య పురుషస్య పుత్రో భవతి దాధృషిః
తద్విప్రో అబ్రవీదు తద్ గంధర్వః కామ్యం వచః

మం. యశ్చ పణి రఘు జిష్ణో యశ్చదేవా అదాశురిః
ధీరాణాం శశ్వతా మహం తదపాగితి శుశ్రుమ

అర్థం : శ్రేష్ఠ పురుషుని కుమారుడు మొండివాడైతే బుద్ధిమంతుడు, విద్యావంతుడు అయిన పురుషుడు ఈ మనోహరమైన వచనం చెప్పాడు. చెడు వ్యవహారం కలవాడు, మిక్కిలి అల్పుడు, విద్వాంసులకు దానం చేయనివాడు అయిన వానిని ధీరపురుషులకు దూరంగా ఉంచడం యోగ్యమని మేము విన్నాము.

భావం : తమ సంతానం విద్వాంసులై, విద్వాంసులతో కలిసే రీతిగా విద్వాంసులు ప్రయత్నించాలి.

మం. యేచ దేవా అయజన్తాథో యే చ పరాదదిః
సూర్యో దివమివగత్వాయ మఘవానో విరప్శతే

అర్థం : ప్రజలను ఏకం చేసిన విద్వాంసులు, శత్రువులను పట్టుకున్నవారు, సూర్యుడు ఆకాశాన్ని పొందినట్లు గొప్ప ధనవంతుడైన సభాపతి మాకు లభించి వివిధ రీతుల శోభిల్లుతారు.

భావం : సూర్యుడు ఆకాశంలో ప్రకాశించి ఉపకారం చేసి శోభించినట్లు సభ్యజనులు, సభాపతి కలిసి ప్రపంచానికి ఉపకారం చేసి శోభించాలి.

మం. యోనాక్తాక్షో అనభ్యక్తో అమణివో అహిరణ్యవః
అబ్రహ్మా బ్రహ్మణః పుత్ర స్తోతా కల్పేషు సంమితా

అర్థం : వేదజ్ఞాని కుమారుడు వేదాన్ని ఎరుగక, చెడు వ్యవహారం కలవాడై ఖ్యాతి లేనివాడై, మణిరత్నములు లేనివాడై తేజోహీనుడవుతాడు. ఇది కర్మశాస్త్ర విధానాలలో ప్రమాణితమైనది.

భావం : విద్వాంసుని కుమారుడై కూడా చెడుమార్గంలో ఉండి మూర్ఖుడయితే అతడు నిర్ధనుడై తేజోవిహీనుడవుతాడు. ఇది వేదశాస్త్ర సిద్ధము.

మం. య ఆక్తాక్షః సుభ్యక్తః సుమణిః సుహిరణ్యవః
సుబ్రహ్మా బ్రహ్మణః పుత్ర స్తోతా కల్పేషు సంమితామ్

అర్థం : వేదజ్ఞాని కుమారుడు గొప్ప వేదజ్ఞాని, శుద్ధ వ్యవహారం కలవాడు, బాగా విఖ్యాతి కలవాడు అయితే అతడు మణులు కలవాడు, బాగా తేజస్వి అవుతాడు. ఇది కర్మశాస్త్ర విధానాలలో ప్రమాణితం.

భావం : విద్వాంసుని సంతానము విద్వాంసుడవడంచేత ప్రపంచంలో ప్రతిష్ఠను పొందాలి. ఇది వేదాభిప్రాయము.

మం. అప్రపాణాచ వేశన్తా రేవాఅప్రతి దిశ్యయః
అయభ్యా కన్యా కల్యాణీ తోతా కల్పేషు సంమితా

అర్థం : స్నానఘట్టంలేని సరోవరం, ప్రతిఫలాన్ని ఇవ్వని ధనవంతుడు, రోగాదులచే పీడింపబడుతూ సంతానం పొందడానికి అయోగ్యమైన సుందరకన్యలు ప్రయోజనం లేనివారు. ఇది కర్మశాస్త్ర విధానాలలో ప్రమాణితం.

భావం : స్నాన ఘట్టం లేకుండా నీటితో నిండిన సరోవరం, దానం చేయని గొప్ప ధనవంతుడు, సంతానాన్ని కనలేని రూపవంతురాలైన స్త్రీ ప్రయోజనం లేనివారు.

మం. సుప్ర పాణాచ వేశన్తా రేవాన్త్సుప్రతి దిశ్యయః
సుయభ్యా కన్యా కల్యాణీ తోతా కల్పేషు సంమితా

అర్థం : మంచి స్నానఘట్టం కల సరోవరం, బాగా దానంచేసే ధనవంతుడు, రోగరహితురాలై సంతానయోగ్య అయిన కన్య సఫలమైనవారు. ఇది కర్మ విధానశాస్త్రంలో ప్రమాణితం.

భావం : నీటితో నిండిన సరోవరం ఆ నీరు ఉపయోగపడినపుడు, ధనం తగినవిధంగా వ్యయమైనపుడు, రూపవతి అయిన స్త్రీ వీర సంతానాన్ని పొందినప్పుడు వీరికి సార్థక్యం కలుగుతుంది.

మం. పరివృక్తాచ మహిషీ స్వస్త్యా చయుధిం గమః
అనాశుర శ్చాయామీ తోతా కల్పేషు సంమితా

అర్థం : కర్తవ్యాన్ని వదలివేసిన పూజ్యురాలు, గుణవతి అయిన భార్య, సుఖంతో ఉంటూ యుద్ధంలో స్థిరంగా నిలబడని శూరుడు, సోమరి అయిన శాసకుడు పనికిరానివారు. ఇది కర్మవిధానశాస్త్రంలో ప్రమాణితం.

భావం : ఇంటి కర్తవ్యాలు మొదలైనవి వదలడం వల్ల గుణవతి అయిన స్త్రీ, రణాన్ని వదలడంవల్ల శూరుడు, ఆలస్యం చేయడంవల్ల శాసకుడైన పురుషుడు పనికిరానివారు.

మం. వావాతచమహిషీ స్వస్త్యా చ యుధిం గమః
శ్వాశుర శ్చాయామీ తోతా కల్పేషు సంమితా

అర్థం : అతిశీఘ్రంగా పనిచేసే మహిషి, సుఖంగా ఉంటూ యుద్ధంలో ముందుకు సాగే శూరుడు, బాగా వేగశీలుడైన పరిపాలకుడు సుఖాన్ని కలిగిస్తారు. ఇది కర్మ విధానశాస్త్రాలలో ప్రమాణితం.

భావం : కర్తవ్యంలో సమర్థురాలైన స్త్రీ, హర్షంతో యుద్ధానికి వెళ్ళే శూరుడు, ఆలస్యం చేయని స్వభావం కలిగిన శాసకుడు సుఖాన్ని కలిగిస్తారు.

మం. యదిన్ద్రాదో దాశరాజ్ఞే మానుషం విగాహథాః
విరూపస్సర్వస్మా ఆసీత్ సహ యక్షామ కల్పతే

అర్థం : గొప్ప ఐశ్వర్యం కలవాడా! దానపాత్రులైన సేవకులకు రాజువైన నీకోసం, నీచేత వేదోక్త సత్కర్మలు తారుమారు చేయబడ్డాయి. ఇది అందరికీ దుష్టవ్యవహారమయింది. మనుష్యులు పూజింపదగిన కర్మకోసం పరస్పరం కలిసి సమర్థులౌతారు.

భావం : వేద మర్యాదను వదలి స్వార్థంకోసం సేవకులను పీడించే మనుష్యుడు అందరికీ కష్టం కలిగిస్తాడు. కాబట్టి మనుష్యులెల్లపుడూ పరోపకారం చేయుదురు గాక.

మం. త్వం వృషాక్షుం మఘవ న్నమ్రం మర్యాకరో రవిః
త్వం రౌహిణం వ్యాస్యో వి వృత్రస్యా భినచ్ఛిరః

అర్థం : ఓ ధనవంతుడవైన మనుష్యుడా! నీవు బలం కలిగిన సూర్యునితో సమానమైన ప్రతాపం కలవాడవై, వ్యాపనశీలుడు వినమ్రుడు అయిన పురుషుణ్ణి ఆవాహనం చేశావు. నీవు మేఘాలతో సమానమైన అంధకారాన్ని వ్యాపింపజేసే పురుషుని విసరి పడవేశావు. శత్రు శిరస్సును తెంచివేశావు.

భావం : సభాపతి అయిన రాజు సూర్యునితో సమానమైన ప్రతాపం కలవాడై చతురులు, సుశిక్షితులు అయిన జనాన్ని ఆదరిస్తూ, దుష్టశత్రువులను నాశం చేయుగాక.

మం. యః పర్వతాన్ వ్యదధాద్ యో అపో వ్యగాహథాః
ఇన్ద్రో యో వృత్రహా న్మహం తస్మా దిన్ద్ర నమోస్తుతే

అర్థం : గొప్ప ఐశ్వర్యం కలిగిన నీవు పర్వతాలను వివిధ మార్గాలేర్పడే విధంగా ధరించావు. నీటిని వివిధ ప్రకారాలుగా ప్రవహింపజేస్తున్నావు. నీవు శత్రునాశకుడవు కాబట్టి నీకు చాలా నమస్కారాలు.

భావం : మనుష్యుడు పర్వతాలలో బాటలను ఏర్పరచి, నదులను కాలువల నుండి తీసి ప్రజలకు ఉపకారం చేస్తే జనులందరూ అతనిని ఆదరింతురు గాక.

మం. పృష్ఠం ధావన్తం హర్యో రోచ్చైః శ్రవస మబ్రువన్
స్వస్త్య శ్వ జైత్రా యేన్ద్ర మావహ సుప్రజమ్

అర్థం : వ్యక్తులను తీసుకువెళ్ళేవీ, బలపరాక్రమాల వెంట పరుగు పెట్టేవీ, గొప్ప కీర్తి కలిగినవీ అయిన గుర్రాలతో నిపుణులైన మానవులిలా చెప్పారు. ఓ గుర్రములారా! కుశలంతో జయించడం కోసం, సుందరమైన పూలదండతో సమానంగా సుందరసేన కలిగిన గొప్ప ఐశ్వర్యం కలవానిని తీసుకుని రండి.

భావం : చతురులు, విద్వాంసులు అయిన మనుష్యులు శ్రేష్ఠమైన గుర్రం మొదలైనవి తీసుకుని రాజుకు ఇత్తురు గాక. అతడు పెద్ద సేనతో రణక్షేత్రంలో దుష్ట శత్రువులను జయించు గాక.

మం. యేత్వా శ్వేతా అజైశ్రవసో హర్యో యుఞ్జన్తి దక్షిణమ్
పూర్వా నమస్య దేవానాం బిభ్ర దిన్ద్ర మహీయతే

అర్థం : ఓ నమస్కార యోగ్యుడవైన ఇంద్రా! వెండి మొదలైన ధనం కలవాడు, అజేయమైన కీర్తి కలవాడు, సమర్థుడూ అయిన మనుష్యుడు నిన్ను చేరుతున్నాడు. విద్వాంసులను పోషించే అతని ప్రాచీన నీతి పూజింపబడుతోంది.

భావం : చతురుడైన రాజు ధనికులు, విద్వాంసులు అయిన మనుష్యుల మంచి నీతిని ఎల్లప్పుడు ఆదరించు గాక.

ఇది తొమ్మిదో అనువాకంలో ముప్పై రెండో సూక్తం.

ముప్పై మూడో సూక్తం 129 సూక్తం

'ఏతా అశ్వా ఆప్లవన్తే' (అ 20-129) మొదలుకొని 'నీల శిఖండ వాహనః' (అ 20-132) వరకు 'ఐతశ ప్రలాపం' అనే పేరు గల భాగం. ఇది 76 పాదాల సముదాయం. దీనిలో పాదాలను లెక్కబెట్టాలి. వీటిలో ఉత్తమపదంతో స్తుతించాలి. వీటిలో ముందు మనుష్య ప్రయత్నోపదేశం చేయబడుతోంది.

మం. ఏతా అశ్వా ఆప్లవన్తే, ప్రతీపం ప్రాతి సుత్వనమ్

అర్థం : ఈ వ్యాపించే ప్రజలు, ప్రత్యక్షంగా వ్యాపించే పరమేశ్వరునికోసం వచ్చి చలిస్తున్నారు.

భావం : ప్రపంచంలో అన్ని పదార్థాలు పుట్టినవై పరమేశ్వరుని ఆజ్ఞయందు వర్తిస్తున్నాయి.

మం. తాసామేకా హరిక్నికా హరిక్నికే కిమిచ్ఛసి
సాధుం పుత్రం హిరణ్యయం, క్వాహతం పరాస్యః

అర్థం : వ్యాపించే ప్రజలమధ్య స్త్రీలు మనుష్యుల మీద ప్రీతి కలిగినవారు, మనుష్యుల మీద ప్రీతి కలదానా! నీవేమి కోరుతున్నావు? కార్యాన్ని సాధించేదానా? తేజోమయుడైన పుత్రుని ఎక్కడ శిక్ష విధించి నీవు దూరంగా విసరివేశావు.

భావం : సృష్టిలో తల్లి తన భర్తతో ప్రీతితో ఉండి సంతానాన్ని పొంది, అతణ్ణి చెడుదారిలో పడకుండా తప్పించి తేజస్విగా, సుమార్గంలో ఉండేవాడుగా తయారు చేయాలి.

మం. యత్రా మూస్తిస్రః శింశపాః పరిత్రయః
పృదాకవః, శృఙ్గం ధమన్త ఆసతే

అర్థం : తల్లి, తండ్రి, గురువు బాలకులను రక్షించేచోట ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధి దైవికం అనే క్లేశాలనే పెద్ద సర్పాలను నాగస్వరం ఊదినట్లు చేసి వేరుచేసి కూర్చుంటారు.

భావం : వంశంలో తల్లి, తండ్రి, ఆచార్యుడు మంచి శిక్షకులైనపుడు సంతానం ఎల్లపుడు సుఖంగా ఉంటుంది. కొండచిలువ శ్వాసచే చిక్కించుకొని ప్రాణులను తినినట్లు విద్వాంసులైన సంతానాన్ని మూడురకాల క్లేశాలు బాధించవు.

మం. అయన్మహాతే అర్వాహః స ఇచ్ఛంక్రం సఘాఘతే
సఘాఘతే గోమీద్యా గోగతీరితి పుమాం కుస్తే నిమిచ్ఛసి

అర్థం : ఓ కాంతా! జ్ఞానాన్ని పొందే మనుష్యుడు మహత్త్వంకోసం నిన్ను పొందుతాడు. ఆ మనుష్యుడు ఇచ్ఛ కలవానికి సహాయం చేస్తాడు. వేదవాణి నెరిగిన కాంత భూమియందు గతి కలిగిన ప్రజలకు సహాయం చేస్తుంది.

ఇది నిశ్చయము. ఓ మనుష్యుడా! పురుషుడు రక్షకుడై స్నేహ వ్యవహారంలో (ముందుకు) సాగుతూ ఉంటాడు.

భావం : స్త్రీ పురుషులు కలిసి ధర్మ వ్యవహారంలో ఒకరికి మరొకరు సహాయులై ప్రపంచానికి ఉపకారం చేయుదురు గాక.

మం. పల్ప బద్ధ వయో ఇతి, బద్ధవో అఘా ఇతి

అర్థం : ఓ రక్షకుడా! ప్రకృష్ట వ్యవస్థ చేసేవాడా! ఇది జీవనము. ఓ పాపులారా! మీకు ఈ ప్రాణి ప్రకృష్ట వ్యవస్థ ఏర్పరుస్తాడు.

భావం : మనుష్యులు సావధానులు, జితేంద్రియులు అయి పాపం నుండి తప్పించుకోవడంకోసం ఉపాయం చేయుదురు గాక.

మం. అజాగార కేవికా, అశ్వస్యవారో గోశపద్యకే
శ్యేనీపతీసా అనామయోప జిహ్వికా

అర్థం : సేవ చేసే బుద్ధి మెలకువగా ఉంటుంది. గుర్రాన్ని పొందడానికి గోవులు శయనించే చోటుకు వెళ్ళడం వ్యర్థము. సేవ చేసే బుద్ధి శీఘ్ర గమనంగల ప్రజలకు అధిపతి అయి రోగం లేనిదీ, ఉపకారం చేసేదీ అయిన వాక్కు కలదౌతుంది. సేవ చేసేదీ తగిన పనిలో లగ్నమయినదీ అయిన బుద్ధి నిశితమవుతుంది.

భావం : రౌతుకి ఉత్తమమయిన గుర్రం గుర్రపుసాలలో లభిస్తుంది. గోశాలలో లభించదు. ఉత్తమ బుద్ధికల మనుష్యుడు శీఘ్రంగా పనిచేసేవాడు, స్వస్థుడు, ఉపకారం చేసే వచనం పలికేవాడు అవుతాడు.

34 సూక్తం - 130 సూక్తం. దీనిలో మనుష్యులకు, పురుషార్థాల ఉపదేశం ఉంది. 1, 2, 3, 4, 5, 6 మంత్రాలు.

కో అర్య బహులిమా ఇషూని, కో అసిద్యాఃపయః, కో అర్జున్యాః పయః, కః కార్ష్ణ్యాః పయః, ఏతం పృచ్ఛ కుహం పృచ్ఛ, కుహాకం పక్వకం పృచ్ఛ.

అర్థం : ఏ మనుష్యుడు చాలా ఇష్ట వస్తువులను పొందాడు? ఎవడు బంధనం లేని క్రియను, అన్నాన్ని పొందాడు? ఎవడు ప్రయత్నం కలవాడై క్రియను, ఆహారాన్ని పొందాడు? ఎవడు ఆకర్షణం కలవాడై క్రియను, ఆహారాన్ని పొందాడు? ఈ ప్రశ్నలను అద్భుత స్వభావం కలిగిన మానవుణ్ణి అడుగు. అద్భుత స్వభావం, దృఢ చిత్తం కలవాణ్ణి అడుగు.

భావం : వివేకి అయిన మనుష్యుడు క్రియా కుశలుడైన విద్వాంసుని వల్ల శిక్షణను పొందుతూ విద్యాబలం వల్ల చమత్కారం, నూతనావిష్కరణలు చేయడానికి ప్రయత్నించు గాక.

మం. యవానోయతిస్వభిః కుభిః అకుప్యన్తః కుపాయకుః
ఆమణకో మణత్సకః, దేవత్వ ప్రతి సూర్య

అర్థం : యువకుడు (బలవంతుడు), ప్రయత్నం కలవారితో ప్రకాశించేవాడు, ప్రతాపం కలిగినవాడు, కోపగించనివాడు, భూమిని రక్షించేవాడు, ఉపదేశించేవాడు విద్వాంసులలో శక్తిమంతుడవుతాడు. ఓ విద్వాంసుడా! నీవు సూర్యునితో సమానమయిన (ప్రతాపం కల)వాడవు.

భావం : మనుష్యుడు శరీరాన్ని , మనస్సును బలంగా చేసుకుని భూమిని రక్షించుకోవాలి. విద్యను వృద్ధి పొందించుకోవాలి.

మం. ఏనశ్చి పజ్జికాహవిః, ప్రదు ద్రుదో మఘాప్రతి

అర్థం : పాపనాశాన్ని వ్యాపింపజేసేవాడు వడ్డీ వ్యాపారం చేయాలి. మంచి ప్రకారంగా మార్గం కలిగించే వాని వ్యాపారం ధనాన్ని కలిగిస్తుంది.

భావం : మనుష్యుడు సత్యంతో వ్యవహరిస్తూ ధనాన్ని పొందాలి.

మం. శృణ్ణ ఉత్పన్న, మాత్వాభి సఖానో విదన్

అర్థం : ఓ శత్రువా! నీవు హింసకుడుగా పుట్టావు. నీతో మా స్నేహితుడెపుడూ కలవడు.

భావం : మనుష్యుడు తన మిత్రులను దుష్టులతో ఎన్నడూ కలియనీయరాదు.

మం. వశాయాః పుత్రమాయన్తి, ఇరా వేదుమయందత, అథో ఇయన్నియన్నితి
అథో ఇయన్నితి, అథో శ్వా అస్థిరోభవన్, ఉయం యకాంశలోకకా

అర్థం : మనుష్యులు యోగ్యురాలయిన స్త్రీ కుమారుని చేరతారు. భూమికి చెందిన జ్ఞానం కలిగిన వ్యవహారాన్ని అతనికి నీవు నేర్పు. అతడు (ముందుకు) వెళ్ళుతూ వెళ్ళుతూ ఉంటాడు.

నీవు జ్ఞానోపదేశం చేయకపోతే కుక్కతో సమానంగా చంచల స్వభావం కలవాడౌతాడు. అతడు నిశ్చయంగా ఘోరపీడను కలిగించే భాగాన్ని చూస్తాడు.

భావం : విద్వాంసులు గుణవతి అయిన స్త్రీయొక్క సంతానానికి ఉత్తమ శిక్షణ ఇచ్చి, వారిని గొప్ప విద్వాంసులుగా, అభివృద్ధి యత్నం కలవారిగా చేయాలి. ఇలా చేయకపోతే బాలకులు గుణహీనులు, పీడ కలిగించేవారు అయి కుక్కతో సమానంగా అవమానం పొందుతారు.

ఇది ముప్పై నాలుగో సూక్తం. 131 సూక్తంవ ఐశ్వర్యోపదేశం

మం. ఆమినోనితి భద్యతే, తస్య అను నిభఙ్జనమ్, వరుణోయాతి వస్వభిః
శతం వా భారతీ శవః
శత మాశ్వా హిరణ్యయాః, శతం రథ్యా హిరణ్యయాః
శతం కుథా హిరణ్యయాః, శతం నిష్కా హిరణ్యయాః

అర్థం : విద్వాంసులు విఘ్నాలను అన్ని వైపులనుండి తరిమివేయాలి. ఇది శుభాన్ని కలిగించేది. హింసించే విఘ్నాలు నిరంతరం వినాశం పొందాలి. శ్రేష్ఠుడు శ్రేష్ఠ వస్తువులతో సాగుతాడు.

నూరు బంగారు గుర్రాలున్నాయి. నూరు పోషించే విద్యలు, బలము ఉన్నాయి. వంద బంగారు రథాలున్నాయి. నూరు బంగారు ఏనుగు అంబారీలున్నాయి. నూరు బంగారు హారాలున్నాయి.

భావం : మనుష్యుడు పూర్వ విద్వాంసులతో సమానంగా విఘ్నాలను తొలగించుకొని అనేక ప్రకారాలుగా ఐశ్వర్యం పొందాలి.

మం. అహల కుశ వర్తక, శఫేన ఇవ ఓహతే, ఆయవనే నతీ జనీ
వనిష్ఠా నావ గృహ్యన్తి, ఇదం మహ్యం మదూరితి, తే వృక్షాః సహ తిష్ఠతి

అర్థం : ఓ ప్రకాశించేవాడా! పాపాల్ని నాశం చేసేవాడా! ప్రవర్తించేవాడా! గిట్టచే కొట్టినట్లు శత్రువు చంపబడతాడు. ఉపకారం చేయడానికి వంగిన తల్లివలె నీవు రా. మిక్కిలి ఉపకారం చేసే జనం ఆగిపోరు. ఇది నాకు ఆనందాన్ని ఇచ్చే నీతి. ఇది నిశ్చయము. స్వీకరించడానికి యోగ్యమయిన పురుషులు కలిసి ఉంటారు.

భావం : స్త్రీ పురుషులందరూ ఎల్లప్పుడూ ఉపకారాలు చేస్తూ క్లేశాలనుండి తప్పించుకోవాలి. పరస్పరం ప్రీతితో ఉండాలి.

మం. పాకబలిః, శక బలిః, అశ్వత్థ ఖదిరో ధవః
అరదుపరమ, శయో హత ఇవ

అర్థం : రక్షించే శ్రేష్ఠ పురుషుడా! భోజనాదులు కానుక కావాలి. ఓ సమర్థుడా! రాజు తీసుకోదగిన పన్ను మొదలయినవి తీసుకోవాలి. బలవంతులలో ఆగ గలిగినవాడా! దృఢ చిత్తం కలవాడిగా ఉండాలి. హింసనుండి మళ్ళినవాడా! పాముపలె శత్రువును చంపాలి.

భావం : మనుష్యులు తగిన రీతిలో భోజనాదులను, ఉపహారాలను, దానాలను ఇస్తూ చేతులు మొదలయిన వాటిని పట్టుకుంటూ దృఢ చిత్తంతో శత్రువులను నాశం చేయాలి.

మం. వ్యాపపూరుషః, అదూహ మిత్యాం పూషకమ్
అత్యర్ధర్చ పరస్వతః, దౌవ హస్తినో దృతీ

అర్థం : మిక్కిలి గొప్ప స్తుతి కలవాడా! ఈ పురుషుడు నశించని జ్ఞానంలో పాలన సామర్థ్యం కలిగిన మనుష్యుని వృద్ధి పొందించే వ్యవహారం వ్యాపింపజేశాడు. కమ్మరి రెండు తోలు తిత్తులను గాలితో నింపినట్లు వ్యాపింప జేశాడు.

భావం : మనుష్యుడు విద్య మొదలయిన వాటిని పొందడంచేత ప్రపంచానికి ఉపకరిస్తూ తన కీర్తి వ్యాపింపజేసుకోవాలి. కమ్మరి కొలిమితిత్తిలో గాలిని ఊది వ్యాపింపజేసినట్లు కీర్తిని వ్యాపింపజేయాలి.

ముష్టై ఆరో సూక్తం

దీనిలో పరమాత్మ గుణాల ఉపదేశం ఉంది.

మం. ఆదలాబుకమేకకమ్, అలాబుకం నిఖాతకమ్
కర్కరికో నిఖాతకః, తద్ వాత ఉన్మథాయతి

అర్థం : ఆ బ్రహ్మ మునిగేది కాదు. ఒంటరిది. దృఢంగా ప్రతిష్ఠితమైనది. అది నిర్మించేది. దృఢంగా ప్రతిష్ఠితమైనది. వానిని వాయువు మంచి రీతిలో మననం చేస్తోంది.

భావం : ఆ పరబ్రహ్మ నిరాధారం, ఒంటరి, అందరికీ ఆధారం, అన్నింటినీ నిర్మించేది. వాయువు మొదలయిన పదార్థాలు పరమాత్మ ఆజ్ఞ ననుసరించి ప్రవర్తిస్తాయి. మనుష్యులందరూ ఆయనను ఉపాసింతురుగాక.

మం. కులాయమ్ కృణవాదితి, ఉగ్రం వనిష దాతతమ్
న వనిష దనాతతమ్

అర్థం : 'స్థానాలను ఆ పరమాత్మ నిర్మిస్తోంది' అని తలుస్తారు. దృఢమయినదీ, అన్నివైపులా వ్యాపించినదీ అయిన పదార్థాన్ని మనుష్యుడు ప్రార్థించాలి. వ్యాపించని పదార్థాన్ని అతడు కోరకూడదు.

భావం : పరమాత్మ ఈ గొప్ప గొప్ప లోకాలన్నింటినీ నిర్మించాడు. మనుష్యుడు తన హృదయాన్ని ఎల్లపుడూ విశాలంగా చేసుకుంటూపోవాలి. ఎప్పుడూ సంకుచితం చేయకూడదు.

మం. కఏషామ్ దున్దుభిం హనత్, యదీయం హనత్ కథం హనత్
కఏషాం కర్కరీ లిఖత్,
దేవీహనత్ కుహనమ్, పర్యాగారం పునః పునః

అర్థం : ఎవరు వీటి మధ్యలో జలతరంగిణులు మొదలయిన వాద్యాలను మోగించారు? ఎవరు వీటి మధ్య దుందుభిని మోగించారు. వాటిని వాయించే వారెలా వాయిస్తారు? ఉత్తములు ఇంటింటా మళ్ళీ మళ్ళీ వీటిని వాయించి చమత్కారం చూపించాలి.

భావం : ఎన్నబడిన విద్వాంసులు ప్రపంచంలో ఉత్తమోత్తమ వాద్యాలను వాయించాలి. వేద విద్యను గానం చేయాలి. మనస్సుకు, శరీరానికి బలాన్ని పెంపొందించుకుని అద్భుతమయిన పనులను ప్రకాశింప చేయాలి.

మం. త్రీణ్యుష్ట్రస్య నామాని, హిరణ్యం ఇత్యేకే అబ్రవీత్
ద్వౌ వా యే శిశవః, నీల శిఖణ్డ వాహనః

అర్థం : ప్రతాపంకల పరమాత్మకు మూడు పేర్లు ఉన్నాయి. హిరణ్యుడు, నీల శిఖండుడు, వాహనుడు అని బాలకులు కొందరు ఏవో చెబుతున్నారు.

ఈ మంత్రానికి

త్రీణ్యుష్ట్రస్య నామాని 13, హిరణ్య ఇత్యేకే అబ్రవీత్ 14, ద్వౌవాయే శిశవః 15, నీల శిఖండ వాహనః 16, అని ఒక పాఠం. దీనికి పైన భావం ఉంది. పండిత సేవన్‌లాల్ కృష్ణదాస్ గారు సంశోధించిన ప్రతిలో

"త్రీణ్యుష్ట్రస్య నామాని 13, హిరణ్య మిత్యేక మబ్రవీత్ 14, ద్వౌవాయశః శవః 15, నీల శిఖండ వాహనాత్ 16" అని పాఠం ఉంది.

ప్రతాపంకల పరమాత్మకు మూడు పేరులున్నాయి. తేజోమయుడు, కీర్తి, బలమూ అనేవి ఆ నామాలని ఒకరు చెపుతున్నారు. నీల నిధులను, నివాస స్థానాలను కలిగించే పరమేశ్వరుణ్ణి నిశ్చయించి చెప్పాలంటే ఆయన వ్యాపించి ఉన్నవాడు అని చెప్పాలి.

ముష్టి ఏడో సూక్తం

దీనిలో స్త్రీల కర్తవ్యోపదేశం ఉంది.

మం. వితతౌ కిరణౌ ద్వౌ తావా పినష్టి పూరుషః
నవై కుమారి తత్తథా యథా కుమారి మన్యసే

అర్థం : శారీరక బలం, ఆత్మిక పరాక్రమం అని ప్రకాశానికి రెండు కిరణాలు వ్యాపించి ఉన్నాయి. ఈ రెండింటిని దేహధారి జీవుడు అన్ని విధాలా సూక్ష్మ రీతిలో పనిలో ఉపయోగిస్తాడు. ఓ కోరదగిన కాంతా! నీవు భావిస్తున్నటువంటివాడు కాడతడు.

భావం : ప్రపంచంలో అన్ని ప్రాణులు శరీరం, మనస్సు స్వస్థతగా ఉంచుకోవడంవల్ల సూక్ష్మంగా ఆలోచించి పనులు చేయడం ద్వారా ఔన్నత్యం పొందాలి. స్త్రీలు మొదలయినవారు కూడా సమయాన్ని వ్యర్థ పరచకుండా ఎప్పుడూ పురుషార్థాలను సంపాదించాలి.

మం. మాతుష్టే కిరణౌ ద్వౌ నివృత్తః పురుషానృతే
నవై కుమారి తత్ తథా యథా కుమారి మన్యసే

అర్థం : నీ తల్లికి ప్రకాశించే కిరణాలు రెండు (శారీరక బలం, ఆత్మిక పరాక్రమం). శరీరధారులయిన జీవులను సత్య శాస్త్రంలో ప్రకాశించేవానిగా చేస్తాయి. ఓ కోరదగినకాంతా!... కాడతడు.

భావం : తల్లి మొదలయిన వారినుండి మంచి శిక్షణను పొంది సంతానమందరూ పురుషార్థాలు పొందుతారు. స్త్రీలు మొదలయినవారు కూడా సమయం వ్యర్థం చేయకుండా పురుషార్థాలను పొందాలి.

మం. నిగృహ్య కర్ణకౌద్వౌ నిరాయచ్ఛసి మధ్యమే
నవై కుమారి తత్ తథా యథాకుమారి మన్యసే

అర్థం : ఓ మధ్యస్థురాలుగా ఉండేదానా! కోమలమయిన రెండు చెవులను వశం చేసికొని, వినడంలో లగ్నంచేసి సంతానాన్ని నియమంలో నడిపిస్తావు. ఓకోరదగినకాంతా!....కాడతడు.

భావం : తల్లి మొదలయినవారు ఎంతో శ్రద్ధగా బాలకులకు మంచి శిక్షణ ఇవ్వాలి. స్త్రీలు మొదలయినవారు సమయాన్ని వ్యర్థం చేయకుండా పురుషార్థాలను సంపాదించాలి.

మం. ఉత్తానాయై శయానాయై తిష్ఠన్తీ వావ గూహసి
నవై కుమారి తత్ తథా యథాకుమారి మన్యసే

అర్థం : గొప్ప ఉపకారం కలదీ, నీతికోసం నిలబడేది ఆలస్య రీతులను నిశ్చయంగా నిరాదరంతో మూసివేస్తుంది. ఓ కోరదగిన కాంతా!...కాడతడు.

భావం : స్త్రీలు మొదలయినవారు తమ నైపుణ్యంచే చెడు రీతులు వదలి మంచి విధానాలు నడిపించాలి. స్త్రీలు మొదలయినవారు సమయాన్ని వ్యర్థం చేయకుండా పురుషార్థాలను సంపాదించాలి.

మం. శ్లక్ష్ణాయాం శ్లక్ష్ణియాం శ్లక్ష్ణ మేవావ గూహసి
నవై కుమారి తత్ తథా యథాకుమారి మన్యసే

అర్థం : కోమలం, మనోహరం అయిన వాక్కులో స్నేహాన్ని నిశ్చయంగా ఉంచి, చిత్తశుద్ధితో నీవు హృదయమనే గుహలో ఉంచుతావు. ఓ కోరదగిన కాంతా!... కాడతడు.

భావం : స్త్రీలు మొదలయినవారు మధుర మనోహర వాక్కుతో, శుద్ధప్రేమతో ఉపదేశం చేయాలి. స్త్రీలు మొదలయినవారు సమయం వ్యర్థం చేయకుండా పురుషార్థాలను సంపాదించాలి.

మం. అవశ్లక్ష్ణమివ భ్రంశ దన్త ర్లోమ మతి హ్రదే
నవై కుమారి తత్ తథా యథాకుమారి మన్యసే

అర్థం : దంతాలు, జుట్టు మొదలయిన పదార్థాలు లోపం కలిగి ఉన్న జలాశయంలో మలిన ప్రతిబింబం కనబడుతుంది. ఓ కోరదగిన కాంతా!...కాడతడు.

భావం : బురద నీటిలో కలుషరూపం కనబడుతుంది. శుద్ధమయిన నీటిలో శుద్ధరూపం కనబడుతుంది. అలాగే స్త్రీలు మొదలయిన జనులందరూ మానసికమయిన మాలిన్యాన్ని వదలి శుద్ధ వ్యవహారం చేయాలి.

ముప్పై ఎనిమిదో సూక్తం

దీనిలో బుద్ధి వృద్ధికి ఉపదేశం ఉంది.

మం. ఇహేత్థ ప్రాగపాగు ద గధరాగ్...అరాలా గుద భర్త్సథ

అర్థం : ఇక్కడ, ఈ విధంగా, తూర్పు పడమరలలో, ఉత్తర దక్షిణాలలో హింసా మార్గాన్ని ధిక్కరించేవాడు పరమాత్మ.

భావం : పరమాత్మ అన్నిస్థానాల్లో, అన్ని కాలాల్లో ఉన్నాడని ఎరిగి మనుష్యుడు హింసాకర్మకు దూరంగా ఉండాలి.

మం. ఇహేత్థ ప్రాగపాగ్...వత్సాః పురుషన్త ఆసతే

అర్థం : ఇక్కడ ఈ ప్రకారంగా నాలుగు దిక్కులలో ప్రియమయిన బాలకులు పురుషులు అవుతూ ఉండాలి.

భావం : అన్ని స్థానాల్లో, అన్ని కాలాల్లో మనుష్యుడు పురుషార్థాన్ని సంపాదించాలి.

మం. ఇహేత్థ ప్రాగపాగ్...స్థాలీపాకో విలీయతే
ఇహేత్థ ప్రాగపాగ్...సవై పృథు లీయతే

అర్థం : ఇక్కడ ఈ ప్రకారంగా నాలుగు దిక్కులలో గిన్నెలో వండిన అన్నం అనేక విధాలుగా లభిస్తోంది. ఇక్కడ ఈ ప్రకారంగా నాలుగు దిక్కులలో అన్ని భోజన పదార్థాలు నిశ్చయంగా, విస్తారంగా లభిస్తున్నాయి.

భావం : మనుష్యుడు అన్ని స్థానాల్లో ఎల్లప్పుడు భోజనాది పదార్థాలను పొందాలి.

మం. ఇహేత్థ ప్రాగపాగ్...ఆప్టే లాహణి లీశాథీ

అర్థం : ఇక్కడ, ఈ ప్రకారంగా నాలుగు దిక్కులలో ప్రేరేపించే బుద్ధి చలిస్తూ వ్యాపిస్తోంది.

భావం : విద్వాంసులందరూ తమ బుద్ధితో అన్ని వైపులా ప్రసరించి ప్రపంచంలో సంచరించాలి.

మం. ఇహేత్థ ప్రాగపాగ్ దగధరాగ్...అక్షిణీ పుచ్ఛిలీయతే

అర్థం : ఇక్కడ ఈ ప్రకారంగా నాలుగు దిక్కులలో వ్యవహార గ్రహణం చేసే బుద్ధి ప్రసన్నమవుతోంది.

భావం : మనుష్యులు తమ బుద్ధితో అన్ని పనులలో ప్రవేశించి ప్రసన్నంగా ఉండాలి.

ముష్టి తొమ్మిదో సూక్తం

దీనిలో మానవునికి కర్తవ్యోపదేశం ఉంది.

మం. భుగిత్యభిగతః శలిత్యపక్రాన్తః ఫలిత్యభిష్ఠితః
దున్ధుభి మాహననాభ్యాం జరితరోఽథామో దైవ

అర్థం : స్తుతి చేసేవాడా! పరమాత్మను దేవతగా తలచే విద్వాంసుడా! పాలించే పరమాత్మ ఎదురుగా లభించాడని శీఘ్రంగా వెళ్ళేవాడు సుఖాన్నుండి ముందుకు సాగుతున్నాడని, సిద్ధి పొందేవాడు అన్ని వైపులా ఉంటున్నాడని, ఢంకా వాయించి చెప్పుకుని మనం ఉత్థానాన్ని పొందుదాం.

భావం : మనుష్యులు పరమేశ్వరుడు చేసే ఉపకారాలను చూచి ఢంకా వాయించి ప్రయత్నంతో ఉపకారాలు చేయాలి.

మం. కోశబిలే రజని గ్రన్థే ర్ధాన ముపానహి పాదమ్
ఉత్తమాం జనిమాం జన్యా నుత్తమాం జనీన్ వర్త్మన్యాత్

అర్థం : రాత్రివేళ బంగారం, వెండి ఉంచే కుండకు బయట ముడి (తాళం) వేయడం, కాళ్ళకు చెప్పులు తొడగడం చేసి రక్షించినట్లు, మనుష్యులలో ఉత్తమ జన్మ శోభ పొంది అత్యుత్తమ గతిని పొందాలి. పుట్టిన పదార్థాలను మంచి బాటలో పొందాలి.

భావం : రాత్రి ధనాగారంలో బంగారం, వెండి ఉంచి రక్షించుకొన్నట్లు మనుష్యుడు శ్రేష్ఠ వంశంలో పుట్టి ఉత్తమ ప్రవర్తనతో ఉన్నతుడు కావాలి.

మం. అలాబూని పృషాతకా న్యశ్వత్థ పలాశమ్
పిపీలికా వటశ్వసో విద్యుత్స్వా పర్ణశఫో గోశఫోజరితరోఽ
థామో దైవ

అర్థం : స్తుతి చేసే జనులారా! పరమాత్మ నుపాసించేవాడా! ఆనప, పృషాతకం, రావి, మోదుగ, పిపీలిక, వటశ్వసం, విద్యుత్తు, స్వాపర్ణశఫం, గోశఫం మొదలయిన వృక్ష లతలను నాటి, మనం అన్ని వైపులా ఉత్థానాన్ని (అభివృద్ధిని) పొందుతాము.

భావం : మనుష్యులు వనం, పొలం మొదలయిన వాటిలో అనేకలతలు, వృక్షాలు నాటి బాగా ఉపకారాన్ని పొంది సుఖంగా ఉండాలి. ఇవి మనుష్యుడు చేయదగిన పనులు.

మం. వీ మే దేవాః అక్రం సతాధ్వర్యో క్షిప్రం ప్రచర
సుసత్యమిద్ గవా మస్యసి ప్రఖుదసి

అర్థం : హింసచేయని విద్వాంసుడా! ఈ విద్వాంసులు వివిధ ప్రకారాలుగా అభివృద్ధికై ముందుకు అడుగు వేశారు. నీవు వేగంగా ముందుకు సాగి

వృద్ధి పొందు. నీవు గొప్ప ఆనందంలో ఉంటావు. నీ వుంటావు. ఈ వాక్యం గుణాలను వ్యాఖ్యానించే వారికి గొప్ప సత్యం.

భావం : పూర్వం విద్వాంసులు కర్తవ్య కర్మలను చేసి గొప్పవారయ్యారు. మనం కూడా విద్వాంసుల వచనాలను గౌరవించి ముందుకు సాగి గొప్పవారమౌదాము.

మం. పత్నీ యదృశ్యతే పత్నీ యక్ష్యమాణా జరితరోఽథామో దైవ
హోతా విష్టీమేన జరితారోఽథామో దైవ

అర్థం : పత్ని ఇక్కడ పూజింపబడుతోంది. పత్ని చూడబడుతోంది. ఓ స్తుతించే జనులారా! పరమాత్మ నుపాసించే విద్వాంసుడా! అన్ని వైపులా ఉత్థానం (అభివృద్ధి) పొందుతున్నాం. విశేషకోమలత్వంతో నీవు దానం చేస్తున్నావు. ఓ స్తుతించే జనులారా! పరమాత్మ నుపాసించే వాడా! అన్ని వైపులా అభివృద్ధి పొందుతున్నాం.

భావం : భార్యాభర్తలు గుణవంతులు, పరమేశ్వర భక్తులు అయి ఆనందం పొందాలి.

మం. ఆదిత్యా హ జరిత రఙ్గిరోభ్యో దక్షిణా మనయన్
తాం హ జరితః ప్రత్యాయం స్తాము హ జరితః ప్రత్యాయన్

అర్థం : ఓ స్తుతించే జనులారా! అఖండబ్రహ్మచారులచేత విజ్ఞానుల కొరకు దక్షిణ (దానం, ప్రతిష్ఠ) సమర్పింపబడింది. ఆ దక్షిణనే వారు ప్రత్యక్షంగా పొందారు. దానిని నిశ్చయించడం కోసమే దానిని వారు ప్రత్యక్షంగా పొందారు.

మనుష్యులు పూర్వ విద్వాంసులతో సమంగా విద్వాంసుల ద్వారా ఉత్తమ శిక్షణను పొంది తప్పక ప్రతిష్ఠితులు కావాలి.

మం. తాంహజరితః ర్నః ప్రత్యగృభ్ణం స్తాము హ జరితర్నః ప్రత్యగృభ్ణః
అహా నేత రసం న విచేతనాని యజ్ఞా నేతరసం న పురోగవామః

అర్థం : ఓ స్తుతించే జనులారా! ఆ దక్షిణను మనకోసం విజ్ఞానులు ప్రత్యక్షంగా పొందారు. ఓ స్తుతించే జనులారా! దానిని నిశ్చయించడంకోసం మనకోసం మీరు ప్రత్యక్షంగా పొందారు. ఇపుడు వ్యాప్తిలో బలాన్ని కలిగించే వ్యవహారాన్ని వివిధచేతనుల కోసం యజ్ఞాల్లో (దేవపూజ, సంగతికరణ, దానాలలో) బలాన్ని కలిగించే వ్యవహారాన్ని మనం ముందుకు సాగి పొందుదాము.

భావం : పూర్వమహాత్ములు శ్రేష్ఠ కర్మల ద్వారా ప్రతిష్ఠను పొందినట్లు మీరు మేము కలసి విజ్ఞానం ద్వారా గొప్పదనం పొందాలి.

మం. ఉతశ్వేత ఆశుపత్వా ఉతో పద్యాభి ర్యవిష్ఠః
ఉతేమాశు మానం పిపర్తి

అర్థం : ఓ వేగంగా వెళ్ళే పురుషులారా! తెల్లని వర్ణంకల సూర్యుడు కూడా అత్యంత బలవంతుడై చలించడానికి యోగ్యమయిన గతులతో నిశ్చయంగా తప్పక పొందడానికి యోగ్యమయిన పరిమాణాన్ని శీఘ్రంగా నింపుతున్నాడు.

భావం : సూర్యుడు తన దారిలో సంచరించి ప్రపంచానికి ఉపకారం చేసినట్లు మనుష్యుడు వేదమార్గంలో ప్రవర్తించి శీఘ్రంగా ఉపకారం చేయాలి.

మం. ఆదిత్యా రుద్రా వసవస్త్వేను త ఇదం రాధః ప్రతి గృభ్ణీహ్యఙ్గిరః
ఇదం రాధో విభు ప్రభు ఇదం రాధో బృహత్ పృథు

అర్థం : ఓ శూరుడవైన సభాపతీ! అఖండ బ్రహ్మచారులు, జ్ఞానదాతలు, శ్రేష్ఠులయిన విద్వజ్జనులు నీ వెనుక ఉన్నారు. ఓ విజ్ఞానీ! ఈ ధనాన్ని నీవు ప్రత్యక్షంగా గ్రహించు. ఈ ధనం వ్యాపించేది, బలంతో కూడినది, చాలా విస్తీర్ణమైనది.

భావం : శూరుడు, ప్రతాపి అయిన సభాపతి మంచి నీతివల్ల జనులందరూ, అన్నివర్ణాలవారూ తమ కర్తవ్యాలను నెరవేర్చాలి. విద్యా ధనాదులందు బుద్ధిని నిలిపి ప్రపంచంలో సుఖాన్ని పెంపొందించాలి.

మం. దేవాదదత్వాసురం తద్వో అస్తు సుచేతనమ్
యుష్మా అస్తు దివే ప్రత్యేవ గృభాయత

అర్థం : ఓ మనుష్యులారా! విద్వజ్జనులు బుద్ధిమత్త్వం ఇత్తురు గాక. అది మీకు సుందర జ్ఞానమగు గాక. అది మీకు ప్రతి దినం కలుగుగాక. దాన్ని మీరు ప్రత్యక్షంగా గ్రహించండి.

భావం : మనుష్యులందరూ విద్వాంసుల ద్వారా శిక్షణను పొంది ఎల్లప్పుడు ఆనందాన్ని పొందాలి.

మం. త్వమింద్ర శర్మరిణా హవ్యం పారావతేభ్యః
విప్రాయ స్తువతే వసువనిం దురశ్రవసే వహ

అర్థం : గొప్ప ఐశ్వర్యం కలరాజా! నీవు నివాసం, ఆహారం దూరంగాను, సమీపంలోను ఉండే జనులకు చేర్చావు. ధనసేవనం వల్ల దుష్టమయిన అపయశస్సు తొలగించుకోవడంకోసం స్తుతించే బుద్ధిమంతునికి ఆ ధనం సమర్పించావు.

భావం : రాజు దూరంలోను, దగ్గర ఉండే ప్రజలకు ఆశ్రయమిచ్చి విద్యాధనాలచే వారికి ఔన్నత్యం కలిగించాలి.

మం. త్వమింద్ర కపోతాయ ఛిన్న పక్షాయ వఞ్చతే
శ్యామాకం పక్వం పీలుచ వారస్మా అకృణోర్బహుః

అర్థం : ఓ ఇంద్రా! నీవు రెక్కలు తెగినదీ, కదిలేదీ అయిన పావురానికి పండిన చేవధాన్యాన్ని, ఫలాల్ని, నీటిని చాలాసార్లు ఇచ్చావు.

భావం : రెక్కలు తెగిన పావురాన్ని అన్నమూ నీరు ఇచ్చి పోషించినట్లు రాజు దీనులకు, దుఃఖితులకు అన్నం మొదలయినవి ఇచ్చి రక్షించాలి.

మం. అరంగరో వావదీతి త్రేధా బద్ధోవరత్రయా
ఇరామహ ప్రశంస త్యనిరామప సేధతి

అర్థం : పూర్తి విజ్ఞానంకల పురుషుడు స్థానం, పేరు, జన్మలనే త్రాళ్ళచే బంధింపబడి ఉన్నాడు. మాటిమాటికి చెబుతున్నాడు. స్వీకరించడానికి యోగ్యమయిన ఆహారాన్ని అతడు ప్రశంసిస్తున్నాడు. నిందితమయిన ఆహారాన్ని అతడు తొలగజేస్తున్నాడు.

భావం : విద్వాంసుడు, ఆప్త పురుషుడు అయినవాడు తమ స్థానాన్ని పేరును జన్మను చక్కబరచుకొని, అధర్మాన్ని వదలిపెట్టి ధర్మంతో అన్నం మొదలయిన పదార్థాలను గ్రహించాలి.

నలభైయవ సూక్తం

దీనిలో రాజ ప్రజా కర్తవ్యోపదేశాలున్నాయి.

మం. యదస్యా అంహుభేద్యాః కృధు స్థూల ముపాతసత్
ముష్కా విదస్యా ఏజతో గోశఫే శకులా వివ

అర్థం : పాపంచే నాశమయ్యే ప్రజల చిన్న పెద్ద పాపాలను రాజు నాశంచేస్తున్నాడు. ఈ ప్రజలను దోచే స్త్రీ, పురుష చోరులను రాత్రి దొంగలనుండి, పగటి దొంగలనుండి ఆవు గిట్టలతో తొక్కినట్లు అణచివేస్తే కొంచెం నీళ్ళలో చేపలు కంపించినట్లు కంపిస్తారు.

భావం : రాజు న్యాయంతో ప్రజలందరూ చేసే చిన్న పెద్ద అపరాధాలను తొలగిస్తే చేపలు కొంచెం నీళ్ళలో గాబరా పొందినట్లు స్త్రీ పురుషులు రాత్రి, పగలు అపరాధాలు చేయడానికి కంపిస్తారు.

మం. యదా స్థూలేన పససాణౌ ముష్కా ఉపావధీత్
విష్వఞ్చౌ వస్యా వర్ధతః సికతా స్వేవగర్దభౌ

అర్థం : గొప్ప రాజ్య వ్యవస్థతో సూక్ష్మ న్యాయ పరిశీలనతో స్త్రీ, పురుష చోరులను; రాత్రి, పగలు దొంగతనం చేసేవారిని రాజు సంహరిస్తున్నాడు.

అపుడు అన్నివైపులా పూజింపదగిన, అతి శ్రేష్ఠమయిన స్త్రీ పురుషులు ఇసుక నేలలో పుట్టిన తెల్లతామర పూవులవలె వృద్ధి పొందుతారు.

భావం : రాజు సూక్ష్మ విచారంతో దుష్టులను దొంగలను నశింపచేసినప్పుడు శ్రేష్ఠులు గుణవంతులు అయిన స్త్రీ పురుషులు ఇసుక నేలలో తెల్ల కమలాలు పెంపొందినట్లు వృద్ధి పొందుతారు.

మం. యదల్పికా స్వల్పికా కర్కధూకేవ షద్యతే
వాసన్తిక మివ తేజనం యన్త్యవాతాయ విత్పతి

అర్థం : చిన్న ప్రజలలో చిన్న ప్రజలు అగ్ని జ్వాలలో కష్టాలను పొందినపుడు విద్వాంసులు పతనమవడంచే దుఃఖాన్ని తరమడంకోసం వసంతర్తువులో కలిగే ఉత్తేజంతో సమానంగా ఉత్తేజాన్ని శూరజనులు పొందుతారు.

భావం : సామాన్య ప్రజలకు అన్యాయం జరగడంవల్ల గొప్పవారికి హాని కలుగుతుంది. కాబట్టి శూరులు, వీరులూ అయిన పురుషులు వసంత ఋతువుతో సమానంగా ఉత్తేజితులయి శత్రువులను నాశం చేయాలి.

మం. యద్దేవాసో లలానుగ్ం ప్రవిష్టీమిన మావిషుః
సకులా దేదిశ్యతే నారీ సత్యస్యాక్షిభువో యథా

అర్థం : విద్వాంసులు ప్రాధాన్యాన్ని పొంది కోమలత్వంతో న్యాయరక్షణ కార్యంలో ప్రవేశించినట్లు, చిన్న పిల్లలు కలిగిన వారి కన్నులతో సత్యాన్ని మాటిమాటికీ ఉపదేశం చేసినట్లు రాజు న్యాయాన్ని ఉపదేశించాలి.

భావం : ప్రాచీనులు న్యాయాచరణంవల్ల ప్రధానులయినట్లు, తల్లి సత్యాన్ని ఉపదేశించి సంతానాన్ని గుణవంతులుగా తీర్చి దిద్దినట్లు రాజు ప్రజలకు హితాన్ని కలిగిస్తూ ఉండాలి.

మం. మహానగ్న్య తృప్నద్వి మోక్రదదస్థానాసరన్
శక్తికాననా స్వచమశకం సక్తుపద్యమ

అర్థం : మహాపురుషుడు శారీరక ఆత్మిక బలములను అధికం చేసుకుని తృప్తుడుగా ఉండాలి. అయోగ్యస్థానంలో వచ్చే గాబరా పొందకూడదు. సామర్థ్యాన్ని ప్రకాశింపజేసే మేము జ్ఞాతులకోసం భోజనం, సత్తుపిండి పొందుతాము.

భావం : సమర్థులైన పురుషులు అన్నాది పదార్థాలను సేకరించి, కఠిన సమయాల్లో తమ సోదరుడు మొదలయిన బంధువులను పోషించి రక్షించాలి.

మం. మహానగ్న్యులూఖల మతిక్రామ న్త్యబ్రవీత్
యథా తవ వనస్పతే నిరఘ్నన్తి తథైవతి

అర్థం : మహాపురుషుడు ఆత్మిక, సామాజిక బలాలచే రోలును దాటతాడు. ఇలా అంటాడు. "ఓ రోలా! జనులు నీలో ధాన్యాదులను దంచి సారాన్ని పోగుచేసినట్లు, జ్ఞాన విషయంలో గూడా చేయాలి".

భావం : రోటిలో దంచడం ద్వారా సారపదార్థం లభించినట్లు, మనుష్యుడు పరిశ్రమించి జ్ఞానాన్ని పొందాలి.

మం. మహానగ్న్యుపబ్రూతే భ్రష్టోథాప్యభూభువః
యథైవతే వనస్పతే పిప్పతి తథైవతి

అర్థం : గొప్పవాడు, పరిపక్వతను పొందినవాడు, అపవిత్రతను తొలగించే పురుషుడు, ఆత్మిక, సామాజిక బలాలను పొంది చెబుతున్నాడు. 'ఓ వనస్పతీ! (రోలూ!) మనుష్యుడు నీలో ధాన్యాదికాన్ని పోసినట్లు జ్ఞాన విషయంలో గూడా జరగాలి.

భావం : 6వ మంత్ర భావంవలె గ్రహించాలి.

మం. మహానగ్న్యుపబ్రూతే భ్రష్టోథా ప్యబూభువః
యథా వయో విదాహ్య స్వర్గే నమవదహ్యతే

అర్థం : గొప్పవాడు, పరిపక్వమయినవాడు, అశుద్ధిని తొలగించేవాడు అయిన పురుషుడు ఆత్మిక, శారీరక బలాలను పొంది చెపుతున్నాడు. "జీవనంలో వివిధ ప్రకారాలుగా తపస్సు చేసి స్వర్గంలో (సుఖ వివేషాల్లో) బంధనాలను భస్మం చేసినట్లు మనుష్యుడు చేయాలి".

భావం : మనుష్యుడు శుద్ధ చిత్తంతో బలాన్ని పెంపొందించుకొని విద్వాంసులతో సమానంగా బ్రహ్మచర్యం మొదలయిన తపస్సులు చేసి దుఃఖాలనుండి విముక్తిని పొందాలి.

మం. మహానగ్న్యుపబ్రూతే స్వసా వేశితం పసః
ఇత్థం ఫలస్య వృక్షస్య శూర్పేశూర్పం భజేమహి

అర్థం : మహాపురుషుడు ఆత్మిక సామాజిక బలాలను పొంది, అందమైన ఉపాయాన్ని పొంది, రాజ్యం ఏర్పాట్ల విషయంలో ఇలా అంటాడు. స్వీకరించడానికి యోగ్యమయిన ఫలాన్ని ఒక పప్పు మరొక పప్పులో కలిపి ఆస్వాదయోగ్యం చేసి సేవించినట్లు సేవించాలి.

భావం : మనుష్యులు అన్నాది పదార్థాలను పప్పుతో కలిపి శుద్ధం చేసినట్లు రాజ్యవ్యవహారాలను ఎల్లప్పుడు ఆలోచించి చేయాలి.

మం. మహానగ్నీ కృకవాకం శమ్యయా పరిధావతి
అయం నవిద్మ యో మృగః శీర్ష్ణాహరతి ధాణికామ్

అర్థం : మహాపురుషుడు ఆత్మికబల, సామాజిక బలాలతో కాడి కీలవంటి ఆయుధంతో కృత్రిమంగా మాట్లాడేవాని మీదికి పరుగు పెడతాడు. వానిని మేమెరుగుదుము. పశువువలె మూర్ఖుడు. కల్పిత విచారాలచేత రాజధాని మొదలయినవాటిని దోచుకుంటాడు.

భావం : మోసగాడు వంచనతో అస్వాభావికంగా అబద్ధం చెప్పి రాజధాని మొదలయిన పట్టణాలను దోచినపుడు రాజు వానిని శాస్త్రానుసారం దండించాలి.

మం. మహానగ్నీ మహానగ్నం ధావన్త మనుధావతి
ఇమాస్తదస్య గారక్ష యభ మామద్ధ్యోదనమ్

అర్థం : మహాపురుషుడు ఆత్మిక సామాజిక బలాలకై జ్ఞాని, మహాపురుషుడు, పరుగు పెట్టేవాడు అయినవాని వెంట పరుగు పెడతాడు. అది ఇతనికి భూరక్షణకు తోడ్పడుతుంది. ఓ న్యాయం చేసేవాడా! నాకు భోజనం పెట్టు.

భావం : గొప్పవాడు ఆత్మిక బలం, సామాజిక బలం పొందడానికి జ్ఞానులను అనుసరించాలి. రాజ్య రక్షణ చేసి ప్రజలను, పాలించాలి.

మం. సుదేవస్త్వా మహానగ్నీ ర్బబాధతే
మహతః సాధు ఖోదనమ్ కుసం పీవరో నవత్

అర్థం : ఓ ప్రజలారా! గొప్ప విజయాన్ని కోరే మహాపురుషుడు మిమ్ము గొప్ప ఆత్మికబల, సామాజిక బలాలద్వారా కన్నాలు వేసే పనులను మంచి రీతితో ఆపుతాడు. బలిసిన శరీరం కలిగిన ఆ పురుషులు పరస్పరం కలిసి ఉందురుగాక.

భావం : రాజు ప్రజలు కలిసినపుడు చోరులు మొదలయిన దుష్టులు ప్రజలను పీడించలేరు.

మం. వశా దగ్ధా మిమాఙ్గురిం ప్రసృజతోఽగ్రతం పరే
మహాన్ వై భద్రో యభ మా మద్ధ్యోదనమ్

అర్థం : ఓ విద్వాంసులారా! నిష్ఫలమైన ఉగ్రతను, విషాదులతో మండే వేలు మొదలయినవాటిని నరికి దూరంగా పడవేసినట్లు అన్ని విధాలా వదలి వేయండి. మహాపురుషుడే శుభాన్ని కలిగించగలడు. ఓ న్యాయం చేసేవాడా! నాకు భోజనంపెట్టు.

భావం : పాము మొదలయినవాటి విషాలతో మండే వేలు మొదలయిన అవయవాలను శరీర రక్షణంకోసం వేగంగా నరికి విసరి వేసినట్లు,

విద్వాంసులయిన పురుషులు నిష్ఫలమయిన ప్రచండ నీతిని వదలి ప్రజలకు సుఖాలను ఇత్తురుగాక.

మం. విదేవస్త్వా మహానగ్నీర్విబాధతే మహతః సాధుఖోదనమ్
కుమారికా పిఙ్గలికా కార్దభస్మా కుధావతి

అర్థం : ఓ ప్రజలారా! అహంకారంలేని మహాపురుషుడు మీనుండి గొప్ప ఆత్మికబలం సామాజిక బలాల ద్వారా కన్నం వేయడం మొదలయిన పనులను మంచి రీతిలో తొలగిస్తాడు. శోభించేదీ, కోరుటకు యోగ్యమయిన కన్య బురద, బూడిద, భూమిపై పడవేసి (ఇంటిని) శుద్ధం చేసినట్లు సమాజాన్ని బాగుచేస్తాడు.

భావం : శుద్ధ స్వభావం కలిగిన స్త్రీ చెత్త చెదారాన్ని ఇంటి బయటకు విసరివేసినట్లు రాజు ప్రజలూ కలిసి దొంగలు మొదలయిన దుష్టులను తరిమివేయాలి.

మం. మహాన్వైభద్రో బిల్వో మహాన్ భద్ర ఉదుమ్బరః
మహా అభిక్త బాధతే మహతః సాధుఖోదనమ్

అర్థం : శుభాన్నిచ్చే మహాపురుషుడే మారేడు చెట్టువలె ఉపకారి. మంగళదాత అయిన మహాపురుషుడే వేడిచెట్టుతో సమానమయిన ఉపకారి. ఓ విఖ్యాతుడా! మహాపురుషుడు గొప్ప ఆత్మికబల సామాజికబలాలచే కన్నం వేయడం మొదలయిన పనులను మంచి పద్ధతిలో తొలగిస్తాడు.

భావం : మహాపురుషులందరు ప్రయత్నంచేసి ప్రజలను దుష్టులనుండి రక్షించాలి.

మం. యః కుమారీ పిఙ్గలికా వసన్తం పీవరీ లభేత్
తైల కుణ్డ మివాజ్యుష్ణం రోదన్తం శుదముద్ధరేత్

అర్థం : బలిసిన శరీరం కలదీ, శోభించేదీ, కోరుటకు యోగ్యమయినదీ అయిన కుమారి ప్రయత్నంతో వసంత రాగాన్ని పొందినట్లు, వేడిగా ఉన్న నూనె కుండంలో పెట్టిన అంగుష్ఠాన్ని పైకి తీసినట్లు, రోదించే జ్ఞానదాతను లేవదీయాలి.

భావం : స్త్రీలు ప్రసన్నులై వసంతరాగాన్ని గానం చేసినట్లుగా కాగే నూనె నుండి వ్రేలిని పైకి తీసేసుకున్నట్లు రాజు ప్రసన్నుడై క్లేశాలనుండి విద్వాంసులను ఉద్ధరించాలి.

* * *